ప్రజాశక్తి

Vol. 3, no. 23

(Dec. 8, 1943)

బెజవాడ, 1943

Record no. 683

Prajāśakti

Vol. 3, no. 23

(Dec. 8, 1943)

Bejavāḍa, 1943

Record no. 683

0-2-0 Regd. No M. 4486

ప్రజాశక్తి

భారత కమ్యూనిస్టుపార్టీ, ఆంధ్రకమిటీ పత్రిక

సంపుటి 3 సంచిక 23 | : సంపాదకవర్గం : మద్దుకూరి చంద్రశేఖరరావు (సం) కంభంపాటి సత్యనారాయణ ★ పుచ్చలపల్లి సుందరయ్య తుమ్మల వెంకటరామయ్య చలసాని వాసుదేవరావు | బుధవారం 8-12-43

రెడార్మీ వైద్య సౌకర్యాలు సాటిలేనివి

క్రర్నల్ ఎలియట్ కట్లర్ యూరపురంగాల్లో అమెరికా సేనలకు శస్త్రచికిత్సలో ప్రధాన సలహాదారుడు. వీరు ఇటీవల రష్యా యుద్ధరంగాల్లో పనిచేస్తున్న హాస్పిటళ్ళను చూచివచ్చారు. సోవియట్ సేనలకున్న వైద్యసౌకర్యాలను గురించి ఇలా అన్నారు :

"రష్యన్ వైద్య సౌకర్యాలు బ్రిటిష్ అమెరికన్ వాటికన్నా మేలయినవి. గాయపడి, హాస్పిటళ్ళలో చేర్చబడిన రష్యన్ సైనికుల్లో ముప్పాతికపాళ్లు నాలుగువారాల్లోనే తిరిగి యుద్ధరంగానికి పోగలుగుతున్నారు. గాయపడిన రష్యన్ సైనికుని దెబ్బలకు కట్లు కట్టిన వెంటనే అతనికి క్షౌరంచేసి, వేడినీళ్ళలో శుభ్రంగా స్నానం చేయిస్తారు. దీనిఫలితంగా సైనికుని అలసట అంతా పోతుంది. ప్రశాంతంగా ఉంటాడు. ఆపరేషన్‌ని చక్కగా ఓర్చుకోగలుగుతాడు. సైనికుడు తేరుకొంటున్న సమయంలో సరికొత్తరకం మరతుపాకుల నమూనాలిచ్చి, వాటిని విప్పడం, తిరిగి కూర్చడం నేర్పుతారు.

యుద్ధరంగంలో దెబ్బతిని పడిపోయిన వారిని తీసుకురావడానికి ఉన్న దళాల్లో నూరింట 80 మంది స్త్రీలే. ఈ దళాలు చాల ఎక్కువగ నష్టపడుతుంటాయి. ఎక్కువమంది గాయపడిన వారిని తెచ్చినందుకు సంఖ్యనుబట్టి వేరువేరు గౌరవచిహ్నాలను బహూకరిస్తుంది ప్రభుత్వం.

మాస్కోలోని హాస్పిటళ్ళ నిర్వహణ ప్రపంచంలోని ఇతర నగరాలన్నింటిలోకన్నా ఉత్తమంగా ఉంది. మాస్కో హాస్పిటళ్లలో ఉత్తమమయిన సాధనాలున్నాయి. వాటిలో ఎక్కువ బ్రిటన్, అమెరికాలనుంచి వచ్చినవి.

ఈ యేడు రష్యాలో 40 వేల డాక్టర్లు పట్టభద్రులయారు. వీరిలో నూరింట 80 మంది స్త్రీలు.

రష్యన్లు ఎంతకయినా ఓర్చుకోగలరు. ఇతరుల సహాయం లేకుండానే ఈ యుద్ధం గెలువగల సమర్థులు."

"నేడే రాజకీయపార్టీలన్నీ ఏకంకాకపోతే అవి ఉండీ ప్రయోజనంలేదు"

"ఈనాడు హిందువులను ముంచెత్తుతున్న కష్టాలే ముస్లింలనుకూడా ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి ఈ జాతీయ సంక్షోభ పరిస్థితుల్లో రాజకీయ పార్టీలన్నీ ఏకం కాకపోతే. అవి ఉండి ప్రయోజనం లేదన్న మాట. ....హిందూ మహాసభకు, ముస్లింలీగుకి, కాంగ్రెసుకి అభిప్రాయ భేదాలున్నాయి– ఎవరూ కాదనరు. కాని, అవి అన్నదమ్ముల మధ్య అభిప్రాయభేదాలు మాత్రమే"–బెంగాలు సహాయార్థం పాట్నా (బీహారు)లో సమావేశమయిన అఖిలపక్ష సమావేశంలో బీహారురాష్ట్ర ముస్లింలీగు ఉపాధ్యక్షులు జఫర్ ఇమాం గారన్న మాటలివి.

ఆ సమావేశ వేదిక దేశభక్తు లందరికి కనులపండువు కూర్చగలదు. అధ్యక్షులు కాంగ్రెసుప్రముఖులు శ్రీ జాలేశ్వర్‌ప్రసాద్. వారిప్రక్క, ఒకవైపు హిందూ మహాసభ నాయకులు శ్రీ నవల్ కిశోర్ ప్రసాద్, వారి సరసను జఫర్ ఇమాంగారు. మరోవైపు అఖిలభారత కిసాన్‌సభ ప్రధాన కార్యదర్శి స్వామి సహజానంద సరస్వతి. పండిత యదునందన్ శర్మ, కామ్రేడ్ కార్యానంద శర్మలుకూడ వేదిక నలంకరించారు.

బీహారురాష్ట్ర ముస్లింలీగు అధ్యక్షుడు ఖాన్ బహదూర్ యస్. యం. ఇస్మయిల్‌గారు, కాంగ్రెసు యం. యల్. ఏ. శ్రీ జగ్‌జీవన్ రాయ్, "విజయీభవ" అని సమావేశాన్ని ఆశీర్వదించారు. ఒక్క వేదికపైని జాతీయ శక్తులన్నీ ఇలా కేంద్రీకృతం కావడం ఏ దేశ శక్తునికి గర్వకారణంకాదు ? ఈ నాయకుల సందేశాన్ని వినడానికి హిందువులు, ముస్లింలు–బీదలు, మధ్యతరగతివారు, విద్యార్థులు–అందరూ వేయిమంది వచ్చారు.

మొదట నమ్మకంలేదు

తన ఉపన్యాసం సాగిస్తూ జఫర్ ఇమాం గారిలా అన్నారు :

"ఆహారసమస్యా పరిష్కారానికి అందరం ఏకమై కార్యక్రమం వేసుకొందామని కమ్యూనిస్టులు మొట్టమొదట అన్నప్పుడు నాకంత నమ్మకం లేకపోయింది. కాని, ఈనాడు, ఐక్య కృషి ద్వారానే ప్రజలను కాపాడగలమని అనుభవంమీద గ్రహించగలిగాం.

"దేశాన్ని రక్షించుకోవడంకోసం అందరం ఏకంకావాలి."

శ్రీ నవల్‌కిశోర్ ఇలా అన్నారు :

"ప్రజల వొత్తిడి నిరంకుశాధి కారుల్ని లొంగదీయగలదని కమ్యూనిస్టులు చేసిన ప్రకటనల్ని నేను నమ్మలేక పోయేవాడిని. కాని, ఆవొత్తిడి ఫలితంగానే అధికారులు ఈనాడు ధాన్యం సరఫరా సన్నాహాలనన్నిటిని ఆహారకమిటీకి అప్పగించారు....

"ఆహారసమస్యపై మనం ఏకం కాగలిగినప్పుడు, ఇతర సమస్య లన్నిటిమీదకూడా మనం తప్పకుండా ఏకంకాగలం".

స్వామీ సహజానంద ఉపన్యసిస్తూ, ఆహారసమస్యపై కుదిరిన ఐకమత్యాన్ని రాజకీయ సమస్యలకుకూడా వ్యాపింపజేసి, జాతీయనాయకుల విడుదలను ఏకకంఠంతో కోరాలని ఉద్బోధించారు.

కామ్రేడ్ కార్యానందశర్మ బెంగాల్‌లోని నేటి భయంకర పరిస్థితులను కళ్లకు కట్టినట్లు చిత్రించాడు. ఆకలిమంటలలో పడి రాష్ట్రం అధోగతి పాలవుతున్నా అక్కడి రాజకీయ పార్టీలు తగాదాలు మానుకోలే దన్నాడు. ఆహారసమస్యపైని, బెంగాల్ సహాయం కోసం బీహారు ఐక్యతను సాధించింది. ఈ ఐక్యతను దేశమంతటా వ్యాపింపజేయటానికి బీహారు కృషిచేయాలని చెప్పాడు.

వీరు – వారు

ప్రజల చావుబ్రతుకును నిర్ణయించగల ఆహారసమస్య, దేశంయొక్క సుఖమో, దుఃఖమో తేల్చగల ఆహారసమస్య, దేశభక్తులను, దేశభక్తియుత పార్టీలను ఏకంచేస్తోంది. ఈ సమస్యే దేశద్రోహుల నిజస్వరూపాన్ని బయటపెట్టి, వారిని ప్రజలనుండి దూరం చేస్తోంది.

పాట్నా సమావేశంలో ఈదిగువ తీర్మానాన్ని ప్రతిపాదించారు :

"ఆహారసమస్య విషమించి, నేడు మన సామాజిక, ఆర్థిక, రాజకీయ జీవనాన్నే విచ్ఛిన్నంచేసే దశకువచ్చింది. ఈపరిస్థితులిలాగే కొనసాగినట్లయితే మనప్రజ పూర్తిగా నాశనమయి, మనదేశం విదేశదండయాత్రకు బలికాకతప్పదు. బెంగాల్, ఒరిస్సా, ఆంధ్రా, మలబార్ - ఈ రాష్ట్రాల స్థితి చాల ఆందోళనకరంగాఉంది. విదేశదండయాత్ర భయం కూడా ఈ రాష్ట్రాలకే చాల ఎక్కువగా ఉంది.

"ఈభయంకర పరిస్థితుల్లో, తమతమ తగావాలను మరచిపోయి, ప్రజలను కాపాడడంకోసం ఏకం కావలసిందని దేశంలో అందరికీ మా మనవి. బీహారులో ఏర్పడిన ఈ అన్నిపక్షాల ఐక్యత జాతీయైక్యతకు, రాజకీయ పరిష్కారానికి అవకాశమివ్వగలదు."

సమావేశం అంతా జయజయ ధ్వానాలతో ఈ తీర్మానాన్ని ఆమోదిస్తూంటే, ముగ్గురు దీనికి ప్రతికూలంగా చేతులెత్తారు. జఫర్ ఇమాంగారు తనకళ్లనే తాను నమ్మలేకపోయాడు. "ఆ ముగ్గురు జాతీయైక్యతకు వ్యతిరేకులా ?" అని అడిగాడు. ఆముగ్గురు కాంగ్రెసు సోషలిస్టుముఠాకు చెందిన దేశద్రోహులు. శ్రీ జాలేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ ఉంటే, మధ్యలేచి, 'కాంగ్రెసు వర్కింగు కమిటీ హుకుంలేకుండా కాంగ్రెసు వాదులు ప్రభుత్వంతో కలిసి పనిచేయవచ్చునా?" అని సవాల్ చేశారు.

"నాకు తెలిసినంతవరకు కాంగ్రెసు నాయకులు ప్రమాదపరిస్థితులలో అలాగేచేశారు - అందులోను అది రాజకీయ సమస్య, తగాదాలకు కారణంకాని సమస్య, అయినప్పుడు, అలాచేయడానికి వెనుదీయలేదు. బీహారు భూకంపం ఇందుకొక ఉదాహరణ. ఈనాడు వర్కింగుకమిటీ బయటఉంటే, తప్పకుండా ప్రభుత్వ సహకారంతో పనిచేసిఉండేది." అని జాలేశ్వర్ ప్రసాద్ ఆద్రోహులకు బుద్ధిచెప్పారు.

లీగ్ మంత్రివర్గానికి సలహాలు

బెంగాల్‌ప్రధాని నాజిముద్దీన్ జన్మస్థానం ఢాకా నగరం. ఢాకా జిల్లా ముస్లింలీగ్ కౌన్సిలు ఈ మధ్య సమావేశమయి, లీగు మంత్రివర్గంయొక్క బలహీనతను నిర్మొహమాటంగా ఒప్పుకొంది. కొత్త పంటను లీగు మంత్రివర్గం తనంతట తానేకొని తిండిదొంగల ఆటలను కట్టిపెట్టాలంటే దానిపట్ల ప్రజల విశ్వాసం పూర్తిగాఉండాలి. అది ఈనాడు లేదని లీగ్ అంగీకరించింది. కాబట్టి ఈ విషయంలో ప్రభుత్వం అహారకమిటీలు, కరువు నివారణ కమిటీలు మొదలైన ప్రజాసంస్థల సహకారంతో పనిచేయాలని తీర్మానించింది. లీగుసభ్యులు ప్రజారక్షణ సంఘం, కిసాన్ సంఘం, కమ్యూనిస్టుపార్టీ మొదలైనవాటితో కలసి పనిచేయాలని హెచ్చరించింది.

ప్రజా సేవకులముందు తిండి దొంగలు నిలవలేరు

ఈవిధంగా ఒకవైపు నాయకవర్గాలు ఐక్యకృషియొక్క అవసరాన్ని రోజురోజుకూ ఎక్కువగాగ్రహిస్తూంటే, మరోవైపు ప్రజలు ఏకమై తిండిదొంగలపని పట్టిస్తున్నారు.

బెల్లారియా అనే ఊరు 24 పరిగణాలలోనిది. ధరల కంట్రోలు అమలులోకి రాగానే, అక్కడి తిండిదొంగలు బియ్యం దాచేశారు. కాని, అక్కడి ఆహారకమిటీ వలంటీర్లు చాల జాగ్రత్తగా ఉన్నారు. ఒక వర్తకుడు 80 మణుగుల ధాన్యాన్ని రహస్యంగా దాటించాలను కొంటూంటే, వీరికితెలిసింది. వెంటనే వీధి మూలల్లో సభలు జరిపి ప్రజలనందరిని కదిల్చారు. ఇది తెలుసుకొన్నాడు తిండిదొంగ. పోలీసులను మంచి చేసుకున్నాడు. వెంటనే ధీరేన్ దే, శైలజ ఛటర్జీ అను కమ్యూనిస్టు నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక ప్రజలందరూ వీరినెరుగుదురు– వీరినెందుకు అరెస్టుచేశారో కూడా గ్రహించారు. ఆందోళనకు తట్టుకోలేక మరునాడే పోలీసులు నాయకుల నిద్దరినీ విడుదలచేశారు. అంతేకాదు. ఆ తిండిదొంగ తన స్టాకును ఆహారకమిటీకి అప్పగించక తప్పిందికాదు.

హుగ్లిజిల్లాలోని కాబువా గ్రామంలో ఒక నాటిరాత్రి బండ్ల చప్పుడువిని ప్రజలు మేల్కొన్నారు. "ఇంతరాత్రప్పుడు ఈబండ్లెక్కడికి" అని వచ్చి పరిశీలంచారు. రెండు బళ్ళు ధాన్యంతో నిండిఉన్నాయి. పదిమంది కావలాతో ఎటో చేరుకుంటున్నాయి. గ్రామస్థులు వాటిని చుట్టేశారు. తరువాత బెదిరించారు. లాభంలేకపోయింది. కిసాన్‌సంఘం పిలుపుమీద, మూడు ప్రదేశాల గ్రామస్థులక్కడికి చేరుకున్నారు. ఆబళ్లలోని 500 మణుగుల ధాన్యాన్ని కుటుంబానికి 2½ శేర్ల చొప్పున కంట్రోల్ రేటుకు పంచుకున్నారు. ఇదంతా విని తిండిదొంగ "దొంగతనం !" అని కోర్టుకెక్కాడు. కిసాన్‌సంఘం నాయకత్వాన రైతులందరూ నిర్భయంగా కోర్టుకు హాజరయారు. చివరకు తిండిదొంగ కేసుమడిచి వెళ్ళవలసి వచ్చింది.

బెంగాలు రక్షణకు విద్యార్థుల ఐక్యకృషి

మొన్న ఎన్నుకోబడిన నూతన ఆంధ్ర రాష్ట్ర విద్యార్థి సంఘ కార్యనిర్వాహక వర్గం గతనెల 15, 16 తేదీలలో సమావేశమయి, ఐక్య విద్యార్థి ఉద్యమాన్ని నిర్మించడానికి రాష్ట్రమంతటా నిర్మాణయుక్తమైన రాజకీయ ప్రచారం జరపడానికి తీర్మానించింది. బెంగాలు సహాయార్థం విద్యార్థులు మరల నిధిని ప్రోగుచేయాలని తీర్మానించింది.

గుంటూరు పట్టణంలో ఈ నిధి వసూలుకై పట్టణ విద్యార్థిసంఘం, ముస్లిం విద్యార్థిసంఘం కలసి కృషిచేస్తున్నాయి. గతనెల 21 నుంచి 24 వ తేదీవరకు ముస్లిం విద్యార్థులు 4 గ్రూపు మీటింగులు జరిపారు. ఈ సభల్లో స్థానిక కమ్యూనిస్టులచేత కూడా ఉపన్యాసాలిప్పించాడు. బక్రీద్ పండుగనాడు బెంగాలు నిధికి తప్పక విరాళాలిస్తామని ముస్లింప్రజలు వాగ్దానాలు చేశారు. విద్యార్థుల ఈ ఐక్యకృషి ప్రశంసనీయం.

★

విద్యార్థులపై ఉపాధ్యాయుని పగ

సత్తెనపల్లి హైస్కూలు హెడ్‌మాస్టరు కంట్రోలు రేటుకు కాగితం కొని, విద్యార్థులకు అధిక ధరలకు అమ్మి, లాభంగుంజడం ఇదివరకు ప్రజాశక్తిలో ప్రకటించాం. ఇలా గుంజిన లాభాన్ని తిరిగి తమకు ఇచ్చేసేలా చెయడానికి విద్యార్థులు చాల ప్రయత్నించారు. కానిలాభం లేకపోయింది. దానిపై విద్యార్థులు హెడ్‌మాస్టరుమీద కేసుపెట్టారు. ఇందుకు పగబట్టి అతను 14 గురు విద్యార్థులను సస్పెండు చేశాడు. ఇది సత్తెనపల్లి ప్రజ అందరూ తీవ్రంగా ఖండించవలసిన చర్య.

బుధవారం ప్రజాశక్తి 8-12-43

చెరుకుపంటపై ప్రభుత్వ నిర్బంధం

మద్రాసు ప్రభుత్వం పంచదార మిల్లులకు చెరుకును సప్లయిచేయించుటకై 16-11-43 వ తేదీని ఒక నిర్బంధపు టుత్తరువును ప్రకటించింది. దాని ప్రకారం, యీ క్రింది ఏరియాలలో రైతులు అనుమతిలేకుండా చెరుకును బెల్లం ఆడకూడదు:

1. ఎత్తికొప్పాక కో-ఆపరేటివ్ ఎగ్రికల్చరల్ అండ్ ఇండస్ట్రియల్ సొసైటీ లిమిటెడ్ (విశాఖపట్నంజిల్లా) ఏరియాలో 17 గ్రామాలు.

2. విశాఖపట్నం షుగర్ అండ్ రిఫైనరీ లిమిటెడ్, తుమ్మపాల ఏరియాలో 16 గ్రామాలు.

3. బొబ్బిలి షుగర్ ఫ్యాక్టరీ ఏరియాలో 36 గ్రామాలు.

4. సీతానగరం షుగర్ ఫ్యాక్టరీ ఏరియాలో 126 గ్రామాలు.

5. కిర్లంపూడి ఫ్యాక్టరీ ఏరియాలో 3 గ్రామాలు.

5. వుయ్యూరు షుగర్ ఫ్యాక్టరీ ఏరియాలో 46 గ్రామాలు.

దేశంలో పంచదారకు కొరత యేర్పడినమాట వాస్తవమే. ఈ కొరతను తీర్చుటకు ప్రభుత్వం చర్యతీసుకోవడం కూడా అవసరమే. కాని, యిందు కొరకు చెరుకును పండించు రైతులకు నష్టం కలిగించి, మిల్లు యజమానులకు లాభం చేకూర్చి పెట్టరాదు.

కాని, ఈ ఆర్డరు సరిగా యిదే చేస్తుంది.

ప్రస్తుతం, మిల్లులలో చెరకు ధర టన్ను 1 కి రు. 14—20 మధ్య ఉంది. ఈ రేటుకు రైతు సప్లయి చేయడం చాల నష్టదాయకం. ధాన్యంధర, ఎరువులధర, రైతుకు కావలసిన జీవితావసర వస్తువుల ధరలు, విపరీతంగా పెరిగిపోయిఉన్న ఈ రోజులలో, పై రేటు యేమాత్రము గిట్టుబాటుకాదు. సాధారణంగా పంపింగ్‌స్కీము లన్నీ ఫ్యాక్టరీ యజమానులకే గుత్త అధికారం ఉండడంవల్ల, షేర్‌హోల్డర్లుకాని రైతులు వారి నిర్బంధానికి లోబడి, యెకరం- అరయెకరం చొప్పున నష్టానికి పండించవలసివస్తుంది. ఇటీవల బెజవాడవద్దనున్న పటమట పంపింగ్ స్కీమును శాంక్షన్‌చేసి, రైతులు చెరుకును పండిచాలనే షరతును విధించగా, ఆస్కీము క్రింది 9 గ్రామాల రైతులు చెరుకును వేయజాలమని స్పష్టంగా ఛీఫ్ ఇంజనీరుకు, ప్రభుత్వ ఎడ్వైజరుకు, తెలియజేశారు. ఇదేవిధంగా, పశ్చిమగోదావరిజిల్లా యందలి పెండ్యాల స్కీమును కూడా రైతులు వ్యతిరేకించారు.

ఈవిధంగా, రైతులకు నష్టంవచ్చే రీతిని ప్రభుత్వం ఉత్తరువులు జారీ చేయడం న్యాయంకాదు. పంచదార పరిశ్రమకు కూడా యిది నష్టమే. ఎందువల్లనంటే, రైతులు చెరుకును పండించడమే మానివేయవచ్చు. రైతుకు గిట్టుపాటు అయే ధరను నిర్ణయించి, చెరుకు పంటను ప్రోత్సహించాలిగాని, యీ విధమైన నిర్బంధపుటుత్తరువుల ద్వారా చెరుకుపంటను అరికట్టరాదు.

అదీగాక, యీ ఆర్డరులో కొన్ని అవక తవకలున్నాయి. ఉదాహరణకు, తుమ్మపాల ఫ్యాక్టరీ సంవత్సరానికి 25 వేల టన్నుల కంటె యెక్కువ ఆడదు. కాని, నిషేధం ఉన్న 16 గ్రామాలలో 1 లక్ష టన్నుల వరకు పండింది. మిగతా 75 వేల టన్నులు ఏమిగాను?

కాబట్టి, మద్రాసు ప్రభుత్వం తమ ఉత్తరువును యీ క్రింది విధంగా సవరించుకోవడం అవసరం:

1. రైతుకు గిట్టుబాటు అయే ధరను నిర్ణయించి, దాన్ని ఖాయం చేయాలి.

2. ఏయే ఫ్యాక్టరీకి ఎంతెంత చెరుకు కావాలో నిర్ణయించి, ఆ ఏరియాను కూడా ఉదహరించాలి. ఇతర ఏరియాలలో బెల్లం చేయకూడదనే నిషేధాన్ని తొలగించాలి.

3. ఇందుకై మిల్లు ప్రతినిధులు, రైతుల ప్రతినిధులు, ప్రభుత్వ ప్రతినిధులు, గల కమిటీలను యేర్పరచి, వాటిద్వారా పై రెండు విధులు నెరవేర్చాలి.

4. రైతులకు మిల్లులలో తూకం విషయములోను, డబ్బు యివ్వడంలోను, జరిగే అక్రమాలను అరికట్టాలి.

ఈ కోర్కెలకై రైతులు, రైతుసంఘాలు తీవ్రమైన ఆందోళన చేయాలి. పై సవరణలు జరిగే వరకు ఆందోళన మానకూడదు.

(4 వ కాలం తరువాయి)కందజేయడానికి, అవకాశంలేకపోలేదు. రెండుమూడు నెలల్లోకొత్త పంటను కొనివేయడం పూర్తి అవుతుంది. అప్పుడు, ప్రభుత్వంచేరదీసిన యీనిలవవ్యాపారస్తులు ద్రోహంచేసి తీరుతారు. వెంటనే మంత్రివర్గం ఆహారకమిటీల సహాయాన్ని కోరవలసియుంటుంది. లేదా, కరువు యింకా తీవ్రమై, మంత్రివర్గమేకూలిపోవలసివస్తుంది.

అన్ని రాజకీయ పార్టీలతోకూడిన ఐక్య ఆహారకమిటీలు కూడా తక్షణమే చేయగలిగిన పని ఎంతోఉంది. తిండిదొంగల్ని పట్టుకోవలసినవారు వీరేగాని, పోలీసులుకాదు. ప్రజలకు సరుకునుసక్రమంగాఅందజేయగలవారు వీరేగాని, లంచగొండి ఉద్యోగస్తులుకాదు. బెంగాల్ మంత్రివర్గంయొక్క వక్రమార్గాన్ని కాంగ్రెసువాదులు, లీగ్‌సభ్యులు, హిందూ మహాసభవారు—అందరూకలిసి సరిదిద్దవచ్చు. ఎక్కడికక్కడ ఐక్య ఆహారకమిటీలను యేర్పరచి, వాటిద్వారా ప్రజలకు తిండిని సప్లయిచేస్తూ, ప్రజల విశ్వాసాన్ని చూరగొంటే, అట్టి కమిటీల సహాయాన్ని మంత్రివర్గం నిరాకరించజాలదు. 6—12—43

★ మనరాజకీయాలు

బెంగాల్ వర్తకుల బండారం బయటపడింది!

—కంభంపాటి సత్యనారాయణ

బెంగాల్‌లో బియ్యం ధర ఇంచుమించు సగానికి తగ్గింది కొన్నిచోట్ల కంట్రోల్ రేటుకంటెకూడా తగ్గింది. దేశంలో సరుకే లేదని ప్రజల్ని దబాయిస్తూవచ్చిన నిలవ వ్యాపారస్తులంతా యిప్పుడు సరుకును బయటికి తీస్తున్నారు. "సరుకంతా ప్రభుత్వమే కొనేసింది. సైన్యానికి - విదేశాలకు పంపడం కోసం, నిలవచేసుకొంది. మేమేం చేయగలం?" అని నిన్నమొన్నటివరకూ వీరు చేసిన ప్రచారం కట్టుకధతప్ప మరొకటికాదని యిప్పుడు స్పష్టమయింది. ముక్కిపోతూన్న పాతసరుకును తక్కువ ధరకు అమ్మివేసి, చౌకగాకొన్న కొత్తపంటతో కొట్లను నింపడానికి సిద్ధంగా ఉన్నారు, యీ కరుడుకట్టిన స్వార్ధపరులు.

ఇంకా గుణపాఠం నేర్చుకోలేదు

కాని, బెంగాల్ మంత్రివర్గం యింకా గుణపాఠం నేర్చుకున్నట్లులేదు. మొన్న 1 వ తేదీని బెంగాల్ ప్రభుత్వంచేసిన ప్రకటనలో, కరువునివారణకై తాము తీసుకోదలచిన చర్యలను వివరించారు. మొదటివిషయం ఏమంటే, ఆహారపదార్థాలను సేకరించడానికీ, వాటిని ప్రజల కందజేయడానికీ, యిప్పుడున్న వ్యాపార పద్ధతులే సాధ్యమైనంతవరకు ఉపయోగిస్తాయి. అనగా, క్రిందటి సంవత్సరము ఏ తిండిదొంగలైతే శీతాకాలపు పంటను పూర్తిగా కొనివేసి రాష్ట్రాన్ని కరువురాక్షసి కప్పజెప్పారో, ఆతిండిదొంగలే రేపురాబోయే కొత్తపంటనుకూడా కొనివేయడానికీ, దాన్ని ప్రజల కందజేయడానికీ, చేయకపోవడానికీ అధికారాన్ని కలిగియుంటారన్నమాట!

రెండో విషయం, ప్రభుత్వం సరుకును స్వయంగా కొనదలచుకోలేదనీ, తనకు కావలసిన అత్యవసరమైన దాన్నిమాత్రం కొద్దిగా కొనవలసియుంటుందనీ, తెలియజేసింది. దీని అర్థం, ప్రభుత్వంయొక్క పోటీఉండదని హామీ యివ్వడమన్నమాట. అంతేకాదు. తానెంత సరుకును కొనదలచుకొన్నదీ తెలియజేయకపోవడంవల్ల, నిలవవ్యాపారస్తులు మళ్ళీ యధాప్రకారంగానే నేరాన్ని ప్రభుత్వంమీదికి తోయడానికి సందేహించరు.

మూడోవిషయం: ప్రభుత్వం, తాను కొనదలచుకున్న సరుకును యే తేదీలోగా కొనేయాలో ప్రకటించకపోవడంవల్ల, తిండిదొంగలు రైతుల్లో ఎప్పుడుపడితే అప్పుడు "అదుగో ప్రభుత్వ ఏజంట్లు! కమాండీరింగ్ చేయడానికొస్తున్నారు! త్వరగా మీ వద్దఉన్న సరుకును మాకు అమ్మివేయండి!" అని ప్రచారం చేయడాని కవకాశం ఉంది.

మంత్రివర్గంయొక్క ధీమా

కొత్తస్కీము ప్రకారం ధరల కంట్రోలు అతికఠినంగా అమలు జరుగుతుందని బెంగాల్ ప్రభుత్వం ఆశించుతోంది.

ప్రభుత్వ ప్రకటనలో యిలా ఉంది:

"ఈ రోజులగాయతు (డిసెంబరు 1) కొత్తకంట్రోల్‌రేట్లు అమల్లోకి వస్తాయి. ఈ రేట్లకంటెకూడా మార్కెట్ రేట్లు తగ్గడాని కవకాశం ఉంది. కాని, ప్రభుత్వంమాత్రం కంట్రోల్ ధరలకే ధాన్యంగాని, బియ్యంగాని, కొంటుంది."

ధరలకంట్రోలు తప్పకుండా అమలు జరుగుతుందని మంత్రివర్గం ఇంత ధీమాగా ఉండుటకు కారణం ఏమిటి?

—వ్యాపారం చేసే వర్తకులందరికి లైసెన్సు ఉండాలి కాబట్టి, వారు చట్టాన్ని ధిక్కరించరని ప్రభుత్వం యొక్క అంచనా. కాని, గత 6 నెలల అనుభవం ఏమి చెబుతోంది? వర్తకుల లైసెన్సులకూ, స్టాకుల కంట్రోలుకూ, ఎట్టి సంబంధమూ ఉండదు!

—ధరలు మళ్ళీ హెచ్చితే, ప్రభుత్వం స్వయంగానే సరుకును కొనడం వల్ల, ప్రభుత్వానికున్న రిజర్వును మార్కెట్లో పెట్టడం వల్ల, ధరలు తప్పకుండా తగ్గుతాయని ప్రభుత్వం ప్రకటించుతోంది. కాని, మరొకవైపు, చాలాతక్కువ సరుకును మాత్రమే ప్రభుత్వం కొంటుందనీ, ప్రజలకు చేయబోయే సప్లయి అంతా మామూలు వ్యాపారపద్ధతుల ప్రకారమేననీ, తెలియజేసింది. ప్రభుత్వం కొనబోయే సరుకు తక్కువైతే, రాష్ట్రానికి ప్రత్యేకంగా ఒక రిజర్వు ఉండడం, దాన్ని మార్కెట్లో పెట్టడంద్వారా అధికధరలను అరికట్టడం, ఎలా సాధ్యమౌతుంది?

—దొంగవ్యాపారం చేసే వర్తకులవద్ద ప్రభుత్వం సరుకును స్వాధీనం చేసుకొంటుందని బెదరించుతోంది. క్రిందటి 6 నెలల కాలం తాను ఫలించని యిట్టి బెదరింపులు యిప్పుడుమాత్రం ఫలించుతాయని గ్యారంటీ ఏముంది? తిండిదొంగల స్వభావాన్ని, వారి ఎత్తుగడలను, బెంగాల్ మంత్రివర్గం గ్రహించలేదన్నమాట.

—ఒక జిల్లాకు, మరొకజిల్లాకు మధ్య జరిగే ఎగుమతి దిగుమతులపై ప్రభుత్వానికి పూర్తి కంట్రోలు ఉంటుంది. కాబట్టి నిలవవ్యాపారస్తుల ఆటలు సాగవని బెంగాల్ ప్రభుత్వం యొక్క ఉద్దేశం. కాని తిండిదొంగలు రైతుల్ని ఉపయోగించుకొని, వారిద్వారానే యిట్టి వ్యాపారం చాకచక్యంతో కొనసాగించగలరనే విషయాన్ని మరచిపోయింది.

—ఈ స్కీమును సక్రమంగా అమలు జరపడానికి ఎనమండుగురు డెప్యూటీడైరెక్టర్లను, 20 గురు అసిస్టెంట్ డైరెక్టర్లను, 500 మంది ఉద్యోగస్తుల్ని ప్రభుత్వం నియమించబోతూంది. అనగా, పూర్వం మాదిరిగానే సరంకుశోద్యోగులెంతో నిజాయితీగా ప్రవర్తిస్తారని ముస్లింలీగ్ మంత్రివర్గం ఆశించుతోందన్నమాట. తిండిదొంగల శక్తిని తక్కువ అంచనా వేస్తోందన్నమాట.

నిల్వ వ్యాపారస్తుల్ని సంతృప్తిపరచడంకోసం

అసలు విషయం ఏమంటే, ముస్లింలీగ్ మంత్రివర్గం హిందూ నిలవ వ్యాపారస్తుల్ని సంతృప్తి పరచడంకోసం యీ స్కీమును స్వీకరించింది. బెంగాల్ ప్రభుత్వం తరఫున వ్యవహరించబోయే ఛీఫ్‌ఏజంటెవరో చూదాం: ముస్లిం—ఇస్పహానీ, హాస్సేన్; హిందువు—నసాణి; "జాతీయవాది"— డి. పి. ఖైతాన్; యూరపియన్—షా వాలెస్.

లీగ్ మంత్రివర్గాన్ని పడగొట్టడానికి ప్రయత్నిస్తూన్న డాక్టర్ శ్యామప్రసాదు నినాదాలను లీగ్ మంత్రివర్గమే ఒకవైపు అంగీకరిస్తూ, మరొకవైపు శ్యామప్రసాద్‌ను అనుసరించే నిలవవ్యాపారస్తుల్ని చేరదీసి, ఉభయులమధ్య చీలికను కలుగజేసిందన్నమాట. మొత్తం మీద, తిండిదొంగలందరి తోను రాజీచేసుకొని, బెంగాల్‌యొక్క భవిష్యత్తును వారి చేతుల్లో విడిచిపెట్టిందన్నమాట. అంతేగాని, ప్రజల ఐక్యతద్వారా తిండిదొంగల్ని అణచవచ్చుననే యదార్థాన్ని నిరాకరించిందన్నమాట.

అవకాశాలు

అయినప్పటికీ, బెంగాల్ కరువును నిర్మూలించడానికి, తిండిదొంగల్ని అణచడానికి, కొత్తపంటను ప్రజల (మిగతా 1 వ కలంలో)

★

భల్లూకస్వప్నం

—చిన్న కథ—

ఓ పదకొండు గంటలు కాకుండానే తద్దినం పెట్టుకుని, బరువుగా భోంచేసి, రికార్డుకట్టలు చంకని సంధించి, ప్లీడరుగుమాస్తా గవరయ్య కోర్టుకి చేరుకున్నాడు. ముందురాత్రి అన్నం లేదు, ఆ ఉదయం కాఫీలేదు. కళ్ళుమొయ్యా నిద్దర, కణతలనిండా నొప్పి, బాధపెటుతున్నా వేళకి కోర్టుకి వెళ్ళడం తప్పిందికాదు. ఆవసోపాలుపడుతూ కోర్టు వరండాలోకి వెళితే, జడ్జీగారింకా రాలేదు. షెడ్డులోకెళితే ప్లీడరు గుమాస్తాలు, కోర్టు చందుగు పెట్టెలమీద కునుకుతున్నవాళ్లు కునుకుతున్నారు. గుమిగూడి కబుర్లు చెప్పుకొనేవాళ్ళు చెప్పుకుంటున్నారు. కోర్టు అవరణనిండా గుంపులు గుంపులుగా పార్టీలంతా నిండిఉన్నారు.

"జడ్జీగారి కూతురికి పురుడొచ్చి ప్రాణాలమీది కొచ్చిందట" అని తోటి గుమాస్తా చెప్పేడు.

"జడ్జీగారొస్తారా?" అన్నాడు గవరయ్య.

"వస్తారుట"

జడ్జీగారువస్తారు. ఆయన చండశాసనుడు. నలుగురు లాంటివారు కారు. ప్రపంచం తల్లక్రిందులైపోయినా కోర్టు చెయ్యడం మానరు. త్వరితంగా, సునిశితంగా వ్యాజ్య నిర్ణయాలు చేస్తారు. గవరయ్య ఇంటికిపోయి పడుకోవచ్చునని అనుకోలేదు. అందుచేత తుంగచాప పరిచి, ఉత్తరీయం లుమ్మచుట్టి చందుగ మీద తల ఆనించాడు.

"ఏమండీ ఇదేమైనా న్యాయమే?" అంటూ ఒక పార్టీ ఎదురుగుండావచ్చి గవరయ్య నడిగేడు.

గవరయ్య న్యాయవాదిదగ్గర గుమాస్తా. కాను, వాళ్ళదగ్గరకొచ్చే పార్టీలంతా న్యాయాన్నికోరే వస్తారు. కాని గవరయ్య వాళ్ళందరికీ అన్యాయం చెయ్యడమే వృత్తిగా పెట్టుకున్నాడు. పార్టీకి జడ్జీగారు న్యాయమిస్తారు కాని, ఈలోగా ప్లీడరు గుమాస్తా చాలా అన్యాయం చేస్తాడు.

"ఇది బాగులేదు సుమండీ!" అన్నాడు మళ్ళా. గవరయ్య జవాబు చెప్పకండా ఉదంతాన్ని గమనిస్తున్నాడు.

"కిందటిదఫా సాక్షి పట్టీలకి ఇచ్చిన డబ్బు కట్టక వాడేసుకుని, చల్లగా వాయిదా వేయించేశారు. బాగుందా?"

"సర్వం తెలిసినవాళ్ళు. తమరూ అలాగ శలవిస్తే—మేమే నూతులోపడం? కిందటిదఫా సాక్షి పట్టీలు కట్టేమనుకొండి. సాక్షులంతా వొచ్చారనుకొండి. వొచ్చినా ఏమి ప్రయోజనం? ఆవేళ సెషన్సుకేసు ఉన్నాది. వాయిదా ఎలాగూ పడిపోను. కట్టకపోయామో లాభం పొందేమో. ఆ డబ్బు మాకిచ్చే వాలంట్రీకింద కట్టుకొండి. కాదన్నామా? కష్టపడుతున్న వాళ్ళం. ఏ కక్కుర్తీ పడకపోతే మా దినం తీరడంఎలాగ?..." అంటూ గవరయ్య సంజాయిషీ చెప్పడం ప్రారంభించాడు.

"అందుకే రష్యా ప్రభుత్వాన్ని మెచ్చుకోక తప్పడంలేదు. అబ్బబ్బ ఎంత దోపిడీ! ఎంత మోసం!"

"అయ్యా నేను చెప్పుతున్నాను — వాలంట్రీలో చూచుకొండి."

"ఈ ఆటలన్నీ రష్యాలో లాంటి ప్రభుత్వంవస్తే కట్టాలికాని, లేకపోతే ఈ మెషీను లోపడి మనిషి ఏమి నలిగిపోతున్నాడు!"

"మీరు చెప్పుతున్నది నాకు బోధపడ్డం లేదు"

"నీ కెలాగ బోధపడుతుంది నాయనా! కోర్టులంట తిరుగుతున్న పార్టీలకి బోధపడుతుంది. అణగారిపోతున్న వాళ్ళకి బోధపడుతుంది. వాళ్లని పీక్కు తినేనక్కలకీ, రాబందులకి బోధపడదు. ఈ వెధవడబ్బు అన్నది లేకండాపోతే- దురన్యాయాలు, సివిలుదావాలు ఎక్కడి వక్కడ మాయమైపోతాయి."

"సార్! మీ డబ్బు వాలంట్రీలో చూచుకొండి. మేమేం తినీలేదు."

"ఆఁ తినీలేదు! ఈ రాబందులకి........ అబ్బబ్బ ఏమి క్షోభపడుతున్నాను." అంటూ వెళ్ళిపోయాడు.

గవరయ్య పార్టీ తిట్టేడని ఆగ్రహించలేదు. ఆగ్రహిస్తే పనులు జరగవు. పార్టీ శాపాలతో నిద్రమత్తు సగంవొదిలినా, కణతల నొప్పి అధికమైపోయింది. ఆవేళ కోర్టులో దాఖలు చెయ్యవలసిన "ఈపీలు", ఫైలు చెయ్యవలసిన "మెమోలు" విచారణకి పోస్టు అయినవీ, ఇంకా వాయిదాలు పడుతూ కొన్నేళ్ళపాటు ఉండవలసినవీ, బోలెడన్ని. "ఓఎస్సులు" కావలసినన్ని ఉన్నాయి.

చాగంటి సోమయాజులు

వాళ్ళ ప్లీడరుగారు బారూములో బాతాఖానీ కొడుతున్నారు. గవరయ్య తల చందుగకి ఆనించి మళ్ళా కునకడం మొదలెట్టేడు.

"బాబూ ఇక్కడ టాంపులెండరు ఏరీ?" అంటూ పల్లెటూరి నాయుడొచ్చి గవరయ్య నడిగేడు.

"ఏంకావాలి?" అన్నాడు కళ్ళు విప్పకండానే.

"వకాల్తీకి రూపాయి ముద్దర వొట్టుకు రమ్మన్నారు."

"నేనిస్తానుతే"- అని రూపాయికాయితం పుచ్చుకొన్నాడు. జేబులో కాయితాల సుదతలు తీసి, అందులోంచి రూపాయిముద్ర తీసి యిచ్చాడు. నాయుడు ముద్రని తిరగబోర్లా చూసి "ఇదేటండీ — ఎనక వోడినట్టుంది?" అన్నాడు.

"తళ్లేదు పడదంటే పట్టుకురా" అని కళ్ళుమూసి జవాబుచెప్పి నాయుణ్ణి సాగనంపేరు. పొద్దున్న పార్టీలచేత స్టాంపులు తెప్పించి వాళ్ళు చూస్తూవుండగా అంటించి తరవాత తస్కరించేడు. ఆ బాపతు ముద్రలలో ఒక రూపాయి సొమ్ము అయింది.

జడ్జీగారొస్తారన్న వక్క బెదురుతో, జడ్జిగారొస్తే సాయంకాలం వరకూ నిలువు జీతం పుచ్చుకోవాలన్న కారణంచేత నిద్ర ఎంత ముంచుకొస్తున్నా నిగ్రహించుకొస్తున్నాడు.

షెడ్డులో పార్టీలూ, గుమస్తాలు కోర్టు భోగట్టాలు వొదిలిపెట్టి లోకాభిరామాయణంలోకి దిగారు. యుద్ధగమనాన్ని ప్రస్తావనలోకితెచ్చి, రష్యా క్షేత్రంలో పడ్డారు.

ఊళ్ళో పెద్దపెద్ద వాళ్ళు ఒకరిద్దరు "వెర్రి" వాళ్ళు తప్ప అంతా ఏముంది రష్యా పదివారాల్లో పడిపోతుందనుకున్నారు. ఇహనేముంది! మాస్కోనుంచి రష్యా ప్రభుత్వం పలాయనమైపోయిందన్నారు. రష్యా వెనక్కి మళ్ళిమళ్ళి, ఇప్పుడటునుంచిటు తిరిగి తిప్పికొట్టి సైనికలక్ష్యంతరువాత సైనికలక్ష్యం పునః స్వాధీనం చేసుకొంటూ జర్మనీచేత పలాయనమంత్రం చదివిస్తూంది. అడుగునుంచి ఆఫ్రికాపోయి, సిసిలీపోయి, ముసోలినీపోయి, యుద్ధమంతా తారుమారైపోతూంది. ఇవన్నీ చెప్పుకొంటూంటే ఒకరిద్దరికి విచారం పట్టుకుంది.

ఉన్నవాడూ లేనివాడూ, అందలమెక్కేవాడూ మోసేవాళ్లూ, ఆడామొగా, పెద్దంతరం చిన్నంతరం లేకండా — మనుషుల్నందర్నీ ఏకంచేసి, సర్వమంగళం చెయ్యడానికి తలపెట్టడం కలిమహాత్యంకాక ఇంకేముంది? మనం బతికుండగానే కలి అమలులోకి రావాలా - మనతరవాత తరానికి వాయిదా వేస్తే బాగుణ్ణు! అని ఒకపార్టీ మొరపెట్టుకొంటున్నాడు. "వాయిదాలు వెయ్యడం జడ్జీగారి చేతిలోలేక మనచేతుల్లోఉంటే బాగుణ్ణు" అని ఒక గుమస్తా జవాబు చెప్పేడు.

గవరయ్యకి రాజకీయాలు ఇష్టంలేకపోయినా, యుద్ధం భూగోళాన్ని చుట్టబెట్టినకొద్దీ దేశచరిత్ర తరువాత దేశచరిత్ర చొప్పున లోకచరిత్రంతా తెలుసుకొనకతప్పిందికాదు. కబుర్లు వింటూ, పత్రికలు చదువుతూ, రేడియోలు వింటూ ఉండడాన్ని, జనసామాన్యం యుద్ధం మూలాన్ని ఎంత నలిగిపోతున్నా, ప్రపంచ పరిస్థితుల్ని తెలుసుకోక తప్పిందికాదు. చందుగ పెట్టిమీద ఉత్తరీయం మడతల్లో తలపెట్టాడు గవరయ్య. మగతలో రష్యా ఇంకా ఇంకా గెలుస్తున్నట్టు, జర్మనీ ఓడిపోతున్నట్టు, బల్గేరియా - యుగోస్లావియా, దేశాలు ఎర్రజండా ప్రభుత్వాలు నెలకొల్పినట్టు కలగన్నాడు. ఆకలతోనే గాభరాపుట్టి మెలుకువవచ్చింది. నిజంకాదు స్వప్నమేనని నిర్ధారణ చేసుకొని కుదుటపడ్డాడు. సోషలిస్టు రాజ్యంవస్తే ఏముంది? డబ్బున్నవాళ్లు, వాళ్ళ లావాదేవీలు, వ్యాజ్యాలు ఉంటే, తన ప్లీడరుగారి ఫైలు ఇంకా ఇంకా పెరిగితే, తనకేమేనా ఉందనుకొని మళ్లా కునకడ మారంభించాడు.

ఆవేళ కోర్టులో సమశానపాలెం జమీందారు పిటీషను విచారణకొచ్చి. సదరు జమీందారుగారు వ్యవసాయదారులని బుజావయి, జడ్జీగారు వ్యవసాయదారుడే అని తీర్పు చెబితే, జమీందారుగారికి మూడులక్షల రూపాయలబుణాలు ఎగగొట్టడానికి అవకాశంవస్తే, ప్లీడరుగారికి వెయ్యిన్నూటపదహార్లు, గవరయ్యకి నూటపదహార్లు జమీందారుగారు ఇస్తామని వాగ్దానం చేశారు.

గవరయ్యకి కలత నిద్దర మళ్లా కలల నిద్దరయింది. వేవెల్ రాజప్రతినిధి రాగానే ఇండియా ప్రభుత్వం ప్రజలకి అప్పచెప్పేశాడని, ప్రజలు సోషలిస్టు రాజ్యం స్థాపించబోతున్నారనీ, సమశానపాలెం జమీందారుగారి దావాతోసహా అన్నిదావాలు బుట్ట దాఖలా చేస్తారు కాబోలుననీ, అందరి ఆస్తుల్ని ప్రజలు స్వాధీనపరుచుకొంటారు కాబోలుననీ, సమశానపాలెం జమీందారు తనకి న్యాయంగా ఇవ్వవలసిన వాలంటీరుఅయినా ఇంకా ముట్టచెప్పలేదు నేనెలాగ చచ్చేదనీ, ఏడ్చుకొని, ధనమూల మిదంజగత్తన్న ప్రాచీనసంస్కృత పరిమాణాన్నే ధిక్కరించి అందరిదగ్గర ధనం లాక్కుంటామనడం ఏమిన్యాయమనీ, ముందు జ్ఞానంతో కరువొస్తుందని జాగ్రత్తచేసుకొన్న రెండుగరిసెల ధాన్యం, రహస్యంగా సంగ్రహించి దాచుకొన్న రెండువేల రూపాయల వెండిబిళ్లలూ, పెళ్ళాం మెళ్లో బంగారం, లాక్కుంటారు కాబోలురా దేముడాఅనీ, త్వరగా ఇంటికి పరుగెడదామని నాలుగు అడుగులు వేస్తే రాయితగిలి బొటకనవేలు గోరు ఎగిరిపోయి రక్తం బొటబొటకారడ మారంభించింది. వేలుకింద మన్నుతీసి మెత్తి, కుంటుకుంటూ వీధిమలుపు తిరిగితే, తెల్లని భల్లూకం ఎదురుగావచ్చి వెనకకాళ్ళమీద నిలబడి ముందుకాళ్ళతో పీకపట్టుకోబోతే, మొర్రోమని గట్టిగా కేకేశాడు.

ఎదురుగాఉన్న గుమాస్తాలు, పార్టీలు పక్కున నవ్వి కొట్టిలేపితే గవరయ్యలేచి కళ్లు నులుముకొని బీరపువ్వుల్లాగ విప్పి పరిస్థితి గ్రహించి ఇదంతా నిజంకాదు - ఇంకా డబ్బుకోసం, స్థిరాస్తులకోసం వ్యాజ్యాలు, ప్లీడర్ల వకాల్తనామాలు, రికార్డు కట్టలూ, వంశవృక్షాలూ భద్రంగానే ఉన్నాయి, ఇండియాలో పౌరపార్లమెంటమీ సంభవించలేదని గుర్తించి, కాలిబొటకనవేలినొప్పి ఇంకా ఉండడానికి ఆశ్చర్యపోయి చూస్తే బొటనవేలికి దెబ్బైనాలేదు.

అందరినీ చూసి "యివ్వాళ మా యింట్లో మా తండ్రిగారి ఆబ్దికం. తల బద్దలైపోతున్నాది, నిద్ర ముంచుకొస్తున్నాద"ని చెప్పి చెప్పి నలుగురితోపాటు తనూ నవ్వేడు.

రష్యాదేశాన్ని భల్లూకంగా విరూపించి రాసిన కార్టూన్లు తనుపేపర్లలో చూసినసంగతి జ్ఞాపకమొచ్చింది. ఎప్పుడెప్పుడో, ఎక్కడెక్కడో వీధుల్లోకి ఎలుగుగొడ్లని తీసికొచ్చి వాటితో కుస్తీ ప్రదర్శనాలు చూపించిన ముష్టివాళ్ళు జ్ఞాపకమొచ్చారు. భల్లూకపు పట్టు అన్నసామెత జ్ఞాపకమొచ్చింది.

ఇహను పడుకుంటే పీడ కలలొస్తాయని హోటలుకుపోయి టీనీళ్ళుతాగి కోర్టులో కెళితే జడ్జీగారు అప్పుడే కట్టలుతీస్తూ మొహంలో మార్పులేవీ లేకండా నిశ్చలంగా, శాంతంగా, కూర్చున్నారు. కోర్టు బంట్రోతు "బగాది అప్పన్నా" అంటూ మూడుసార్లు కేకేశాడు.

గమనించండి

"ప్రజాశక్తి" పత్రికకు చందాలు, ఏజన్సీ బాకీలు పంపేవారుగాని, ప్రజాశక్తి ప్రచురణలకోసం డబ్బుపంపేవారుగాని, రాష్ట్రకమిటీకి పంపేవారుగాని, తమ మనియార్డర్లన్నీ "మేనేజరు, "ప్రజాశక్తి" అనే అడ్రసుకు పంపాలి. వ్యక్తుల పేరుతో పంపనవసరంలేదు. వ్యక్తుల పేరుతో పంపడంవల్ల వారు అసమయానికి వూళ్ళోలేకపోవడం జరుగుతోంది. దీనివలన అనవసర ఆలస్యం, చిక్కు కలుగుతోంది. క్రింద కూపనులోమాత్రం ఆ డబ్బు యెందు నిమిత్తం పంపేది వివరంగావ్రాయాలి. పంపేవారి పేరు, అడ్రసుకూడా క్రింద కూపనులో వ్రాయాలి.

★ కలకత్తాలోని లక్షమంది అనాధలు

మృత్యుముఖంనుంచి తప్పుకొని ఇళ్లకు ప్రయాణమౌతున్నారు

— భూపేష్ గుప్తా

ఒక్క నెలరోజులక్రితం కలకత్తా నగర వీధుల్లో ఎక్కడచూచినా దిక్కులేని దీన జనమే. ప్రతిరోజూ పల్లెప్రాంతాలనుంచి ఈ అభాగ్యులు ప్రవాహాలుగవచ్చి కలకత్తావీధుల్లో పడుతుండేవారు. వీళ్ళంతా కలిసి ఒక లక్ష మంది ఉండేవారు. వీరిలో ముప్పాతికపాళ్ళు వ్యవసాయ కూలీలు, చిన్నరైతులే. వీరిలో అనేకులు భార్యాబిడ్డలతో వచ్చేశారు. కుటుంబాలకు కుటుంబాలే కదలిపోయాయి. ఎక్కువ మంది 24 పరగణాలు, హుగ్లీ, మిద్నపూర్ ప్రాంతాలనుంచివచ్చారు. కలకత్తాకు ధాన్యపు కొట్టని పేరుపొందిన యీ ప్రాంతాల్లోనే గుక్కెడు గంజినీళ్ళు కరవయాయి!

అప్పటికే వీళ్ళ ఆరోగ్యం పూర్తిగా శిధిలమైపోయింది. వట్టి అస్థిపంజరాలయారు. అంతేకాదు — ప్రమాదకరమైన జాడ్యాలకు ఆటపట్టయారు. ఉచిత భోజనశాలల్లో ఇచ్చే ఆహారం వాళ్ళ దుర్బలస్థితికి సరిపడేది కానే కాదు. ఆ ఇచ్చేదయినా రోజుకు ఒక్కపూట మాత్రమే. రోజువారీ మరణాలసంఖ్య నూటికి పెరిగింది.

ఇలా కదలివచ్చిన కుటుంబాల్లోని యువటులు ఒకటి రెండు రోజుల్లో మాయమైపోయేవారు. పడుపువృత్తి ఏజంట్లు ఆహారం ఎరజూపి, వీరిని తమవలలో వేసుకోవడం ప్రారంభించారు.

శీతకాలం ప్రారంభం కావడంతో వీరిలోని పసిపిల్లలు, ముసలివారు మునుపటికన్నా ఎక్కువగా చనిపోవడం ప్రారంభమయింది. మరో నెలరోజుల్లో వీళ్ళంతా చచ్చిపోయి, వారు తెచ్చిపెట్టిన జాడ్యాలే మిగులుతాయా అనిపించింది.

బాంబులు పడితే-

ఇలాంటి పరిస్థితుల్లో కాక్సుబజారు (చిటగాంగ్ దక్షిణప్రాంతం) మీద జపాను బాంబులు పడ్డాయి. కలకత్తా వీధుల్లో ఏలాంటి రక్షణ లేకుండా ఒక లక్షమంది అభాగ్యులు పడిఉన్నారు— ఇక్కడే బాంబులుపడితే వీళ్ల గతేమికాను?

ఈ యేడు శీతాకాలపు పంట హెచ్చుగా పండింది. కాని వ్యవసాయకూలీలు కలకత్తా వీధుల్లో పడిఉన్నారు. ఈ పంటంతా ఏమి కావాలి? ప్రభుత్వానికే గాభరా పుట్టించిందీ సమస్య. ఆ గాభరాలో విద్యాశాఖాధికారి దగ్గరకువెళ్ళి విద్యాలయాలన్నీ మూయించాలనీ, విద్యార్థుల నందరినీ పొలాల్లో పనికి పంపించాలనీ కోరిందట.

కలకత్తా వీధుల్లో ఉన్న ఆ లక్షమందిని అక్కడనుంచి తొలగించాలి—వాళ్ళ బ్రతుకుల కోసం, కలకత్తాలోని 25 లక్షల ప్రజల క్షేమం కోసం వెంటనే తొలగించాలి. వాళ్ళ ఆరోగ్యాన్ని తిరిగి కోలుకొనేలాచేసి, వాళ్లను తమతమ గ్రామాలకు పంపించేయాలి. ఇదే తక్షణ కర్తవ్యం.

నిరోధకులు

కాని, కొందరీ అభిప్రాయానికి భిన్నంగా ప్రవర్తించారు. వీళ్ళందరినీ కలకత్తా వీధుల్లోనే ఉంచాలనే దృష్టితో హిందూమహాసభ నాయకులు ప్రవర్తించారు. ఈఅభాగ్యులను తిరిగి గ్రామాలకు పంపివేయాలన్న సమస్య మీద వీరు లేనిపోని గాలిదుమారం లేపారు. ఈ లక్షమందికి తగిన పోషణచేసి, వారి ఆరోగ్యాన్ని తిరిగి నేకరించి, గ్రామాలకు పంపించడంకోసం బెంగాల్ మంత్రివర్గం 5 విశ్రాంతి శిబిరాలను ఏర్పాటు చేసింది. కమ్యూనిస్టుపార్టీ తప్ప మిగతా పార్టీలన్నీ ఈ శిబిరాలకు వ్యతిరేక ప్రచారం చేశాయి. ఈ శిబిరాలవైపు తొంగైనా చూడకుండానే మహాసభ నాయకులు ఇవన్నీ "నరకకూపాల" ని ప్రచారం చేశారు. "ఏరాయయితేనేమి, లీగ్ మంత్రివర్గాన్ని కొట్టడానికి" అనే దృష్టితో గుడ్డిగా ప్రవర్తించారు.

మేము (కమ్యూనిస్టులు) కొన్ని శిబిరాలకు వెళ్లిచూచాము అవి ఎంతో ఆదర్శప్రాయంగా నడుపబడుతున్నాయి. కాని వాటి విషయం ఎవరూ ఉత్సాహం చూపడం లేదని వాటిని నడుపుతున్నవారన్నారు.

ఈ వ్యతిరేక ప్రచారంలో అగ్రస్థానం పంచమాంగ దళానిది. "సైనికుల కోసం రక్తనిధికి మీరక్తాన్నంతా పిండేస్తారు! మీ ఆడవాళ్ల నందరిని సైనికులకు అప్పగించేస్తారు; ఆమిగిలిన వాళ్ళను యుద్ధరంగాలకు పంపించివేస్తారు! అమ్మో, ఆ శిబిరాలకు వెళ్ళవద్ద"ని ఆఅనాధులను బెదరగొట్టారు.

ప్రభుత్వ చర్య

ఈ బెదరగొట్టడాలకు ప్రభుత్వ చర్య తోడయింది. శిబిరాలు పెట్టడం మంచిపనే. కాని వీటిని నడపడానికి జీతాలిచ్చి కొంతమంది ఉద్యోగులను నియమించింది. దేశభక్తులకు, ప్రజా సేవకులకు ఎక్కడా స్థానం లేకపోయింది. ఈ ఉద్యోగుల బృందమంతా కలిసి రెండు నెలలలో 2000 మందినయినా ఈ శిబిరాల్లోకి తీసుకురాలేకపోయారు. పంచమాంగదళ ప్రచారాన్ని ఎలా ఎదుర్కోవడమో చేతకాక- కాళ్ళుచాచుక చతికిలబడ్డారు. వైస్రాయి వేవెల్ ప్రభువు కలకత్తా వచ్చినప్పుడు కలకత్తా వీధులనుచూచి, సైనికుల ఆరోగ్యం చెడిపోతుందేమోననీ, బ్రిటిషు సామ్రాజ్యం యొక్క ప్రతిభ అంతా మిత్రమండలి సైనికులకు ఈరూపంలో కనపడడం బాగుండదని ఆందోళనపడి ఉండాలి. ఆ ఆందోళనతో ఉద్యోగు లందరినీ అడాపెడా చీవాట్లు పెట్టాడట.

ఆ చీవాట్లతో బెదరిపోయి అక్టోబరు 28 న ఒక ప్రకటన చేసింది బెంగాల్ ప్రభుత్వం. అనాధుల నందరినీ బలవంతంగా శిబిరాలలో చేర్చడానికి పోలీసులకు అధికారం ఇచ్చిందీ ప్రకటన. బలప్రయోగంవల్ల పని జరుగుతుందా అని కొంతమంది ఉద్యోగులకే అనుమానం పుట్టింది.

మాకీ ప్రకటన పిడుగుపడ్డట్టయింది. అనాధులను శిబిరాల్లో చేర్చడానికి అప్పుడప్పుడే మేము ప్రచారం ప్రారంభించాము. మా ప్రయత్నాలకు ప్రజలు సానుభూతిచూపడం ప్రారంభించారు. రెండురోజుల్లో 60 మంది హోల్ టైమ్ కామ్రేడ్సు, మరికొంతమందిదేశభక్తులు వీధుల్లో పని ప్రారంభించారు. ఈ ప్రయత్నాల నన్నిటినీ మట్టిగలిపేలా వచ్చిందీ ప్రకటన.

వెంటనే సర్ నాజిముద్దీనుని కలుసుకొని, ఈ నిర్బంధాన్ని ఆపవలసిందని కోరాము. నిర్బంధాన్ని ఆపి మాకు ఒకటిరెండురోజులు అవకాశాన్నివ్వడానికి ఆయనఅంగీకరించాడు.

మా కృషిఫలితం

అంతకుముందే మా పనికోసం కలకత్తాను ఆరుభాగాలుగ విభజించాము. అక్టోబరు 29 న ఈ ఆరుభాగాల్లోను మా పూర్తి బలాలను కేంద్రీకరించాము. ఆ ఒక్కరోజులో 300 మందిని శిబిరాలకు చేర్చాము. అధికారులు 'సెబాస్' అనుకొన్నారు. గుహ (ప్రభుత్వం నియమించిన ఉద్యోగబృందానికినాయకుడు.) తన బృందాన్నంతటినీ వెనక్కు పిలిపించేస్తానన్నాడు. ఈ బృందం అనాధుల నందరిని పశువులను తోలినట్లు శిబిరాలకు తోలాలనుకున్నారు. దీనితో ఆ అభాగ్యులు బెంబేరెత్తిపోవడమేకాకుండా, ప్రభుత్వ ప్లానుపై అదివరకు ఏకొద్ది సానుభూతిఉన్నా అదంతా మాయమయింది.

సర్వత్ర సహకారం

మన ప్రచారక దళాలు ప్రజారక్షణ కమిటీల నన్నిటిని కార్యరంగంలోకి తెచ్చాయి. ఇతర కరువు నివారణ సంస్థలనుకూడా కలుసుకొన్నాయి. సమిష్టిచర్చలను ఏర్పాటు చేశాయి. అన్నిచోట్ల ప్రజలు ఈ దళాల కృషికి పూర్తి సహకారాన్నిచ్చారు. భోజనశాలలను నడుపుతున్నవారు అనాధులను పోలీసుల కంటబడకుండా దాచేసేవారు. అలాంటివారు— "ఈ హడావిడి అధికారుల చేతుల్లో పెట్టడంకన్నా అనాధుల నందరిని ప్రజారక్షణ కమిటీలకు వప్పగించడానికి మే మెప్పుడూ సిద్ధమే" అన్నారు.

ఒకచోట మీటింగుకి 500 మందివచ్చారు. ఆ ప్రాంతంలోని క్లబ్బు కుర్రవాళ్ళు ఊరేగింపుగావచ్చి మాకు సహాయం చేస్తామన్నారు. పంచమాంగదళం కొంతమంది కుర్రవాళ్ళను పంపి మీటింగు చెడగొట్ట జూచింది. కాని ప్రజలు వారిని లక్ష్యపెట్టలేదు. ఇంకోచోట మనదళం నచ్చజెప్పగా కొందరు అనాధులు ప్రభుత్వ శిబిరానికి బయలుదేరారు. వీరిని తిరిగి వెనక్కు మళ్లించడానికి పంచమాంగదళ ద్రోహులు ప్రయత్నించారు. అక్కడి ప్రజలే అప్పుడు వారికి తగిన బుద్ధిచెప్పారు. మరొకచోట మనదళం కొంతమంది అనాధులను వెంటబెట్టుకు వెళ్తుంటే ఒక పెద్దమనిషి వీరందరికీ ట్రాం టిక్కెట్లు కొనిఇచ్చాడు. సీఫన్‌రోలో చదువుకొన్న ఒక కుర్రవాడు తిండిలేక అన్నాతురులతో కలిసి రోడ్డుపై జీవిస్తున్నాడు. మన కరపత్రం చదివి, "బాబూ మీ మార్గమే సరియయినది. తక్కిన వాళ్లందరికీ ఇది వినిపిస్తాను. వాళ్లందరు శిబిరాల్లోకి వస్తార"ని బయలుదేరాడు.

పచ్చని పంట చూచి——

ఒకనాడు మన దళం ఒకటి కొంతమంది అనాధులను మోటారు లారీలో ప్రభుత్వ శిబిరానికి తెస్తూంది. దారిలో ఇటూఅటూ పచ్చగా పండిన చేలున్నాయి. వాటిని చూడగానే జీవకళలు అంతరించిన వారి ముఖాల్లోకి ప్రాణం పొంగుకొచ్చింది. రెప్పవేయకుండా చేలవంక చూచారు.

"ఇకనేం ఫర్వాలేదు! పంటచూడండి! ఇకమనకు వస్తులుండవు!" అన్నాడాలారీలో ఒకడు.

దారిలో లారీ ఒకగ్రామంలో ఆగింది. గ్రామస్థులు లారీచుట్టూ మూగి "వీరెవరు"ని అడిగారు. "వీళ్ళంతా మీవారే - మీరైతులు" అని మన కామ్రేడ్ జవాబు చెప్పాడు. వాళ్ళ ఆనందానికి అంతులేకపోయింది.

లారీలోని అనాధులందరూ సంతోషంతో పొంగిపోయారు. మృత్యుముఖంలో గడిపిన రోజులన్నీ ఏనాడో అంతరించిపోయాయన్నట్లున్నారు. ఉన్నశక్తి నంతటినీ కూడగట్టుకొని సుఖజీవనం వైపు బయలుదేరారు. అదుగో శీతకాలపు పంట - బంగారు చేతుల్తో ఆహ్వానిస్తూంది, అనుభవించి, పోయినశక్తిని కోలుకొమ్మని, "ఈపంటంతా పోగుచేస్తాం. మన ప్రాణాలను నిలుపుకుంటాం - దేశంలో సోదర ప్రజలను కరువుబాధలనుండి కాపాడతాం," అనే తలపు వారిముఖాల్లో మెరిసింది.

ఈవిధంగా 6 రోజుల్లో రెండు వేల దీన జనాన్ని ప్రభుత్వ శిబిరాల్లోకి చేర్చాము. ప్రభుత్వోద్యోగులు 60 రోజుల్లో చేయలేని పనిని ప్రజాసేవకులు 6 రోజుల్లో చేయగలిగారు.

ఉపేక్ష అంతరించింది

మన ప్రచారకదళాల కృషిఫలితంగా జరిగిన ముఖ్యవిషయం ఏమంటే—ఇతర కరువు నివారణ సంస్థలన్నీ తమ ఉపేక్షాభావాన్ని వదలి ప్రజలను కలకత్తారోడ్లనుంచి ప్రభుత్వ శిబిరాల్లోకి పంపడానికి పని ప్రారంభించాయి. ప్రభుత్వ నిర్బంధానికి ఏమాత్రం అవకాశం లేకుండా చేశాయి. ఈ శిబిరాలపట్ల ఇప్పుడు ప్రజలే శ్రద్ధవహిస్తున్నారు. వాటి లోటుపాట్లు చాలవరకు పోయాయి. ఒక శిబిరాన్ని కామ్రేడ్సు పోయి చూశారు. అక్కడి అనాధులకు బట్టలు, కంబళ్ళు ఇస్తున్నారు. రెండుపూటలు అన్నం, పప్పు, కాయగూరలతో భోజనం పెడుతున్నారు. పిల్లలకు గ్లాక్సో, బార్లీ ఇస్తున్నారు. జబ్బుతోఉన్నవారికి వైద్య సహాయంఉంది. ఇట్టి శిబిరాలనే పంచమాంగదళం నరకకూపాలని ప్రచారంచేస్తూంది!

కాని, కలకత్తా వీధుల్లో ఇంకా 20,000 మంది ఉన్నారు. వీళ్ళను అక్కడే అట్టిపెట్టి బాంబులు వడ్డప్పుడు వీళ్ళచే లూటీలు జరిపించడానికి పంచమాంగదళ నీచులు పన్నాగాల పన్నుతున్నారు. వాళ్ళ ఆటలు ఇక సాగవు. ఈ 20,000 మంది శిబిరాల్లోకి— ఆతరువాత తమతమ గ్రామాలకు వెళ్తారు.

లక్షమంది అనాధులకు ఘోర దుర్దశ తప్పింది. కలకత్తా ప్రజలకు, మిత్రసైనికులకు జాడ్యాల మహామారి భయం అంతరించింది. దేశానికి ప్రాణదానం చేయగల శీతకాలపు పంట పొలాల్లోనే మురిగిపోతుందేమో అన్నభయం తొలగింది.



ఒక కరువు దృశ్యం

గుంటూరుజిల్లా పర్యటనంలో నా అనుభవాలు

రాజకీయ పరిజ్ఞానంకొరకు ప్రజల తహతహ

●



పుచ్చలపల్లి సుందరయ్య

నవంబరు 21 వ తేదీనుండి 30 వరకు గుంటూరు జిల్లాలో బహిరంగ సభలలో కమ్యూనిస్టుపార్టీ కార్యక్రమాన్ని గూర్చి ప్రచారంచేస్తూ, పార్టీ సభ్యుల జనరల్‌బాడీ సమావేశాలకు హాజరయ్యాను. అమృతలూరు అనంతవరం, దావులూరు, దుగ్గిరాల, నర్సాయిపాలెం, పచ్చలతాడిపర్రు, సత్తెనపల్లి, వేలూరు, తాడికొండ గ్రామాలలో బహిరంగసభలు జరిగాయి. 25000 మంది ప్రజలు సభలకు వచ్చారు.

ప్రజలలో నూతనరాజకీయ సంచలనం

సామాన్య రైతుకూలీ ప్రజాసామాన్యంలోకి రాజకీయాలను కమ్యూనిస్టుపార్టీ ఎంత ఎక్కువగా తీసుకుపోతున్నదీ ఈసభలురుజువు చేశాయి. రాజకీయసభలకు రావాలనే ఆతృత ప్రజలలో మునుపెన్నడూలేనంత నేడు తీసుకరాగల్గాం. ప్రతిదేశంలోను, చుట్టుప్రక్కల గ్రామాలనుండి 10 మైళ్ళుకూడానడిచివచ్చారు, సత్తెనపల్లిలో జరిగిన సభకు మూడు మైళ్ళ దూరంలోఉన్న మాదలపరిసర గ్రామాలనుండి 1500 కు పైగా ప్రజలు రాజకీయ భజనలు చేస్తూ వచ్చారు. 8 మైళ్ళ దూరంలో ఉన్న లంకలకూరపాడు నుండి 400 మంది ప్రభను ఊరేగించుతూవచ్చారు. ప్రభపై సుత్తికొడవలి హత్తిన ఎర్రజండాను ఎగురవేసి, రైతుకూలీలను ఆకర్షిస్తూ వచ్చారు. ఏడెనిమిది మైళ్ళ దూరంలో వున్న పెదకూరపాడు, ఫణిదల గ్రామాలనుండి మూడువందలు, నాల్గువందలు ప్రజలువచ్చారు. స్త్రీలు బండ్లుకట్టుకొని వంద మందికిపైగావచ్చారు. సత్తెనపల్లితాలూకా రాజకీయచరిత్రలో స్త్రీలు ఈరకంగారావడం మొదటి పర్యాయమని కామ్రేడ్ మాదల వీరభద్రరావు ఉప్పొంగుతూ, నేను కనబడగానే చెప్పాడు. ప్రజలు అన్నపుమూటలను కట్టుకొనివచ్చారు. రథంపై ఎర్రజెండాను చక్కని ఎద్దులజతలు లాగుతూఉంటే ఊరేగింపు సాగింది. సత్తెనపల్లిలో ఒకరాజకీయ తిరునాళ్ళు జరిగిందని చెప్పకతప్పదు. 5000 మంది దానికి వచ్చారు.

తాడికొండ గ్రామంలోకూడా 5000 మంది వచ్చారు. పొన్నుకల్లునుండి 8 మైళ్ళు నడచి 50 మంది స్త్రీలు ఊరేగింపుతో రాత్రి 9 గంటలకు రావడం గమనించాల్సింది. తాడికొండ, పొన్నుకల్లు, వేలూరు, నర్సాయిపాలెంలలో కూలీలుపోగనాటులున్నా, మీటింగుకోసం పనిమానివేస్తామని తయారయ్యారు. వారిపట్టుదల సభలను ఏర్పాటుచేస్తూ ఉన్న కామ్రేడ్సుకు ఆశ్చర్యంకల్గించింది. వారికోసం ఈ ప్రదేశాలలో రాత్రిళ్ళు సభలనుజరిపాం. మామూలుకన్న పెందలకడనే పనులలోకివెళ్ళి తొందరగా పనులు ముగించుకొని మీటింగుకోసమని వచ్చారు.

స్త్రీలలో కొత్త చైతన్యం

ప్రతిమీటింగుకు వందలకొలది స్త్రీలు హాజరు కావడం మరొక నూతనదృశ్యం. తాడికొండ, వేలూరు, నర్సాయిపాలెం గ్రామాలలో ఒక్కొక్కచోట ఐదారు వందలమంది స్త్రీలు యిండ్లకు తాళాలువేసిరావడం ఒకనూతన సాంప్రదాయం. సత్తెనపల్లి సభకు తాడికొండ సభకుపొన్నకల్లునుండి స్త్రీలు ఎంతఓపికగా వచ్చిందిపైనవ్రాశాను. అనంతవరంలో పతాకోత్సవం అయినతరువాత మీటింగును నిషేధిస్తూ పోలీసులు 144 వ సెక్షనుపై నోటీసులు జారీచేశారు. మరుచటిరోజు ఉదయం 7 గంటలకు అచ్చటకు మూడుమైళ్లలోవుండే దావులూరులో పార్టీసభ్యుల, సానుభూతిపరుల జనరల్‌బాడీ మీటింగుఉన్నదని ప్రకటించాం. 10 మంది స్త్రీ కామ్రేడ్స్ అక్కడికి వచ్చేటప్పటికి 8-9 గంటలన్నా అవుతుందని అనుకున్నాం. దారి ఏమీ బాగులేదు. అయితే 7 గంటలకంతా ఆస్త్రీలు అచ్చటకు హాజరయినప్పుడు, ఆ స్త్రీ కామ్రేడ్సును చూచి, వారిలో అలాపట్టుదల, ఆత్మవిశ్వాసం, స్వాతంత్ర్యాభిమానాలు కల్పించిన కమ్యూనిస్టుపార్టీనిచూచి గర్వపడ్డాను.

బాలబాలికల కళావిజ్ఞానం

బాలబాలికలు బాలసంఘాలలో చేరి చక్కగా చదువుకోవడం, పాటలు, కోలాటాలు నేర్చుకోవడం చూచి ఎవరు ఆనందించకుండా ఉండగలరు? ఏ తల్లిదండ్రులు అలాంటి తమ బాలబాలికలను చూచి గర్వించకుండా ఉండగలరు? అమృతలూరులో "సాల్యూట్, సాల్యూట్ ఎర్రసైనికుడా" అనే పాటను ఆ ఇరువురు బాలబాలికలు పాడుతూ ఉన్నప్పుడు విని, ఎఱ్ఱసైనికునికి బాలబాలికలతోపాటు సాల్యూట్ చేయక ఎవడుండగలడు? దావులూరులో వ్యవసాయ కూలీ బాలికలు ముగ్గురూ కలసి పాటడం; ఫణిదం, మాదల, తాడికొండ, వేలూరు బాలసంఘంవారి బుర్రకథలు, అమృతలూరు బాలికల లంబాడీడ్యాన్సు, అన్ని ప్రాంతాలలోను, "మాస్కో పొలిమేరలో" అనే రెడార్మీ విజయోత్సవ కోలాటాలు, చెమ్మచెక్కలు, నాయకుల విడుదల భజనలు, విచిత్రవేషాలు ప్రజలను ఎంతో ఆకర్షించాయి. యువజనసంఘాలు, స్త్రీలు, రైతులు కూలీలు ఈ వివిధ కళారూపాలను ఉపయోగించి ప్రజలలో రాజకీయ ప్రచారం చేస్తున్నారు. రోజంతా కష్టపడి పనిచేసినా, మరుచటి రోజు పనికి వెళ్లాలనిఉండినా, రాత్రి రెండు మూడు గంటలవరకు చలిలోకూడ రాజకీయ ప్రచారాన్ని వింటూ కూర్చోవడం మన ప్రజలలో ఒక నూతన చైతన్యాన్ని, సంచలనాన్ని తెలియజేస్తోంది.

కొత్తగేయాలు, కొత్తపదాలు

మామూలు రైతుకూలీలనుండి, ప్రజలనుండి క్రొత్త క్రొత్త గేయాలు, పదాలు వ్రాస్తూకవులుముందుకువస్తున్నారు. మంచికలపూడిలో లోకం వెంకటేశ్వర్లు గారు "టోజోగ నీపని పట్టుతాం" అనే అర్థంలో వ్రాసిన కోలాటపు పాట, వేలూరు వ్యవసాయకూలీ సంఘ సభ్యుడు (వీరిపేరు నాకు జ్ఞాపకంలేదు) వ్రాసిన రెండు చక్కని గీతాలు; గొరిగపూడి వ్యవసాయ కూలీలు వ్రాసిన రెడార్మీ విజయాన్ని తెలిపే కోలాటంపాటలు; పొన్నకల్లు వీరయ్యగారు నాయకుల విడుదలమీద వ్రాసిన పాట, ఈ నూతన కవుల రచనలకు ఉదాహరణలు.

కమ్యూనిస్టుపార్టీపై ప్రజల అభిమానం

మేము వెళ్లిన ఈ గ్రామాలలో కమ్యూనిస్టుపార్టీ గ్రామ ఆఫీసులు, యువజన రైతుసంఘ గ్రామ ఆఫీసులు ఏర్పాటుచేసిఉన్నారు. దేశపటాలతో, సోవియటు రష్యా, చైనా యుద్ధ చిత్రాలతో, నాయకుల బొమ్మలతో, రైతు, కూలీ, జాతీయ నినాదాలతో చక్కగా ఆఫీసులు అలంకరించబడి ఉన్నాయి. గ్రామాలలో పార్టీ సభ్యులు, ప్రజాసంఘాలు ఈ రకంగా నిర్మాణయుక్తంగా పనిచేయడం, మన చరిత్రలో మొదటి పర్యాయం అంటే ఆశ్చర్యంలేదు. పార్టీసభ్యుల జనరలుబాడీ సమావేశాలు పార్టీ సభ్యులలో రాజకీయ చైతన్యాన్ని వృద్ధిపొందిస్తూఉన్నాయి. కమ్యూనిస్టులు ఆత్మవిమర్శన చేసుకుంటూ, తమలోని లోపాలను సవరించుకుంటూ ప్రజాసేవకు జనరలుబాడీ సమావేశాలలో తరిఫీదు అవుతున్నారు. గట్టిపడుతున్నారు. ప్రజల సమస్యలను తీసుకొని రోజురోజు పని చేయడమనేది అలవాటు చేసుకుంటున్నారు. గ్రామాలలో నూతన జీవితాన్ని తెస్తున్నారు.

తమకోసం ఈలా పనిచేస్తూఉన్న కమ్యూనిస్టు పార్టీపై ప్రజలలో విశ్వాసం, అభిమానం ఎక్కువౌతున్నాయంటే, ఆశ్చర్యం లేదు. దుగ్గిరాల, నర్సాయిపాలెం, వేలూరు, సత్తెనపల్లి సభలలో ప్రజలు ముందుకువచ్చి రూపాయినోట్లు, బంగారు గాజులు, వెండిగిన్నెలు, కాళ్ళ గొలుసులు, తమ శక్తికొలది డబ్బు ఇచ్చారు. దుగ్గిరాలలో ఒక గ్రుడ్డి బాలుడు ఎంతో ఆప్యాయంతో వేదికమీదికివచ్చి, చేతికి బేడ ఇవ్వడం మరచిపోలేని దృశ్యం. వేలూరులో వ్యవసాయకూలీ సంఘం తరపున పార్టీకిచ్చిన 50 రూపాయిల విరాళం మరొక అపూర్వ దృశ్యం. కమ్యూనిస్టుపార్టీపై వారికి ఎంత గాఢమైన ప్రేమఉండేది యివి తెలియజేశాయి. అమృతలూరు బాలసంఘంవారు తాము చెడుగుడు పోటీలలో గెల్చిన వెండి పతాకాలు పార్టీ కిచ్చారు. పచ్చలతాడిపర్రు గ్రామంలో చనిపోయిన తన పుత్రుడు కామ్రేడ్ దాసరి రంగయ్య కమ్యూనిస్టు పార్టీలో చేరిన తరవాత, తన పూర్వపు కోపస్వభావాన్ని, దుడుకుతనాన్ని మాని, ఎన్నో విషయాలు తనకు చెప్పేవాడని అతనితల్లి విలపించింది. అలాంటి పార్టీకి తన కుమారుని యివ్వడంతో ఆమె తృప్తిచెందలేదు. ఆమె వద్దనుండి నేను సెలవుతీసుకుంటూ ఉన్నప్పుడు, రెండు రూపాయలు తెచ్చి నాచేతిలో పెట్టింది.

కమ్యూనిస్టుపార్టీ కార్యక్రమం

ప్రపంచం నేడు రెండు పార్టీలుగాచీలి యుద్ధం చేస్తూఉంది. సోవియటు రష్యా, చైనా, ఇంగ్లాండు, అమెరికాప్రజలు ఒకవైపు; జపాను జర్మనీలు మరొకవైపు. మొదటి పక్షం గెలవాలని మనం కోరుతాం. కాంగ్రెసు నాయకులు కూడ కోరారు. దానికోసం జాతీయ ప్రభుత్వపు అవసరాన్ని కమ్యూనిస్టులం, కాంగ్రెసూ ఇరువురమూ గుర్తించాం. కాని ఇంగ్లీషు ప్రభుత్వం మనకు జాతీయ ప్రభుత్వాన్ని ఇవ్వకపోతే సత్యాగ్రహం చేస్తామని కాంగ్రెసు తీర్మానించింది. దీన్ని అవకాశంగా తీసుకొని బ్రిటిషు ప్రభుత్వం కాంగ్రెసు నాయకులను అరెస్టుచేసింది. తరువాత జరిగిన విధ్వంసక చర్యలు కాంగ్రెసు కార్యక్రమంకాదు. అయినా కాంగ్రెసు అలాంటి తీర్మానం చేయడం తప్పనీ, యుద్ధానికి అనుకూలంగా పనిచేస్తూ, మన ప్రజల బలాన్ని అభివృద్ధిచేసి, జాతీయ ప్రభుత్వాన్ని సంపాదించాలనీ, ఇదొక్కటే నేడు మన స్వాతంత్ర్య పోరాటాన్ని ముందుకు తీసుకపోగల మార్గమనీ, కమ్యూనిస్టులం ప్రచారం చేస్తున్నాం. ప్రజలకు, సైన్యాలకు కావలసిన ఆహారాన్ని పండించాలి; పండించిన ఆహారాన్ని, ప్రజలకు కావలసిన అవసర వస్తువులను కంట్రోలు చేయించాలి: వర్తకులకు ధాన్యం అమ్మవద్దు; ప్రభుత్వానికే అమ్మి దేశంలో కరువు కాటకాలు రాకుండ చేసుకోవాలి. దీనికి కావలసిన ఆహారకమిటీలు, ప్రజారక్షణ దళాలు ఏర్పాటుచేయాలి; కాంగ్రెసు సోషలిస్టుపార్టీ, ఫార్వర్డుబ్లాకు యుద్ధానికి వ్యతిరేకంగా, జపానుకు అనుకూలంగాచేసే ప్రచారాన్ని, పనులను అరికట్టాలి; జాతుల స్వయంనిర్ణయాధికారాన్ని అంగీకరింపజేసి, కాంగ్రెస్‌లీగ్ ఐక్యతనుఏర్పరచాలి; కాంగ్రెసు నాయకులను విడుదల చేయించుకోవాలి; జాతీయప్రభుత్వం స్థాపించుకోవాలి, ఇది నా ఉపన్యాసాల సారాంశం.

అల్లరిమూక ఆర్భాటాలు

కాని కమ్యూనిస్టుల ప్రచారాన్ని, కమ్యూనిస్టులు ప్రజలకోసం పనిచేస్తూ బలపడడాన్ని, చూచి సహించలేని రంగాముఠా, ఈవరకు కాంగ్రెసువాదులుగ ఉండిన కొందరు, మీటింగులలో గల్లంతుచేయాలనీ, మీటింగులు సాగనివ్వకుండాచేయాలని విశ్వప్రయత్నాలుచేశారు. చుట్టుప్రక్కల గ్రామాలనుండి తమ జట్టువారి నందరిని పిలిపించారు.

అమృతలూరులో సభకు అధ్యక్షులు మైనేని వెంకట కృష్ణయ్యగారు. ప్రశ్నలు ఏమైనఉంటే ఆఖరునవేయాలి, ఉపన్యాసాన్ని నిశ్శబ్దంగా వినాలని కోరారు. కాని మధ్య మధ్య అడ్డుప్రశ్నలు వేస్తూవచ్చారు. ఉపన్యాసం పూర్తి అయ్యేవరకు ఉండి 30 ప్రశ్నల జాబితా నొకటిఇచ్చారు. అందులో మొదటిప్రశ్న "ములుకోల" వ్రాతలకు మీరెందుకు సమాధానమివ్వరు? అని. దానికి జవాబుగ, అది రొచ్చుగుంట పత్రిక కాబట్టి దానివ్రాతలకు సమాధానాలివ్వడం లేదన్నాను. "ములుకోల" ను రొచ్చుగుంట పత్రిక అంటే సహించలేకపోయారు ఈ అల్లరి మూక. (తరువాయి 8 వ పేజీలో)

సక్రమమైన పని; న్యాయమైన కూలి

★

నవంబరు 10 వ తేదీన గుడివాడ తా॥ దావులపాడు గ్రామంలో బెల్లపు చినసోమయ్యగారి అధ్యక్షతకింద రైతులు - కూలీలు సమావేశమై, కోతలలో కూలీలు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటలవరకూ పని చేయుటకు; రైతులు బస్తా ఎన్నయూపాయలమ్మితే అన్ని అణాల చొప్పున కూలి యిచ్చుటకు, ఏకగ్రీవంగా అంగీకరించారు.

జొన్నపాడు గ్రామంలో కూలీలు 2 సంవత్సరాలక్రితం నాములేకుండా 10 పుట్ల ధాన్యం తీసుకువెళ్ళారు. రెండవ సంవత్సరం పల్లె పెద్దలు కొంతరు బాకీచెల్లించక దిగబెట్టారు. దానితో కూలీలు రైతుల వద్దకు వచ్చి తిరిగి అడగలేకపోయారు. కమ్యూనిస్టు యువకులు బాకీని తీర్చవలసిన అవసరాన్ని తెలియచెప్పారు. కూలీలు సమావేశమై, బాకీని పూర్తిగా తీర్చివేసి, రైతుల్ని తిరిగి అప్పు అడిగారు. రైతులు మెచ్చుకొని, రు. 1200 ధాన్యాన్ని 4 మాసాలకు వడ్డీ లేకుండా అప్పు యిచ్చారు.

రైతు - కూలీ సామరస్యం ద్వారా ఆహార సమస్యను పరిష్కరించుకోవడానికి ఇతర గ్రామాలుకూడా యిలాగే ముందుకు రావాలి.

75 వేలటన్నుల చెరుకు యేమికాను?

★

అనకాపల్లి తాలూకా తుమ్మపాల పంచదార ఫ్యాక్టరీకి చెరుకు సప్లయిచేయించే నిమిత్తం 17-11-43 వ తేదీని ప్రభుత్వ అనుమతి లేనిదే రైతులు గానుగ ఆడరాదని 16 గ్రామాలలో ఆర్డరు జారిచేయబడింది. అయితే, తుమ్మపాల ఫ్యాక్టరీకి సుమారు 25 వేల టన్నులు మాత్రమే అవసరం ఉంటుంది. రైతులు పండించేది లక్ష టన్నులు. మిగతా 75 వేల టన్నుల చెరుకును తీసుకొనేది, లేనిదీ హామీలేదు. పండిన పదిహేను రోజులలో ఆడకపోతే, రసం తక్కువై, రైతుకు విపరీతమైన నష్టం వస్తుంది.

కాబట్టి, ప్రభుత్వం వెంటనే ఏయే గ్రామాలలో చెరుకు ఫ్యాక్టరీకి చెరుకు కావలసియుందో నిర్ణయించి, పెర్మిట్లు యివ్వాలని అనకాపల్లి తాలూకా రైతు సంఘాధ్యక్షులు వ్రాస్తున్నారు.

ప్రభుత్వమే ఎనిమిదోవంతు పంటను నిలవచేయాలి

జిల్లా రైతుసంఘాల సూచనలు

నవంబరు 22, 23 తేదీలలో కృష్ణాజిల్లా రైతుసంఘ కార్యవర్గం అనుమర్లపూడి సీతారామారావుగారి అధ్యక్షతకింద బెజవాడలో సమావేశమై, ఆహారసమస్యను పరిష్కరించుటకు ప్రభుత్వానికి కొన్ని సూచనలిచ్చింది.

మద్రాసు ప్రభుత్వం సమగ్రమైన కంట్రోలు విధానాన్ని అమల్లో పెట్టకపోవడంవల్ల, వర్తకులు అధిక లాభాలకోసం తమ యిష్టంవచ్చినట్లు చేయడాని కవకాశం కలుగుతోంది. కొరతప్రాంతాలకు, పట్టణాలకు (రేషనింగ్ అమలులో ఉన్నవి) ప్రభుత్వం ధాన్యాన్ని కొనుటకు మాత్రమే ధరలను నిర్ణయించింది. ఈ విధానమే యిక ముందుకూడా అవలంబిస్తే, డెల్టా ప్రాంతాలలో సైతం ఆహారసమస్యను పరిష్కరించడం అసాధ్యమౌతుంది. కాబట్టి, ప్రభుత్వం అన్ని ఆహారపదార్ధాలకూ, యితర జీవితావసర వస్తువులకూ, సమగ్రమైన ధరల కంట్రోలును అమలు జరపాలని సూచించారు. కొరత ప్రాంతాలకు సప్లయిచేయుటకు, కంట్రోలు విధానాన్ని జయప్రదం చేయుటకు, ప్రభుత్వమే పండిన పంటలో ఎనిమిదోవంతు కొని నిలవజేయాలనీ: కుటుంబ ఖర్చులకు మాత్రమే సరిపోవు పంటపండితే, అట్టి రైతులవద్ద కొనరాదనీ; సూచించబడింది. ఈ సూచనల నమలులో పెట్టించుటకై రైతులు తీవ్రంగా ఆందోళన చేయవలసిందనీ, ఆవిధంగా అమలులో పెట్టేవరకు వర్తకులకు ధాన్యం అమ్మవద్దనీ, గ్రామావసరాలకు సరిపోయే ధాన్యాన్నిఉంచుకొని మిగతా సరుకును ప్రభుత్వానికే అమ్మాలనీ, రైతుల్ని హెచ్చరించారు. కంట్రోలు ధరలకు ప్రభుత్వం వర్తకుల నిలవపోతలను స్వాధీనం చేసుకోవాలని కూడా తీర్మానంలో తెలియజేశారు. రైతులవద్ద కమాండీరింగ్ చేసేటప్పుడు బియ్యంగా సప్లయి చేయదలచుకొంటే అంగీకరించాలని సూచించారు.!

యుద్ధబాండ్ల విషయంలో రివెన్యూ-రిజిస్ట్రేషన్ - పి. డబ్లియు. డి. - పోలీసు డిపార్టుమెంటువారు, విద్య — ఆరోగ్యశాఖలవారు, రైతుల్ని ఒత్తిడి చేస్తూండడంవల్ల అందరి వద్దనూకొనలేక రైతులు అవస్థపడుతున్నారు. కాబట్టి, ఒక్క రివెన్యూ డిపార్టుమెంటువారికే యిట్టి అధికార మీయవలసిందనీ, నిర్బంధ వసూళ్లను ఆపుజేయవలసిందనీ, ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించారు.

నష్టపరిహారానికి తగు సూచనలు

నవంబరు 25, 26 తేదీలలో నెల్లూరు జిల్లా రైతుసంఘ కార్యవర్గం పి. రామకోటయ్యగారి అధ్యక్షతకింద సమావేశమై, యీ క్రింది విషయాలపై తీర్మానాలు గావించారు:

అక్టోబరు 15, 16, 17 తేదీలలో వచ్చిన అధిక వర్షాలవల్ల, ప్రవాహాలవల్ల, జిల్లా యందలి అనేక ప్రాంతాలలో పంటలు చెడిపోయి రైతులకు విపరీతమైన నష్టం సంభవించినది. కాబట్టి, వెంటనే ప్రభుత్వం యీ క్రింది పనులు చేయవలసిందన్ని కోరింది.

— చెడిపోయిన నజ్జ భూములకు, మురుగుపోయిన భూములకు రెమిషన్ యివ్వాలి.

— రైతులు తాత్కాలికంగా స్వంతఖర్చులతో వేసిన తొట్టి కట్టలకు, చెరువుల రిపేర్లకు అయిన సొమ్మును ప్రభుత్వం శిస్తులలో ముజరా యివ్వాలి.

— సజ్జ అడుగుభూములకు, తీర్వజాస్తి భూములకు, తిరిగి పైరువేసుకొనుటకు ఉత్తరువు లివ్వాలి.

— పడిపోయిన యిండ్లను తిరిగి కట్టుకోవడానికి ధనసహాయం చెయ్యాలి.

— ఇలాంటి ప్రమాదాలు తిరిగి జరుగకుండా ప్రభుత్వమే కంట్రాక్టుపద్ధతి ప్రకారం కాకుండా పి. డబ్లియు. డిపార్టుమెంటుద్వారా రిపేర్లు చేయించాలి.

— ఆత్మకూరు చెరువును రైతులు స్వయంగా బిగించి, పొలాలను రక్షించ పూనుకొంటూంటే, అట్టి ప్రయత్నాలకు అడ్డుపడి, చెరువు తెగిపోవుటకు కారకుడైన ఆత్మకూరు తహసీల్దారు చర్యను గూర్చి ప్రభుత్వం విచారించి, అతనిపై చర్యతీసుకోవాలి.

తరువాత, యీ క్రింది తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదించబడ్డాయి:

— ఎరువుల అప్పుదరఖాస్తు ఫారాలను సూళూరుపేట తాలూకాలో మూడు మాసాలైనా, శాంక్షనుచేయలేదు, ఆత్మకూరు, కావలి, డిమాన్‌స్ట్రేటర్లు అర్జీలను బుట్టదాఖలుచేశారు. వెంకటగిరి డిమాన్‌స్ట్రేటరు వీటిని నమ్మకొవద్దని వ్యతిరేక ప్రచారం చేస్తున్నాడు. ఇట్టి అధికారుల చర్యను ఖండిస్తూ, వెంటనే శాంక్షనుచేయించాలని ప్రభుత్వాన్నికోరారు.

— ఇర్రిగేషన్ బోర్డులో జిల్లారైతుసంఘానికి ప్రాతినిధ్యం యివ్వాలి.

— ధాన్యం ధర రు. 130, బియ్యం రూపాయకు 4 శేర్లు, జొన్నలు 6¾ శేర్లు, సజ్జలు 6¾ శేర్లు, రాగులు 7 శేర్లు, ఎర్రబియ్యం 5 శేర్లు, చొప్పున ప్రభుత్వం కంట్రోలు చెయ్యాలి.

— ధాన్యం పంటమీద ఉండగానే ఎనిమిదవ వంతు పంటను ప్రభుత్వం కొనాలి.

దేవుడు వరమిచ్చినా -

గుంటూరుతాలూకా యందలి నూతక్కి గ్రామంలో పెదకొండూరు హైలెవెల్ ఛానల్‌కు దక్షిణదిశగా ½ మైలురాయి నుండి ¾ మైలు రాయివరకు 409 యకరాలభూమికి పల్లపుసాగు నిమిత్తం 5 నెలల క్రిందట ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగారు 4 తూములకు ఆర్డరిచ్చారు. రైతులు సకాలంలో వరి సాగుకు తూములను యేర్పాటు చేసుకొంటూంటే గ్రామమునసబువచ్చి, గండి సాగు చేస్తే యకరం 1 కి రు. 30 చొప్పున పన్ను విధిస్తానని దండోరా వేయించాడు. గత్యంతరంలేక, రైతులు పసుపు, వేరుశెనగ, కంది, మొక్కజొన్న వేసి నీరు పెట్టుకోవడం మానివేశారు. షుమారు 150 యకరాలు మాత్రమే వల్లపుసాగు చేశారు. అయితే, దీనివల్ల మెరకపైరులు ఉరకెత్తి నష్టపడ్డాయి.

ఇంతవరకూ చేసిన అన్యాయం చాలక, నీరు పెట్టని మెట్టపైర్లువేసినభూమిని గ్రామకరణం కొలిపించి 6 వ నెంబరు క్రింద వ్రాస్తున్నాడు. "ఇదేమి అన్యాయం?" అని రైతులడిగితే, యిది గవర్నమెంటు ఉత్తరువని జవాబిస్తున్నాడు.

స్థానికాధికారులుచేసే యిట్టి అక్రమాలను పై అధికారులు అరికట్టి, అధికాహారోత్పత్తిని ఆచరణలో ప్రోత్సహించడ మవసరం.

బాపట్ల డిమాన్‌స్ట్రేటరును తొలగించాలి

బాపట్ల తాలూకా రైతు సంఘాధ్యక్షుడు యీక్రింది విధంగా తెలియజేస్తున్నాడు:

"ఆగస్టు నెలలో డిమాన్‌స్ట్రేటరు తాను ఎరువును తెప్పించి యిస్తానని వాగ్దానంచేసి, వేరుశెనగ పిట్టుకు రు. 100 లకు రు. 25 చొ॥ అడ్వాన్సుగా వసూలుచేసి తీసుకురమ్మంటే నేను నర్సాయిపాలెం - జూపూడి - వచ్చుంతాడిపర్రు మొదలైన గ్రామాలలో 8000 బస్తాల పిట్టుకుగాను రు. 15 వేలు అడ్వాన్సుగా వసూలుచేసి తీసుకువెళ్లాను. డిమాన్‌స్ట్రేటరు పిట్టురాదని నిరాకరించాడు. తరువాత మేమొక వ్యాపారస్తునిద్వారా 6 వేల బస్తాల పిట్టును తెప్పించి, కలెక్టరు అనుమతితో రైతుల కందజేశాం. చినగంజాం, వేటపాలెం మొదలైన గ్రామాలలో నేను రైతువాలంటీర్ల, రివెన్యూ ఉద్యోగుల, సహాయంతో 1200 బస్తాల మిక్స్చెర్, మరికొన్ని బస్తాల అమ్మోనియా పట్టుకొని, డిమాన్‌స్ట్రేటర్ వద్దకు తీసుకుపోయి, దాన్ని రైతులకు సక్రమంగా అమ్మించమని కోరాను. కాని, ఆయన 20 రోజులవరకు అనవసరంగా జాగు చేశాడు. జిల్లా కలెక్టరు అనుమతితో ఈ అమ్మోనియాలో చాలా భాగాన్ని రైతుల కందజేయ గలిగాం.

"డిపార్టుమెంటువారు తెప్పించిన 3 వేల బస్తాల వేరుశెనగపిండిని అప్పు దరఖాస్తులు మంజూరైన పేదరైతుల కీయకుండా, యీ డిమాన్‌స్ట్రేటరు తన మొగమాటస్థులకు ఒక్కొక్కరికి 50 బస్తాలవరకు యిచ్చాడు.

వేటపాలెంలో ఉన్న 200 బస్తాల మిక్స్చరును ఆగ్రామ రైతులు తమ కవసరమైనది ఉంచమని కోరినప్పటికీ, ఈయన దాన్ని బాపట్లకు పంపించివేశాడు. స్టోరుకీపరు శ్రీరాములు, కొందరు మేస్త్రీలు, పిట్టు అమ్మకంలోను - అప్పుదరఖాస్తు ఫారము లిచ్చుటలోనూ విపరీతంగా లంచాలు తీసుకొంటున్నారు. ఈ విషయం నేను డిమాన్‌స్ట్రేటరుతో చెప్పగా వారిని సమర్థిస్తూ సమాధాన మిచ్చాడు.

"ఇట్టి అక్రమ చర్యలను బాహాటంగా కొనసాగించే బాపట్ల డిమాన్‌స్ట్రేటర్‌ను వెంటనే తొలగించడం అవసరం. ఇందుకై రైతులు తీవ్రంగా ఆందోళన చెయ్యాలి"

8 వ అఖిలభారత రైతు మహాసభ

●

బెజవాడలో 12—3—44 న ప్రారంభమౌతుంది

●

అఖిలభారత రైతాంగ నాయకులైన స్వామీజీ, బంకింముఖర్జీ, బాబా సోహన్ సింగు, ముజఫర్ అహమ్మద్ మొదలైనవారు వస్తారు. పశుప్రదర్శనాలు, పోటీలు, వ్యవసాయ ప్రదర్శనం, చిత్రకళా ప్రదర్శనం వగైరా ఏర్పాటు చేయబడుతున్నాయి.

కార్మికులపై ఉయ్యూరు మిల్లుయజమానుల కుతంత్రం

ఈనాడు పంచదార పరిశ్రమయొక్క ప్రాముఖ్యతను వేరే చెప్పనక్కరలేదు. ఈ పరిశ్రమ కుంటుపడకుండా సాగేలా చేయవలసిన బాధ్యత కార్మికులపైని, పరిశ్రమ యజమానులపైని, ప్రభుత్వంమీద, ప్రజలమీద ఉంది.

కాని, ఉయ్యూరు పంచదార మిల్లు యజమానులు తమ బాధ్యతలకు విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారు. కార్మికులు తమ కనీసహక్కులను సాధించుకొనుటకు, పరిశ్రమ ఇంకా ఎక్కువ ఉరవడిగా సాగేలా తోడ్పడడానికి, సంఘం పెట్టుకున్నారు. అప్పటినుంచి అధికారులు కార్మికులమీద దాడి ప్రారంభించారు. సంఘస్థాపనలో ఎక్కువ ఉత్సాహంగా పనిచేసిన అయిదుగురు కార్మికుల్ని అకారణంగా పనిలోనుంచి తొలగించారు. అయినా, కార్మికులు బెదరిపోలేదు. యుద్ధ అలవెన్సుకోసం ఆందోళన సాగించారు. దీనిఫలితంగా, కొందరికి రూ. 2, మరికొందరికి రూ. 3 అలవెన్సు లిచ్చారు. ఇది వారికి ఏ మూలకూ చాలదు. ప్రభుత్వ ప్రకటన ప్రకారం రూ. 8-8-0 అలవెన్సుకోసం ఆందోళన జరుపుతున్నారు. ఈలోగా యజమానులు కార్మికులమీద మరోఅస్త్రం ప్రయోగించారు. (1) సీజను ఆఖరువరకు మాత్రమే కార్మికుడు పనిలో ఉంచబడును. (2) సమ్మె చేయకూడదు. (3) నోటీసు లేకుండా పనిలోనుంచి తొలగింపబడుతారు. (4) కంపెనీ సెలవు రూల్సు ప్రకారమే సెలవు లివ్వబడును. (5) యజమానులకు తెలుపకుండా కార్మికుడు నివాసస్థలం మార్చకూడదు. (6) పని చేయునంతకాలం ఇతరులకు సంబంధించిన వాటిల్లో పాల్గొనకూడదు; (7) ఎట్టి తగాదావచ్చినా జనరల్ మేనేజరుదే తుది నిర్ణయము — ఇలాంటివి కొన్ని షరతులతో అగ్రిమెంట్లు అచ్చువేయించి, వాటిమీద నిర్బంధంగా కార్మికుల సంతకాలు తీసుకోదలిచారు.

కాని కార్మికులు, తమ ఆత్మగౌరవానికి భంగకరమైన ఈఅగ్రిమెంట్లమీద సంతకం చేయ సమ్మతించలేదు. 23 వ తేదీని యూనియన్ జనరల్‌బాడీ మీటింగులో కార్మికులందరూ యజమానుల ఒత్తిడికి లొంగి సంతకంచేసిన కొద్దిమందితోసహా - యజమానుల చర్యను ఖండించారు. ఈ చర్యను అరికట్టాలని, న్యాయసమ్మతమైన యుద్ధ అలవెన్సు తమకిప్పించాలని మొదలయిన కోరికలను తెలుపుతూ తీర్మానాన్ని ప్రభుత్వానికి పంపారు.

పంచదార ఉత్పత్తిని ఆటంకపరచగల ఈ యజమానుల చర్యలను ప్రజలు ఖండించి కార్మికులకు అన్నివిధాల సాయంచేయాలి.

★

సింధియా హెచ్. సి. సి. కార్మికుల సంఘశక్తి

విశాఖపట్టంలో సింధియా, హెచ్.సి.సి. కార్మికసంఘం ఏర్పడి ఒకనెలరోజులయినా కాలేదు. అప్పుడే 2000 మంది కార్మికుల్లో 1500 మంది సంఘ సభ్యులుగా చేరారు. రెండు రోజుల బోనసు సంపాదించారు. అధికారుల నిరంకుశత్వాన్ని అరికట్టారు. తమ సంఘశక్తిద్వారా కార్మికుల్లో నూతన చైతన్యాన్ని కలిగించారు.

ఇలాంటి విజయాలు సాధించిన కార్మికులు గత మాసం 21 వ తేదీన ఒక మహాసభ జరిపారు. అధ్యక్షులు కామ్రేడ్ జొన్నలగడ్డ రామలింగయ్య అధికోత్పత్తి విధానాన్ని వివరించి, నూటికి నూరుమంది కార్మికులు సంఘంలో చేరడంద్వారానే కార్మికులు తమ హక్కులన్నీ సాధించగలరని ఉద్బోధించారు. పనికాలం 8 గంటలకు నిర్ణయించాలనీ, మగవారికి 0-12-0, స్త్రీలకు 0-8-0 కూలీ నిర్ణయించాలనీ సభలో తీర్మానించారు.

కాకినాడ కార్మికుల విజయాలు

కాకినాడ పీచుపనివారు తమ సంఘం ద్వారా హెచ్చు అలవెన్సుకోసం ఆందోళన జరుపుతూ వచ్చారు. దాని ఫలితంగా జిల్లా లేబరు ఆఫీసరు పీచుకొట్లన్నీ తనిఖీచేసి డిసెంబరు మొదటితేదీ నుంచి అన్ని రకాల నారపనికి హండ్రెడువైటుకి రెండణాలు ఎక్కువఅలవెన్సు (జనవరినుంచి ఇస్తూన్న రెండణాలు కాక) యివ్వాలని ఉత్తరువు చేశారు.

కాకినాడ చుట్టలపనివారు తమ సంఘం ద్వారా ఆందోళన జరిపి 1000 చుట్టలకు కూలీ 0-14-0 నుంచి ఒకరూపాయికి పెంచుకున్నారు.

మ్యునిసిపల్ కార్మికుల చొరవ

విశాఖపట్టణం మ్యునిసిపల్ కార్మికసంఘంలో చెత్తబళ్ళ కార్మికుల సెక్షన్ సభ గతనెల 13 వ తేదీని జరిగింది. తమపని విషయంలో వచ్చే లోటుపాట్లను తొలగించుకోడానికి, అధికారులకు - కార్మికులకు మధ్య సామరస్యాన్ని కలిగించడానికి, ఈ సభలో 5 గురు కార్మికులతో ఒక కమిటీని ఏర్పాటుచేశారు.

కరువుభత్యం 8-8-0 కు పెంచాలని ఈ సభలో తీర్మానించారు.

పాలకొల్లు మ్యునిసిపల్ కార్మికులకు లోగడ 5 రూపాయల అలవెన్సు ఇస్తుండేవారు. ఇది తమకు ఏ మాత్రము చాలడంలేదని ఆందోళనచేయగా జనవరి నుంచి రు 6-8-0 అలవెన్సు ఇవ్వడానికి అధికారులు అంగీకరించారు.

ఏలూరు పట్టణ ట్రేడ్‌యూనియన్ కౌన్సిలు

గతనెల 21 వ తేదీన ఏలూరులోని వివిధ కార్మికసంఘాల తరపున 20 మంది ప్రతినిధులు సమావేశమయ్యారు. పట్టణంలోని కార్మికులస్థితిని చర్చించి, కార్మికుల ఉమ్మడి అవసరాలు నెరవేరాలంటే, వారి హక్కులను సాధించాలంటే ఒక కేంద్ర కార్మిక సంఘం ఉండాలని నిర్ణయించారు. పట్టణ ట్రేడ్‌యూనియన్‌కౌన్సిలుని ఎన్నుకొన్నారు. దీనికి అధ్యక్షులు బి. అప్పారావుగారు, కార్యదర్శి బి. సూర్యనారాయణగారు.

ఆహారకౌన్సిలులో కార్మిక, కర్షక ప్రాతినిధ్యం ఉండాలి

కృష్ణాజిల్లా ఆహారకమిటీ గతనెల 25 వ తేదీని సమావేశమయింది. ప్రభుత్వం నామినేటుచేస్తూన్న అనధికార ఆహార సలహా సంఘంలో కర్షక, కార్మిక ప్రతినిధులను కూడా చేర్చుకొని, అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం ఇవ్వాలని తీర్మానించారు. కొత్తపంట కాలం వచ్చేసింది. వచ్చేసంవత్సరం ఆహార సమస్య నెదుర్కోడానికి తగిన ఏర్పాటులను వేగిరం చేయడానికి ఆహార కౌన్సిలును సమావేశ పరచాలనీ, ఈవిషయంలో ఆహార కమిటీ ఇదివరకుచేసిన సూచనలను అమలు జరపాలనీ, కొత్తపంట నిలవ వ్యాపారస్థుల చేతిలో పడనీయకుండా ప్రజలందరికి అందుబాటులో ఉండేలా చేయాలనీ మరో తీర్మానం చేశారు.

బాలబాలికలకు

●

నేనీమధ్య ఒక బాలసంఘ సభ్యుడ్ని కలుసుకోడం తటస్థించింది. వాడు బాలసంఘసభ్యుడని మొదట నాకు తెలియదు. ఏదో వాళ్ళ పెద్దమ్మగారింటికి చుట్టం చూపుగా వెళ్లాను. వాడూ అక్కడున్నాడు. అసలు వాళ్ళది పశ్చిమ గోదావరిజిల్లా. వాడు వాళ్ళ అమ్మతోకలసి పెత్తగాల్లిరిని ఓసారి చూచిపోదామని వచ్చాడు. "ఏం నాయనా! మీవూళ్ళో బాలసంఘం వుందా అని అడిగాను. దానిమీద వాడు "అదేమిటండోయ్ అట్లా అడుగుతారు? సంఘం వుండడమేకాదు. నేను మావూరు బాలసంఘంలో సభ్యుడ్ని కూడాను. కావాలంటే వినండి. మా బాలసంఘ నియమాలన్నీ మీకు వినిపిస్తాను. అవన్నీ నాకు కంఠతావచ్చు" అని చకచకా వల్లించాడు. "పశ్చిమ గోదావరిజిల్లా .... బాలసంఘము. సభ్యుల నియమాలు. బాలసంఘంలో చేరిన నేను ఈ నియమాలు అనుసరించి చక్కగా వుంటాను. రోజూ స్నానంచేస్తాను. శుభ్రమైన బట్టలు వేసుకుంటాను, బడికి మానకుండా వెళతాను, పాఠాలన్నీ శ్రద్ధగా చదువుతాను. అందరితోను కలిసిమెలిసి వుంటాను, అల్లరిచేయను........"అంతేనా. నన్ను మాట్లాడనివ్వకుండానే "ఇవే కాదు! నేను మీ ప్రజాశక్తివారు ప్రచురించిన పాటలపుస్తకం చదివాను....అని చటుక్కున అటెన్షన్ పొజిషనులో నిలబడి "బాలసంఘ సభ్యులం—భరతమాత పుత్రులం" అని కదంతొక్కుతూ గుక్కతిరగకుండా పాడేశాడు. "నేను సోవియట్ బాలబాలికలు అనే పుస్తకంకూడా చదివాను. అందులో బొమ్మలు నాకు బాగున్నాయి. నేనుకూడా బొమ్మలు గీయడం నేర్చుకుంటాను" అన్నాడు. "బాగానేఉందిగాని నాయనా! మీవూళ్లో బాలసంఘం ఏమేమి పనులు చేసిందో కొంచెం చెప్పు" అని అడిగాను. వాడిల్లా చెప్పాడు.

"మేమీమధ్య ఒక విజయం సంపాదించాం. మావూళ్లో ఒకాయన వాళ్ళబ్బాయిని రోజూ కొడుతూవుండేవాడు. ఆయన ముక్కోపి. ఆ కుర్రాడు మాతోవచ్చి రోజూ వాళ్ళ నాయన అనవసరంగా పట్టుకు చావకొడుతూ వుంటాడని చెప్పుకునేవాడు. ఆపెద్దమనిషిని అడగటానికి మాకూ ధైర్యం చాలిందికాదు, కాని రోజూ ఏమి చేయాలా అని ఆలోచిస్తూవుండేవాళ్లం. ఇంతలోకే మీరోసారి ప్రజాశక్తిలోసోవియట్ యూనియన్‌లో పిల్లలనుకొట్టకూడదనే శాసనంవుందని, ఓకుర్రాడు వాళ్ళతండ్రికొడితే పోలీసులకు చెప్పాడనీ వ్రాసినసంగతి చూచాక మాకుధైర్యంవచ్చింది. మేమంతాకలిసి ఆకుర్రాడికి ధైర్యంచెప్పి 'ఈతడవ మీనాన్నకొడితే నిర్భయంగా నిలబడి పిల్లల్ని అనవసరంగా కొట్టకూడదని, సోవియట్‌సంగతి చెప్పమని పంపాము. వాడింటికివెళ్లాక మామూలుప్రకారం ఏదో కోపంవచ్చి వాళ్ళనాన్న కొడుకును కొట్టడానికి వచ్చాడు. దెబ్బలకుభయపడి రోజూ పారిపోడానికి ప్రయత్నించేవాడు ఆనాడు ధైర్యంగా అలాగే నిలబడి తండ్రిని "నాన్నా! ఆగండి!" అనేసరికి ఆపెద్దమనిషి ఆశ్చర్యంతో నిలబడిపోయాడు. మామిత్రుడు తన తండ్రితో, తనను అలాకొట్టడం మంచిదికాదని, అది ఆయన గౌరవానికికూడా కళంకమేనని మేం చెప్పిన ఉపన్యాసమంతా అప్పజెప్పాడు, దానితో ఆయనకోపమంతా మటుమాయమైపోయింది. ఆరోజంతా బాగా ఆలోచించుకున్నాడు కాబోలు! మర్నాడునుంచీ కుర్రాడి వంటిమీద చేయివేయడంలేదు" అని సగర్వంగా తమ విజయాన్ని వాడు వర్ణించాడు. ఇంతలోకే వాడి చెల్లెలు ఎక్కడినించో పరుగెత్తుకువచ్చి వాడిచేతిలోవున్న రంగు రిబ్బను లాక్కుంది. వాడికి కోపం వచ్చి దాన్ని కొట్టబోయాడు. కాని చటుక్కున బాలసంఘ నియమం వాడికి జ్ఞాపకం వచ్చింది. ఆగిపోయి నాతో ఇలా అన్నాడు. "చూచావా! అది నా చేతిలోంచి రిబ్బను లాక్కుపోయింది. మొదట్లో నాకు కొట్టాలనిపించింది. కాని మా బాలసంఘంలో దెబ్బలాడుకోకూడదని నియమం వుండబట్టి ఆగిపోయాను" ఇంతలోకే వాడితల్లి అందుకుని "మీబాలసంఘాలువచ్చాక బ్రతికిపోయాం, ఇంట్లోఅల్లరి, కొట్లాటలు తగ్గాయి. పిల్లలు నిజంగా బాగుపడుతున్నారండీ" అన్నది.

ఇది విన్నాక నాకు చాలా సంతోషం కల్గింది. కాని మన బాలసంఘాలు ఇంకా చక్కగా పనిచేసి ఆదర్శవంతంగా వుండాలి.

— దొడ్డమ్మ.

నిష్కళంకసేవ దేశభక్తుల్ని ఆకర్షించక తప్పదు

శ్రీ కొసనం పశుపతిగారు భట్టిప్రోలులో ఖద్దరువ్యాపారం చేస్తున్న కాంగ్రెసువాది. ఇది వరకు రంగా అనుచరులతో కలసి మెలసి ఉండేవారు.

ఆగస్టు సంఘటనల తరువాత స్థానిక కమ్యూనిస్టులు వీరితో సంపర్కం కలిగించు కున్నారు. కామ్రేడ్సు తనతో చర్చించిన విషయాలు, తనకళ్ళ ఎదుటవారు చేస్తున్న కృషి ఈ దేశభక్తుణ్ణి ఎంతో ఆకర్షించాయి. సుస్థిర దీక్షతో పనిచేసే దేశసేవకులుగ కామ్రేడ్సుని గుర్తించారు. తరువాత బెజవాడలో జరిగిన ఆంధ్రరాష్ట్ర కమ్యూనిస్టుపార్టీ మహాసభకు వచ్చారు. సుందరయ్యగారి ఉపన్యాసంవిన్నారు. అప్పటి ఊరేగింపు, క్రమశిక్షణచూచి మెచ్చుకున్నారు. కాంగ్రెసు సాంప్రదాయాలను పార్టీ ఎలా బలపరుస్తుందో గ్రహించారు. కమ్యూనిస్టుపార్టీపై అభిమానం, విశ్వాసం బలపడింది.

ప్రజాశక్తి విడికాపీలు కొని చదవడం ప్రారంభించారు. తరువాత చందాదారులయారు. విధ్వంసక చర్యలను తీవ్రంగా ఖండించ సాగారు. గతమాసం 24 వ తేదీన భట్టిప్రోలులో జరిగిన ఫిర్కా జనరల్ బాడీ సభకు సంతోషంతో తన ఇంటినిచ్చారు. స్వంత ఖర్చుతో రెండుపూటలు కామ్రేడ్సుందరికీ భోజనం పెట్టారు. సామాన్య కుటుంబీకుడే అయినా భోజనాలకు డబ్బు ఇస్తామని కామ్రేడ్సంటే - "దేశాన్ని కాపాడడానికి మీరింత త్యాగంతో కృషిచేస్తుంటే - మీకోసం ఖర్చుపెడుతున్న ఈడబ్బు చాల సద్వినియోగమవుతుంది గదా! నాకీ అవకాశాన్నివ్వండి." అని ఎంతో అభిమానంతో అన్నారు.

నిష్కళంక దేశసేవ చిత్తశుద్ధిగల దేశభక్తుల్ని ఎలా ఆకర్షిస్తుందో ఈఉదంతం నిరూపిస్తుంది.

★

(5 వ పేజీ తరువాయి) అల్లరి ఆరంభించారు. ఎంతచెప్పినా, సర్దినా ఆగలేదు. పైగా చీకటిలో మట్టిబెడ్డలను రువ్వసాగారు. అధ్యక్షుని బుగ్గమీదకూడ ఒకబెడ్డపడింది. ఈ అల్లరినిచూచి గ్రామస్థులంతా అసహ్యించుకున్నారు. పంచాయతీబోర్డు అధ్యక్షుడుకూడ వచ్చి ఖండించాడు. అధ్యక్షుడు ఇట్టి అల్లరిమూక వేసే ప్రశ్నలకు సమాధానం చెప్పవలసిన అవసరంలేదని సభను ముగించారు. ఇది అమృతలూరులో జరిగిన ఉదంతం. 29 వ తేది "ఆంధ్రప్రభ"లో తప్పుడుగా ప్రచురించినట్లు, "కొన్ని ముఖ్య ప్రశ్నలకు" సమాధానం నేను చెప్ప నిరాకరించుటచే కాదు గల్లంతు వచ్చింది. "ములుకోల" ప్రచారకులు, రంగా ముఠా, రాయిస్టులువచ్చి గల్లంతు చేయాలనే చేశారు. ఈ గల్లంతును వెనుకనుండి ప్రోత్సహించినవారిలో ఒకరు ఒకప్పుడు గుంటూరు జిల్లా కాంగ్రెసు కమిటీ కార్యదర్శి పనిచేసిన రాపర్ల శివరామకృష్ణయ్యగారు.

సభపై నిషేధపు టుత్తరువు

అనంతవరంలో రంగా ముఠావారైన ధూళిపాళ్ళ కోటయ్య, వెనిగళ్ళ సత్యనారాయణగార్లు, ఒకప్పుడు కాంగ్రెసువాది అయిన నాగళ్ళ కృష్ణయ్య గారు, ఏ రకంగానైనా ఆ గ్రామంలో కమ్యూనిస్టులసభ జరుగనివ్వకూడదనీ, కమ్యూనిస్టులను కొట్టాలనీ, తమ అల్లరిమూకను ప్రోగుచేశారు. పోలీసులమీద ఏలాంటి ఒత్తిడితెచ్చారో తెలియదుగాని, మేమువెళ్ళి ఎర్రజెండాను ఎగురవేసి 20 నిమిషాలు మాట్లాడేటప్పటికి పోలీసులు 144 శెక్షను నోటీసులు జారీచేశారు. "కమ్యూనిస్టులను కొట్టడానికి, కమ్యూనిస్టు వ్యతిరేకపార్టీ అనంతవరంలో అన్ని ప్రయత్నాలు చేస్తూ ఉందని మాకు తెలిసింది. అందుచే అల్లరి జరుగకుండా మీటింగును నిషేధిస్తున్నాం. 15 రోజులవరకు" అంటూ సబ్‌మేజిస్ట్రేటు ఇచ్చి ఆర్డరు. మీటింగును గల్లంతుచేయాలని, కమ్యూనిస్టులను కొట్టాలని, ప్రయత్నించేవారిని అరికట్టక, మీటింగులను ఆపుజేయడాని కిది ఆ మేజిస్ట్రేటుకు. అతని క్రింది పోలీసు ఉద్యోగులకు చక్కనిసాకు దొరికింది. మీటింగును అంతటితో ఆపుజేసి మేము దావులూరికి వెళ్లాం. మీటింగుకు వచ్చిన కొందరు దారిని వెళ్లుతూఉంటే, అల్లరిమూక వెనకాలనుండి రాళ్ళు రువ్వారు. ఒకరిద్దరికి దెబ్బలు తగిలాయి. దీనిలో ప్రముఖస్థానం వెనిగళ్ళ సత్యనారాయణ, ధూళిపాళ్ల కోటయ్యగార్లది. పచ్చల తాడిపర్రులో ఒకరిద్దరు ప్రశ్నలు వేయడంతప్ప, మరెచ్చటా వీరేమీ చేయలేకపోయారు.

ఆంధ్ర మహాసభ తరపున అవకతవక ప్రచారం

ఆంధ్రరాష్ట్ర విద్యార్థి మహాసభ జరుగుతున్నప్పుడు, కమ్యూనిస్టులు రాయలసీమ నిధిని తిన్నారని గుంటూరుపట్టణ ఆంధ్ర మహాసభ కార్యదర్శి త్రిపురమల్లు లక్ష్మణగుప్తగారు ఒక కరపత్రం వేశారు. వాలంటీర్లకు ఖర్చుపెట్టింది కమ్యూనిస్టులు తిన్నారని ఇతడు తప్పుడు ప్రచారం చేస్తున్నాడు. ఆ వాలంటీర్ల అవసరాన్ని గుర్తిస్తూ రాయలసీమ కరువు కమిటీవారిచ్చిన స్టేటుమెంట్లే వీరికి తగిన జవాబిచ్చాయి. ఆ వాలంటీర్ల ఖర్చులకనే ఆంధ్ర మహాసభ రూ. 3000 లు ప్రత్యేకిస్తూ తీర్మానించిందన్న సంగతికూడ వీరు ఇప్పటికైనా తెలుసుకుంటే మంచిది.

సత్తెనపల్లిలో కమ్యూనిస్టులసభ నవంబరు 27 వ తేదీ అని 15 వ తేదినుండి కరపత్రాలువేసి ప్రచారంచేస్తూవచ్చాం. ఆతాలూకా ఆంధ్రమహాసభ కార్యదర్శి దరువూరి వీరయ్యగారు, తాలూకా అధ్యక్ష ఉపాధ్యక్షులకు ఎవరికీ తెలుపకుండానే 25 వ తేదిన ఒక కరపత్రంవేసి, 27 వ తేదీన ఆంధ్ర మహాసభ తరపున ఒక బహిరంగ సభను ఏర్పాటుచేశాడు. ఊరేగింపులో "కమ్యూనిస్టులు నాశనం కావాలి" అంటూ నినాదాలు కూడ ఇచ్చారు. కమ్యూనిస్టుల మీటింగుకు ప్రజలను పోనివ్వకుండా చేయాలను ఉద్దేశంతో ఈ మీటింగు ఏర్పాటుచేశారు. కాని, కమ్యూనిస్టు మీటింగుకు 5000 ప్రజలువస్తే, వీరి మీటింగుకు 500 కన్నా హెచ్చులేరు. వారి మీటింగులోమాత్రం అధ్యక్షులు కోడూరు లక్ష్మీపతిరావుగారు, కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచారం చేయనివ్వకుండా ఆపుచేశారు.

ఆంధ్రమహాసభను కమ్యూనిస్టు వ్యతిరేకులు ఉపయోగించుకోకుండా ఆంధ్ర మహాసభ ప్రముఖ కార్యకర్తలు శ్రద్ధవహించాలి. లేనిచో ఆంధ్రమహాసభ తన ఆశయాలను వదిలి తప్పుడుమార్గాల త్రొక్కుతుందని చెప్పక తప్పదు.

కాంగ్రెసువాదులు మేల్కోవాలి

కాంగ్రెసుపేరుతో కొంతమంది కాంగ్రెసువాదుల ప్రత్యక్ష ప్రోద్బలంవల్ల ఈమీటింగులలో అల్లరి జరుగుతూవుంది. కాంగ్రెసువాదులూ, కమ్యూనిస్టులు కొట్టుకుంటున్నారనే ధోరణికి ప్రజలు వస్తున్నారు. అల్లరి చేసేవారు కాంగ్రెసువాదులుకాజాలరనీ, అల్లరి చేసి మీటింగులు సాగనివ్వకుండా జేయడం కాంగ్రెసు సాంప్రదాయం కాదనీ, మేము చెప్పుతున్నాం. కాని, బయటవున్న ప్రముఖ కాంగ్రెసువాదులు శ్రీ కల్లూరి చంద్రమౌళిగారు, అయ్యదేవర శ్రీ కాళేశ్వరరావుగారు, శ్రీ కొండా వెంకటప్పయ్య పంతులుగారు ఇతరులు, ఇట్టి చర్యలను బహిరంగంగా ఖండించాలసిన సమయం వచ్చింది. వారలాచేయక మౌనం వహించడమంటే, కాంగ్రెసుపేరునుపయోగించుకొని కమ్యూనిస్టు మీటింగులలో గల్లంతుచేస్తున్నవారు కాంగ్రెసువాదులేనని ప్రజలు పొరపాటు పడడానికి అవకాశముంది. అది కాంగ్రెసు ప్రతిష్ఠకు నష్టం కలిగిస్తుందనీ, అలా జరగనివ్వక కాంగ్రెసు పేరు ప్రతిష్ఠలను కాపాడవలసిన బాధ్యత దేశభక్తు లందరిమీద ఉందనీ, మనవిచేస్తున్నాను.

★ పుస్తకపరిచయం

అభ్యుదయ కవి

★

రచయిత : పట్టికొండ రంగయ్యగారు.

వెల : 6 అణాలు; 38 పేజీలు.

పుస్తకాలకు : రచయితపేర వీరులపాడు (నందిగామ తాలూకా, కృష్ణాజిల్లా) కు వ్రాయాలి.

★

అభ్యుదయ కవిత వైపుకు తాను మరలడానికి ముందు కల్గిన భావసంఘర్షణనే, ఒక స్వప్నగాథగా చిత్రించాడు కవి. స్వప్నంలో "ఆంధ్ర జనయిత్రి" సాక్షాత్కరించి, "ప్రేయసీ, ప్రియురాల, ప్రియతమ," అంటూ ప్రణయగానం పాడటంమాని, "ఇంకనైన ప్రజాసమస్యలనెరిగి అభ్యుదయ ప్రవర్ధక కావ్యములు" రచించమని ప్రబోధించుతుంది. స్వప్నంలోని స్త్రీ మూర్తికీ, కవికీ జరిపించిన సంభాషణద్వారా, అభ్యుదయ సాహిత్యం ఎందుకు అవసరమో చర్చించాడు రచయిత.

కొన్నిచోట్ల సంస్కృత సమాసాలు ఎక్కువగాఉన్నా, మొత్తంమీద సులభమైన గ్రాంధిక శైలిలోనే నడిచింది రచన. చివరి భాగంలోని "పొద్దుపొడుపు"లోని ఉపమానాల ద్వారా ప్రస్తుత యుద్ధ-స్వాతంత్ర్యాల వాతావరణాన్ని చక్కగా తీసుకొచ్చారు. వాస్తవిక జగత్తుకు దూరమై, ఊహా ప్రపంచంలో నిర్మించుకొన్న ప్రణయనికోసం పలవరించే కవులను హెచ్చరించుతూ వ్రాసిన భాగాలు కూడాబాగా వున్నాయి.

కాని, కొన్నిచోట్ల రచన పేలవంగాఉంది. ఉదాహరణ : "కళ్ళు మూసుక మళ్ళీ మళ్ళీ, గాఢతర ప్రయత్నంబొనర్చితి, దండగాయె ప్రయత్నమంతయు, రెండు కొట్టినసూ". కొన్ని సంస్కృత పదాలకు ఉత్పత్తి అర్థాలుపోయి, ఇపుడు మరోఅర్థంలో వాడబడుతున్నాయి. ఉదాహరణకు "స్వార్థము" అన్నపదం నీచభావంలో ఉపయోగిస్తున్నాం. కాని, రచయిత అది గమనించకుండా "చైనరష్యా స్వార్థమునకున్, జగజ్జనతా స్వార్థమునకు" అంటూ వాడాడు.

రచయిత మరింత సులభశైలినీ, సూటిగా హృదయానికి హత్తుకుపోయే భావనాపటిమతో కుంటువడనిధారనూ, అలవరచుకొంటారని మా విశ్వాసం.

బాష్పకణాలు

★

రచయిత : నారపరెడ్డి రామిరెడ్డి

60 పేజీలు : అర్ధరూపాయి

పుస్తకాలకు : రచయిత పేర కోవూరు (నెల్లూరుజిల్లా) కు వ్రాయాలి.

★

ఇదొక ఖండకావ్యం. కావ్యవస్తువు, కర్షక, కార్మికుల జీవితంలో నిత్యము - ఎదురయ్యే కడగండ్లు.

కవి, తొలినుదిలో "ప్రణయ లోలత మత్తిలు గొప్పవారితో నాకు పనేమి? నావలె దినంబులు బాధల వెళ్ళబుచ్చు నీలోకపు దీన మానవుల లోగానుకష్టపుగాధ" వ్రాసెదనన్నాడు. వివిధ శీర్షికలక్రింద పైఆశయానికి అనుగుణ్యంగా వ్రాశాడు.

పీడిత బీదరైతుల, కూలీల, దీనఅవస్థలకు ఆవేశపరుడైన కవి ధనికులమీద - దైవం మీద స్వారిచేశాడు. వర్గకలహాన్ని నగ్నంగా ప్రదర్శించాడు.

కూలీరైతు సామరస్యం, దేశరక్షణకు అధికోత్పత్తి గావించుట, అన్నివర్గాలైక్యమై ఆహారసమస్యను పరిష్కరించుట, జాతీయ ప్రతిష్టంభనను భగ్నంచేయుట, ఫాసిస్టు రాక్షసులనుండి మాతృదేశాన్ని కాపాడుకొనుట, మొదలగు కర్తవ్యాలను ప్రబోధించవలసిన ఈ కాలానికి తగిన విషయాలతో రచనలేదు. వీటిని గురించి రచయిత ముమ్ముందు వ్రాయడానికి పూనుకొంటాడని ఆశిస్తున్నాం.

ధారాశుద్ధీ, తీయని తేట తెనుగుతో రామిరెడ్డిగారి కవిత మంచి పాకానేపడ్డది. "వేంకటేశ్వరరావు" అన్న శీర్షికలో తిరుపతిదేవుని జమీందార్లతో పోల్చి వ్రాయుటలో మృదువైన హాస్యాన్ని వెలిబుచ్చారు.

★

రాష్ట్రపార్టీ ఆర్గనైజరుపై కేసు

క్రిందటి నెల 1 వ తేదీన ఏలూరు తాలూకా యువజనమహాసభ దెందులూరి గ్రామంలో జరిగింది. ఆరోజునే ఆగ్రామంలోని వివేకానంద గ్రంధాలయ వార్షికోత్సవాన్ని గూడా జరిపారు.

యువజన మహాసభకు అధ్యక్షత వహించడానికి వెళ్ళిన కామ్రేడ్ కంభంపాటి సత్యనారాయణ (జూనియర్) మీద, మరిఇంకా 5 గురు మీద (గారపాటి యుగంధర్; యం. కూనేరావు; యం. సీతారామాంజనేయులు, వెలమాటి సుబ్బారావు, దేవినేని మాధవరావు గార్లు) డిఫెన్సు ఆక్టు 56 వ సెక్షన్ క్రింద కేసు పెట్టారు.

కాంగ్రెసుపాలసీని సమర్థిస్తూ, ఊరేగింపు, మీటింగులు చేశారని వారిమీద కేసు.

కామ్రేడ్ కంభంపాటి సత్యనారాయణ కమ్యూనిస్టుపార్టీ రాష్ట్ర ఆర్గనైజరుగా 1940 నుండి పనిచేస్తున్నారు. కమ్యూనిస్టుపార్టీ పంథా ప్రకారం, యుద్ధాన్ని బలపరుస్తూ, విధ్వంసకార్యక్రమంవల్ల స్వాతంత్ర్యం రాదని ఆహారసమస్య, జాతీయ ప్రతిష్టంభనా పరిష్కారాలకి అందరూ ముందుకు వచ్చి ప్రజాసంఘాలను, ఆహారకమిటీలను బలపరచాలని వారు ఆసమావేశంలో మాట్లాడారు. మిగిలిన 5 గురు సమావేశంలో పాల్గొన్నారు. వారిలో కామ్రేడ్ గారపాటి యుగంధర్ (ప॥గో॥జిల్లా యువజనసంఘాధ్యక్షులు) యం. కూనేరావు గార్లు కమ్యూనిస్టుపార్టీ సభ్యులు.

విధ్వంసక కార్యక్రమాన్ని ఖండించి యుద్ధాన్ని బలపరుచుటకై ప్రజలను ఉత్సాహపరచుటకు ప్రయత్నించిన వీరిమీద పెట్టబడిన కేసును మద్రాసు ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలి.

ప్రజాపద్ధతికి విజయం; నిరంకుశ పద్ధతికి చెంపపెట్టు

నూజివీడు తాలూకాలో రైతులచే యుద్ధబాండ్లను కొనిపించడానికి తహసిల్దారు అక్టోబరు ఆఖరువారం నుండి ప్రచారం ప్రారంభించారు. 30 వ తేదీని తాలూకా రైతు సంఘంయొక్క అధ్యక్ష - కార్యదర్శుల్ని పిలిచి తాలూకాలో మొత్తం 7 లక్షల రూపాయల విలువగల యుద్ధబాండ్లను అమ్మవలసి యుందనీ, యిందుకు సహాయం చేయవలసిందనీ, అడిగాడు. జమీందార్లవద్ద, షాహుకార్లవద్ద, 3 లక్షల రూపాయలు, రైతులవద్ద యకరం 1కి రు. 10 చొప్పున 4 లక్షలు, వసూలు చేయవలసి యున్నదని తెలియజేశాడు. తనతోకలిసి ప్రచారంచేస్తే, రైతులచేత సులభంగా ఋణపత్రాలను కొనిపించవచ్చునన్నాడు. లేనిచో, తానే బెదరించి అయినా కొనిపించవలసి వస్తుందనీ, మరొక మార్గం ఉండదనీ, చెప్పాడు. తనతోవస్తే, ప్రయాణపు ఖర్చులు తానే పెట్టుకుంటానన్నాడు.

తహసిల్దారు యెత్తుగడ

రైతుసంఘ నాయకులు వెంటనే తెలుసుకున్నారు, నూజవీడు తహసిల్దారు యొక్క ఉద్దేశం, రైతుసంఘంయొక్క సహాయంతో తన కోటాను సులభంగా వసూలు చేయవచ్చునని అతని అభిప్రాయం. కాని, తాలూకా రైతుసంఘాధ్యక్ష కార్యదర్శులిద్దరూ కమ్యూనిస్టుపార్టీ సభ్యులు, ప్రజాసేవకులు. శక్తికి మించిన సొమ్మును రైతుల్ని యిమ్మనరు. పార్టీపాలసీ ప్రకారం దేశరక్షణను ప్రజలు బలపరచవలసిందని హెచ్చరిస్తారు. శక్తికి తగినట్లు యుద్ధబాండ్లను కొనవలసిందని సలహాయిస్తారు. స్థానికాధికారుల జబర్దస్తీని యెదుర్కోడానికి యిదే సరియైనమార్గం అని ప్రచారంచేస్తారు. అందుకు త్రికరణశుద్ధిగా పనిచేస్తారు. ఈ పాలసీని ప్రజలు తప్పక అంగీకరిస్తారనే విశ్వాసం కమ్యూనిస్టులకుంది.

రైతునాయకులిచ్చిన జవాబు

ఈపాలసీ కనుగుణ్యంగా వారిద్దరూ, చెల్లించగలిగినవారివద్దా, చెల్లించలేనివారివద్దా, యకరానికి రు 10 చొప్పున తీసుకోవడం న్యాయం కాదని జవాబిచ్చారు. నిర్బంధపు వసూళ్ళను వ్యతిరేకిస్తాం అన్నారు. మీ ఖర్చులు మాకవసరం లేదని చెప్పారు.

కాని తహసీల్దారు పోతురెడ్డిపల్లె అనేగ్రామానికి వెళ్ళి, గ్రామస్థుల్ని సమావేశపరచి, గ్రామరైతు సంఘంద్వారా యుద్ధబాండ్లను కొనవలసిందని హెచ్చరించాడు. రైతులు ఆలోచించి చెబుతామని కొంత వ్యవధిని కోరారు. తరువాత కమ్యూనిస్టులు రైతులందరినీ సమావేశపరచి, శక్తి ఉన్నవారు యుద్ధబాండ్లను కొనడంవల్ల నష్టం ఏమీఉండదనీ, పైగా దేశరక్షణకు తోడ్పడినవారౌతారనీ, కొనకపోతే నిరంకుశోద్యోగుల చర్యలకు తావిచ్చిన వారౌతారనీ, నచ్చజెప్పారు. నలుగురైదుగురు విచ్ఛిన్నకులు ఈ పంథాను వ్యతిరేకించారు. కమ్యూనిస్టులు ప్రభుత్వంవద్ద 5 లక్షల రూపాయలు లంచం తీసుకున్నారంటూ కథలు అల్లారు. వీటికి పార్టీ ఆర్గనైజరు కడియాల పిచ్చయ్యగారు, తగిన విధంగా జవాబిచ్చాడు. రైతులు కమ్యూనిస్టు పాలసీని అంగీకరించారు. పార్టీ ఆర్గనైజరే కొందరు సలహాదార్ల సహాయంతో ప్రతి కుటుంబానికి శక్తినిబట్టి నిర్ణయించవలసిందని కోరారు. వారి లెక్కలు పరిశీలించి, గ్రామం మొత్తంమీద 1000 రూపాయ లిచ్చుటకు నిర్ణయించారు. తిరిగి సమావేశం జరిపి, తమ నిర్ణయాన్ని వివరంగా అందరికీ చదివి వినిపించారు.

కమ్యూనిస్టుల లెక్కలకు తిరుగు జవాబులేదు

మర్సపూడి అనే గ్రామంలో యుద్ధబాండ్లను కొనగలవారు బహుకొద్దిమంది మాత్రమే. అయినా, 2000 రూపాయలు వసూలు చేయాలని తహసిల్దారు, కరణం ప్రయత్నాలు ప్రారంభించారు. దానిపై కమ్యూనిస్టులు గ్రామస్థు లందరినీ నవంబరు 17 న సమావేశపరచి, పార్టీ పాలసీని తెలియజెప్పారు. అందరూ మెచ్చుకున్నారు. "మీరే లెక్కలు తయారుచేసి, ఎవరెవరు ఎంతెంత చెల్లించవలెనో నిర్ణయించండి" అన్నారు. పార్టీ ఆర్గనైజరు గ్రామస్థుల సహాయంతో లెక్కలు తయారుచేసి, మొత్తం రు. 317 నిర్ణయించాడు. వెంటనే రైతులు సంతోషంతో యీమొత్తాన్ని తాలూకా పార్టీ ఆఫీసుకు తీసుకువచ్చి యిచ్చారు. మరునాడు తహసీల్దారు వద్దకు వెళ్ళి, సొమ్ముతీసుకొని రశీదు తీయవలసిందని కమ్యూనిస్టులు కోరారు. మొదట తహసీల్దారు ఇవ్వలేదు. ఇంతకంటె ఎక్కువమొత్తం రావాలన్నాడు. కాని, పార్టీ సభ్యులు గ్రామస్థుల లెక్కలను తీసి చూపెట్టారు. తహసీల్దారు వాటిని చూచుకొని, మారుమాటాడకుండా రశీదు లిచ్చాడు!

గ్రామపెత్తందారు ఆటకట్టింది

గొల్లపల్లి అనే గ్రామంలో రైతులు విడివిడిగానే యుద్ధబాండ్లను కొన్నారు. ఒక గ్రామ పెత్తందారు తనపై ఎక్కువభారం పడకుండా తప్పించుకోడానికి పేదరైతుల్ని, కూలీల్ని, ఒత్తిడిచేయ ప్రారంభించాడు. మాలగూడెంలో 1 యకరం, 2 యకరాలు, చొప్పున ఉన్న నిరుపేదల్ని మొత్తం రు 100 చెల్లించుకోండని రివెన్యూ ఇన్స్పెక్టరును వెంటబెట్టుకుని నిర్బంధించ సాగాడు. పాపం ఆ పేదరైతులు డిప్యూటీ కలెక్టరుతో మొరపెట్టుకున్నారు. ఆయనకూడా నన్నేమిరా అన్నాడు. తమఫాదిరీని వెంటతీసుకువెళ్లి, తహసిల్దారును ప్రార్థించారు. తహసిల్దారుకూడా ఏమాత్రమూ తగ్గించడానికి వీల్లేదన్నాడు. చివరకు వారు కమ్యూనిస్టుపార్టీ ఆఫీసుకు వచ్చి, విషయం అంతా తెలియజేశారు. "ఎంత యిచ్చుకోగల" రని అడిగితే రు 50 యిచ్చుకుంటామని చెప్పి, మర్నాడు సొమ్ము తీసుకొచ్చారు. కాని, పాపం ఆ రు 50 లు ఎలా వచ్చాయి? మంచినీళ్ళ నూతిని బాగుచేయించుకోడానికి బేడ, పావలా చొప్పున వేసుకున్న చందా సొమ్ము అది. కమ్యూనిస్టులు ఆవిషయం తెలుసుకొని, రు50 చెల్లించకుండా చేస్తామని హామీఇచ్చారు. రైతుసంఘ కార్యదర్శి తహసీల్దారు వద్దకు వెళ్లి వీరి విషయమైవాదించాడు. "సరే ఇచ్చుకోనవసరంలేదు" అని తహసిల్దారు జవాబిచ్చాడు. పేదరైతులు సంతోషంతో తిరిగి వచ్చారు.

చీలికవల్ల నష్టం

గోగులంపాడులో లోగడ పార్టీకక్షలు బయల్దేరడంవల్ల రైతులు సమిష్టిగా పనిచేయలేకపోయారు. అందువల్ల పెద్ద రైతులవద్ద 12 వేల రూపాయలు వసూలుచేసి, చిన్నరైతుల్ని కూడా నిర్బంధిస్తూన్న సమయంలో కమ్యూనిస్టులు వెళ్ళి, వారివారి స్థితినిబట్టి వేర్వేరుగానే యిప్పిస్తున్నారు.

రు. 250 నుండి రు. 20 లకు తగ్గింపు

చింతలపల్లి అనే గ్రామంలో న్యాయంగా యుద్ధబాండ్లు కొనగలిగిన వారులేరు. అయినప్పటికీ, 4 గురు రైతుల్ని కరణం, తహసిల్దారు, నిర్బంధించి రు 250 వసూలు చేసుకోవాలని చూచారు. ధాన్యం, వేరుసెనగకాయ, అమ్మకూడదని బెదరించారు. స్థానిక కమ్యూనిస్టులు గ్రామస్థులందరినీ సమావేశపరచి, యుద్ధంయెడల పార్టీ వైఖరినిగురించి తెలియజేయగా, పై నలుగురు రైతులు రు. 20 ల బాండ్లను కొనడాని కంగీకరించారు. కమ్యూనిస్టులు తహసిల్దారువద్దకువెళ్ళి యీ మొత్తానికి అంగీకరించేటట్లు ఒప్పించారు.

ఇలాగే, చక్కపల్లి—ముసునూరు-తుక్కులూరు—కొత్తపల్లి—అనే నాలుగు గ్రామాలలో కూడా రైతులు సమిష్టిగా యుద్ధబాండ్లను కొనుట కంగీకరించారు. 2 గ్రామాలలో రు. 1000 చొప్పున, ఒక గ్రామంలో రు. 1200, నాలుగో గ్రామంలో రు. 400, యివ్వడానికి నిర్ణయించుకున్నారు.

ఫలితాలు

ఈ విధంగా ప్రజలు చొరవతీసుకొని, ఐక్యతతో స్థానికాధికారుల నిరంకుశ వద్ధతుల్ని ఎదుర్కోవడంద్వారా దేశరక్షణను బలపరచుకొంటున్నారు. ఈ విధానంవల్ల గ్రామస్థుల రాజకీయ చైతన్యం ఎక్కువౌతోంది. ఉదాహరణకు మర్సపూడిలో 100 కి 100 మంది రైతులు రైతుసంఘంలో చేరుతున్నారు. గొల్లపల్లిలో హరిజన వ్యవసాయ కూలీలు కూలీ సంఘంలోచేరి, రైతు-కూలీ సామరస్యంద్వారా తమ హక్కుల్ని సంపాదించుకోవాలని నిర్ణయించుకున్నారు. పోతురెడ్డిపల్లిలో సమిష్టి నిర్ణయాన్ని వ్యతిరేకించిన నలుగురు విచ్ఛిన్నకులలో ముగ్గురు యితర గ్రామస్థులతో కలిసి పనిచేస్తున్నారు.

ప్రతి కమ్యూనిస్టుపార్టీ సభ్యుడు యుద్ధబాండ్ల విషయంలో నూజివీడు తాలూకా కమిటీని ఆదర్శంగా తీసుకొని, తమ తమ ప్రాంతాలలో ప్రజా ఉద్యమాన్ని పెంపొందించవలసి యుంది.

మంచికలపూడిలో ప్రజా విజ్ఞాన ప్రచార మండలి

●

మంచికలపూడి గుంటూరుజిల్లాలో ఒక చిన్న గ్రామం. అయినా ఆంధ్రరాష్ట్రంలో మొట్టమొదట 'స్థానికప్రజావిజ్ఞాన ప్రచారక మండలి'ని స్థాపించుకున్న గౌరవం సంపాదించుకుంది.

గత మాసం 29 వ తేదీని శ్రీ కొండపనేని సుబ్బారావుగారి అధ్యక్షతకింద సభజరిగింది. శ్రీ కంఠంనేని గోపాలరావు, కాట్రగడ్డ నరసింహారావు, కొండపనేని రామారావు గార్లు ప్రజావిజ్ఞాన ప్రచారాన్ని గురించి ఉపన్యసించారు. ఆసభలో మండలికి కార్యవర్గాన్నెన్నుకున్నారు. శ్రీ లోకం రాఘవయ్యగారు అధ్యక్షులుగాను, నరిసెట్టి కోటయ్యగారు కార్యదర్శిగాను ఎన్నుకోబడ్డారు.

రాత్రికి కామ్రేడ్ తుమ్మల వెంకటరామయ్య అధ్యక్షతకింద బహిరంగ సభజరిగింది. 400 మంది సభకువచ్చారు. బాలసంఘ సభ్యులైన స్వరాజ్యం, వెంకాయమ్మ కలిసి 'శాల్యూట్' అను కీర్తనతో సభ ప్రారంభించారు. ఆంధ్ర రాష్ట్రప్రజావిజ్ఞాన ప్రచారక మండలి ఆర్గనైజరు డాక్టరు రాజారావుగారు, ఆంధ్రరాష్ట్ర అభ్యుదయ రచయితల సంఘ కార్యదర్శి చదలవాడ పిచ్చయ్యగారు విజ్ఞానాన్ని గురించి దాని ప్రచారం గురించి ఉపన్యసించారు.

మంచికలపూడి విజ్ఞానప్రచారకమండలిలో ఇప్పటికి 20 మంది సభ్యులుచేరారు. 50-8-0 విరాళాలు వసూలయాయి.

టోజోగా

(కోలాటంపాట)

భరతభూమిని నీదు పాదదాసిగజేసి
పాలింపనెంచితివా - టోజోగా - పాలింప నెంచితివా॥

మాతృభూమిని నీకు - మహాదాన మివ్వంగ
మాతృద్రోహులగామురా - టోజోగా - మాతృద్రోహుల గామురా॥

గాంధి, జిన్నా, జోషి - కన్నతల్లిని గావ
కార్యక్రమంబివ్వగా - టోజోగా - కార్యక్రమం బివ్వగా॥

కాంగ్రెసు లీగును - కమ్యూనిస్టులు కలిసి
కాల్చక నినువిడుతురా - టోజోగా - కాల్చక నినువిడుతురా॥

ఫాసిస్టు తొత్తయిన - బోసుమాటల నమ్మి
ఆశలు బడుచుంటివా - టోజోగా - ఆశలు పడుచుంటివా?॥

బానిసపీడను - బాయజూచూ ప్రజల
బాధింపనెంచితివా - టోజోగా - బాధింప నెంచితివా॥

కోట్లచేతులు గలిపి - గొంతుగోసీ నిన్ను
గోరికట్టక విడుతుమా - టోజోగా - గోరికట్టక విడుతుమా॥

స్వాతంత్ర్యప్రియులైన - కూలీ రైతులు నిన్ను
ఖూనీచేయక విడుతురా - టోజోగా - ఖూనీచేయక విడుతురా॥

— లోకం వెంకటేశ్వరరావు,

(నాల్గవఫారం విద్యార్థి)

* * *

తిరువూరు తహసిల్దారు ఫర్మానా

కాట్రగడ్డ వెంకటనారాయణరావుగారిట్లు వ్రాయుచున్నారు :

నవంబరు 23 నుండి 28 వరకు నేను తిరువూరు తాలూకాలో రైతుసంఘంవారి ఆహ్వానంమీద కొన్ని గ్రామాలలో సంచారం చేశాను. ప్రతి రైతునుండి వేరుసెనగ పుట్టి 1 కి రు. 3 చొప్పున, మిర్చి రు 10 చొప్పున, పుగాకు రు. 10 చొప్పున, జొన్నలు రు. 6 చొప్పున, వడ్లు రు. 5 చొప్పున, వసూళ్ళు ప్రారంభించి, యుద్ధబాండ్లను అమ్మవలసిందని తహసిల్దారు తన క్రింది ఉద్యోగస్తులకు లిఖితపూర్వకంగా ఫర్మానా పంపించాడు. అలా వసూలుచేయకపోతే, డిస్మిసుచేస్తానని కూడా వ్రాశాడు.

ఇట్టి అనాలోచితమైన నిరంకుశ పద్ధతులను పై అధికారులు అరికట్టాలి. లేనిచో, రైతులలో అసంతృప్తి వ్యాపించి, ప్రభుత్వం యొక్క ఉద్దేశానికే భంగం వాటిల్లగలదు.

ఆటల పోటీలలో నూతనశకం

యువజనపతాక కింద అన్నివర్గాల యువకులు ఏ క మౌ తు న్నా రు

— తాతినేని ప్రకాశరావు

ఏదేశమైనా అభివృద్ధిపొంది: శాంతిభద్రతలను అనుభవించాలంటే, ఆదేశంలోని యువజనుల విజ్ఞాన బలసంపదలమీద చాలవరకు అది ఆధారపడి వుంటుంది. ఈముఖ్య విషయాన్ని మనసులో ఉంచుకొని మన దేశంలో యువజనసంఘాలు పనిచేస్తున్నాయి. కృష్ణాజిల్లా యువజనసంఘం 8 సంవత్సరాలనుంచి కృషిచేస్తూ, జిల్లాలోని యువకుల్లో ఒకనూతన చైతన్యాన్ని కలిగించింది. ఇప్పటికి 5, 6 సంవత్సరాల నుంచి ప్రతిఏటా ఒలంపిక్ పందేలు నడుపుతూంది.

ఈఏడు నవంబరు మాసం దగ్గరపడుతున్నకొద్దీ అన్ని తాలూకాల్లోను, ఒలింపిక్ స్పోర్ట్సు ఉత్సాహం యువకుల్లో ఉప్పొంగుతూ వచ్చింది. గ్రామాల్లోనే కాకుండా, గూడేలల్లోకూడా యువకులు ఈస్పోర్ట్సుకు తరిఫీదు పొందడం ప్రారంభించారు.

1063 మంది పాల్గొన్నారు

నవంబరు 10 వ తేదీ నుండి 21 వ తేదీ వరకు ఈపందేలు జరిగాయి. గ్రామ, గూడెపు యువకులనే వ్యత్యాసాలు లేకుండా కూలీ - మధ్య - ధనికవర్గాల యువకులంతా కలిసి మొత్తం 1063 మంది ఆటగాండ్రు వీటిల్లో పాల్గొన్నారు. ఏలాంటి విభేదాలు లేకుండా ఇలా పాల్గొనడం నిజంగా గర్వపడవలసిన విషయం. ములగలపల్లి (కైకలూరు తాలూకా) గుడ్లవల్లేరు (గుడివాడ), చినఓగిరాల (గన్నవరం) పోరంకి (బెజవాడ), పెదపోప్రలు (దివి) లోను, బందరు తాలూకాలో 3 సెంటర్సులోను, ఆటలపోటీలు, వైజ్ఞానిక సభలు జరిగాయి. 104 గ్రామాలనుంచి 113 జట్టులు ఈ ఆటల పోటీలలో పాల్గొన్నాయి. ఆటలపోటీలకు, వైజ్ఞానికసభలకు అన్నిచోట్ల మొత్తం 46,400 మంది ప్రేక్షకులు వచ్చారు.

జిల్లాఅంతటాజరిగిన ఈఒలింపిక్‌స్పోర్ట్సుకి మొత్తం 1600 రూపాయిలు ఖర్చయింది. ఆటగాండ్రనుంచి రుసుముగావచ్చినది రు 500. మిగతాది యువకులు, ప్రజలు విరాళంగా ఇచ్చారు.

ప్రత్యేకత

ఈ ఆటలపోటీలను యువజనసంఘాలు జరపడానికి – ఇతరవిధంగా జరిగే ఆటల పోటీలకు చాల వ్యత్యాసం ఉంది. ఆటలపోటీలతో వైజ్ఞానిక మహాసభలను జతపరచడం జాతి జీవనంలో యువకుల స్థానాన్ని ఎప్పటికప్పుడు నినాదాలద్వారా, ఉపన్యాసాలద్వారా జ్ఞప్తికితెస్తుండడం, యువజనసంఘాల ప్రత్యేకత. ఆటస్థలాలకు ఠాగూర్ గేటు, భగత్‌సింగ్ గేటు, కయ్యూరుగేటు, జలియన్‌వాలాబాగ్ గేటు, నవకోటీశ్వరరావు(కోర్టుకు ఇనుక తవ్వుతుండగా పెళ్ళ విరిగిపడి చనిపోయిన వణుకూరు యువకుడు) గేటు మొదలైన పేర్లతో గేటు లమర్చారు. అన్నిటికన్నా ముఖ్యస్థానం "స్వాతంత్ర్యము–శాంతి–అభ్యుదయ" ఆశయాలతో వెలుగొందుతూన్న యువజనసంఘ పతాకానిది. ఈ ఏర్పాటులన్నిటిలోను స్థానిక బాలసంఘాలు ఎంతో తోడ్పడి అందరి మన్ననలను పొందాయి.

పోటీలు

చెడుగుడు; వాలీబాల్; కొక్కు; లాంగ్ జంప్ (16-9 అడుగులు): హైజంప్ (5-1 అడుగులు); పోల్‌వాల్ట్ (8-2 అడుగులు); హర్డిల్సు; సైకిల్‌స్పీడు (2 మైళ్ల 7 నిమిషాల 6 సెకండ్లలో); గుండువిసరుట (32-7 అడుగులు); క్రికెట్‌బంతి విసురుట; 100 గజముల పరుగు (18 సెకండ్లు); ఈత (2 ఫర్లాంగులు 6 నిమిషాల 8 సెకండ్లలో) మొదలయినవాటిల్లో పోటీలు జరిగాయి.

రెడ్‌స్టార్ టీము (చల్లపల్లి, దివి); లెనిన్ మెమోరియల్‌టీము (చినవోగిరాల); గోపవరంటీమ్ (కైకలూరు); పసుమర్రుటీము (గుడివాడ); రంగారావు మెమోరియల్‌టీము (కోలవెన్ను, బెజవాడ); శాంతి చక్రవర్తి మెమోరియల్‌టీము(ప్రొద్దుటూరు, బెజవాడ); లూడ్‌మిల్లాటీము (చోడవరం, బెజవాడ); ఆయా తాలూకాలలో చెడుగుడులో ప్రధమ బహుమానాలు పొందాయి. కైకలూరు తాలూకాలో బాడ్‌మింటన్ (డబుల్సు)పోటీలు కూడా జరిగాయి; 6 జట్టులు పాల్గొన్నాయి.

గుడివాడ తాలూకాలో రాజారావుగారిచే విలువిద్య ప్రదర్శనాలు, బెజవాడ తాలూకాలో ఏ. పాండురంగరావుగారిచే బలప్రదర్శనం, కర్ర, కత్తిసాము ప్రదర్శనాలు జరిగాయి. రెండువేలకు పైగా ప్రజలు ఈప్రదర్శనాలు చూచారు.

వైజ్ఞానిక సభలు

కామ్రేడ్స్ తుమ్మల వెంకటరామయ్య, కె. వెంకటరామశాస్త్రి, కంభంపాటి సత్యనారాయణ (జూనియరు), జి. రాధాకృష్ణమూర్తి, చదలవాడ పిచ్చయ్య, కాట్రగడ్డ రాజగోపాలరావు, కొండపల్లి దశరధరామయ్యగార్లు ఆయా తాలూకాల్లో వైజ్ఞానిక సభల్లో ఉపన్యసించారు. ఈ సభల్లో బుర్రకథలు, నాటకాలు చిత్రవిచిత్ర వేషాలుకూడా జరిగాయి. 25 గ్రామాలనుంచి వచ్చిన 125 మంది యువకులు వీటిని ప్రదర్శించారు. ఇంతేగాకుండా వాగ్వివాద, వ్యాసరచనలోను, సంగీత పోటీలలో మొత్తం 90 మంది యువకులు, బాలురు పాల్గొన్నారు.

విచ్ఛిన్నకారులు

మొత్తం అన్ని తాలూకాల్లోను జాతీయ యువజన సంఘాల టీములు పోటీల్లో పాల్గొన్నాయి. ఈ టీముల్లో కొందరువ్యక్తులు ఆటగాండ్రలో చీలికలుతెచ్చి, కార్యక్రమం అంతటినీ పాడుచేయడానికి ప్రయత్నించారు. ఓడిపోయిన టీములలో అసంతృప్తిని రెచ్చగొట్ట జూచారు. కాని, ముందుగానే ఇలాంటివారి పన్నాగాలను బట్టబయలు చేయడంవల్ల వీరి కుట్రలు ఎక్కడా సాగలేదు. బెజవాడ తాలూకాలోని 'రెడ్‌ఆర్మీ' టీము ముందు వీరి వలలోపడినా, వాళ్ళు వెంటనే మేల్కొని తమ తప్పును ఒప్పుకున్నారు.

ఈఒలింపిక్‌స్పోర్ట్సులో ప్రజలందరూ యువజనసంఘానికి ఎంతోతోడ్పడ్డారు. మహిళలు అడక్కుండానే సంతోషంతో మజ్జిగ, కూరగాయలు వంటశాలలకు పంపేవారు. క్రమశిక్షణతో యువజనసంఘం తన కార్యక్రమాన్ని జయప్రదంగా నిర్వహించడాన్ని అందరూ మెచ్చుకున్నారు. కృష్ణాజిల్లా యువజనసంఘం దినదినాభివృద్ధి పొంది, జిల్లాలో, అన్నివర్గాల యువకుల్ని తన పతాకంక్రింద సమీకరించగలదనే విశ్వాసాన్ని ఈ ఒలింపిక్ స్పోర్ట్సు స్థిరపరిచాయి.

ఎట్టి చైతన్యమూలేని ప్రజలకు కొత్తవెలుగు

— పుచ్చలపల్లి సుందరయ్య

కృష్ణాజిల్లాయందలి తిరువూరు తాలూకా పూర్తిగా మెట్టప్రాంతం, జమీందారీగ్రామాలు, మొఖాసాగ్రామాలే, అక్కడున్నాయి. ప్రజలు చాలా అమాయకులు, వెనుకబడ్డవారు.

మొఖాసాదారు మొదట, ఒక జమీందారు వద్ద కొన్ని గ్రామాలను శిస్తు వసూలుకు తీసుకొని, వసూలుచేసిన శిస్తులో కొంత భాగాన్ని జమీందారుకు చెల్లించి, కొంత తానుంచుకునేవాడు. క్రమేణ రైతుల్ని అనేక కష్టాలుపెట్టి, పెద్దపెద్ద ఆస్తులు సంపాదించాడు. ఉదాహరణకు, చిత్తపోరు అనే గ్రామాన్ని పూర్వం మొఖాసాదారు జమీందారువద్ద శిస్తు వసూలుకు తీసుకున్నాడు. గ్రామంలో 7 వంతుల పొలం రైతులకూ, 1 వంతు మాత్రం మొఖాసాదారుకు, ఉండేది. ఇతడు గ్రామంలో రు 1000 వసూలుచేసి, జమీందారుకు రు 500 పేష్కసు చెల్లించి, తాను రు. 500 ఉంచుకొనేవాడు. కాని, యీరోజున మొఖాసాదార్లకు అదే గ్రామంలో 250 యకరాల పల్లపుభూమి, 3000 యకరాల మెట్ట, రు 10,000 ఆదాయం వచ్చే మామిడితోటలు, రు. 8,000 వచ్చే జరీబు తోటలు, రు. 6,000 వచ్చే ఇతర ఆస్తులు, ఉన్నాయి. రైతులకు 150 యకరాల పల్లపు భూమి, 400 యకరాలమెట్ట రు. 8000 వచ్చే మెట్టపొలం – జరీబు తోటలు, మాత్రం ఉన్నాయి. అంటే, మొఖాసాదార్లది 5 వంతులు, రైతుల్ది 3 వంతులు: రైతులపొలం మునుపటిలో సగంఅయినా, కట్టే శిస్తు మాత్రం రు. 2500 కు పెరిగింది.

ప్రపంచం తలక్రిందులైనా –

ఈ మొఖాసాదార్లు ప్రపంచం అంతా తలక్రిందులైనా, తమ ఆడంబరాలు, అధికార దుర్వినియోగం విడువరు. ఈకరువురోజుల్లో రైతులు పంట లధికంగా పండించవలసిన అవసరం ఎంతో ఉండగా, వారి కనేక అడ్డంకులు కలిగిస్తున్నారు. చనుబండ, నర్సారావుపాలెం, మొఖాసాదారైన రామచంద్రరావుగారంటే ఆ గ్రామస్థులందరికీ హడలు. మీటింగులకు సహితం రావడానికి భయపడతారు. రహస్యంగా పొరుగూళ్ళకు వచ్చి, తమ బాధలు చెప్పుకుంటారు.

ఉద్యోగస్థుల వైఖరి

ప్రజల్ని అణచడానికి మొఖాసాదార్లు, జమీందార్లు అనేక కేసులు బనాయించడం పరిపాటి. వేరుసెనగకాయ పీకారనీ,జొన్నలు కోసుకుపోయారనీ, మిరపతోట పాడుచేశారనీ–యిలా లెక్కలేనన్ని అక్రమపుకేసులు పెతతారు. ఇవిగాని కొట్లాట కేసులు, జామీనుకేసులు, అక్రమ ప్రవేశపుకేసులు – ఎన్నో ఉంటాయి. ఉద్యోగస్థులు మొఖాసాదార్ల, జమీందార్ల, చేతుల్లోనివారు. వీరినుండి ఎట్టి న్యాయంకలుగదని ప్రజలుభావిస్తున్నారు. ఇందుకు కారణం పోలీసు యిన్‌స్పెక్టర్లుగాని, తహసీల్దార్లుగాని, మేజిస్ట్రేట్లుగాని, మొఖాసాదార్ల యిండ్లలోను, జమీందార్ల యిండ్లలోను, విందులారగిస్తారు. రైతులపై జమీందార్లు, మొఖాసాదార్లు పెట్టే కేసులన్నీ, సులభంగా దాఖలవుతాయి.

ఉద్యోగస్తులు జమీందార్ల తరఫున, మొఖాసాదార్ల తరఫున ఉంటారనే భావాన్ని ప్రజల నుండి పోగొట్టాలంటే, వారి యిండ్లలో విందులు గుడవడం మానివేయాలి. రైతులపై జమీందార్లు, మొఖాసాదారులు అనవసరంగా ఛార్జీలు తీసుకొస్తే, వాటిని స్థానికంగా విచారించి త్రోసివేయాలిగాని, వెంటనే దాఖలు చేసుకోకూడదు. వెంటనే దాఖలు చేసుకోవడం నిష్పక్షపాతంగా ప్రవర్తించడంకాదు. కేసుల విచారణకోసం ఆయాగ్రామాలకు సమీపంలోనే క్యాంపులు వేసుకోవాలి. అనవసరమైన వాయిదాలు వేసి, రైతుల్ని తిప్పిబాధించకూడదు.

అడవులు షాహుకార్లపరం

చిరకాలంనుండీ అడవులలో పశువుల్ని మేపుకొనే హక్కు రైతులకుండేది. కాని, నేడు జమీందార్లు వాటిని ఎక్కువ డబ్బుకు షాహుకార్ల పరంచేస్తున్నారు. ఆషాహుకార్లు బొగ్గుకోసం అడవుల్ని కొట్టేసి, వర్షాలు పడకుండా నష్టంకలిగిస్తున్నారు. రైతులకు కట్టె, పశువులకు మేత, దొరకడం కష్టమౌతోంది. ఇట్టి అమ్మకాలు యుద్ధకాలంలో చెల్లవని, విక్రియాలను రిజస్టరుచేయకూడదనీ, ప్రభుత్వం ప్రకటించాలి.

పంట చెరువులలో దొరపొగాకు

తాలూకాలో చెరువుల మరమ్మతులు చాల నిర్లక్ష్యం చేయబడుతున్నాయి. దీనికితోడు, గత రెండు మూడు సంవత్సరాలుగా పొగాకు వ్యాపారస్తులు జమీందార్లవద్ద చెరువుల్ని దొరపొగాకు పంటకు కంట్రాక్టు తీసుకొంటున్నారు. నవంబరుకంతా చెరువుల నీటిని వదలిపెట్టేశారు. మళ్ళీ వర్షాలుపడి చెరువులు నిండేవరకు ఆకుమళ్లు వేసుకో (నారుపోసుకో) లేకపోవడం; అందువల్ల పంట నష్టంకావడం జరుగుతూంది. అంతేగాక, చెరువులు దున్నడంవల్ల, కొత్త వరదలు వచ్చినప్పుడు చెరువు పూడిపోతుంది. మల్లేల, గంపలగూడెం, యినగడప, కొత్తపల్లి, కనుమూరు, చింతలపాడు, కోకిలంపాడు గ్రామ చెరువులలో నీటిని వెళ్ళగొట్టి, పొగాకును పండిస్తున్నారు. రోలుపడిగ్రామపు చెరువునిండా కావలసినంత నీరుఉన్నప్పటికీ, ఆచెరువుకు గండిపెట్టి, నీటిని విడిచిపెట్టేశారు. ఇతర మెట్టపొలాలలో పొగాకును పండించాలిగాని, ఆహార పంటలకు నష్టంకలిగేవిధంగా పండించడం తగదు. ప్రభుత్వం దీనిని నిషేధించాలి. (ఈ వ్యాసం వ్రాసిన తరువాత, జమీందారు వచ్చే సంవత్సరం చెరువు మరమ్మతులకై రు. 6000 ఖర్చు పెట్టుటకు, దొరపొగాకును పండించకుండా చేయుటకు, అంగీకరించాడు.) ఇలాగే, పోలవరం గ్రామంలో గండిచెరువు అనే చెరువుకు మరమ్మతులులేక, 150 యకరాల భూమిలో దాదాపు 750 బస్తాల ధాన్యంమాత్రం పండుతూంది. చెరువుకు లోదట్టునఉన్న కళంగి తూములకు మరమ్మతు చేయిస్తే, 1600 బస్తాల ధాన్యం పండుతుంది. ఈ విషయమై రైతులు 2 పర్యాయములు జిల్లా కలెక్టరుకు పిటీషన్లు పెట్టుకున్నప్పటికీ, ఇంత వరకూ దర్యాప్తులేదు.

రైతుసంఘవర్కర్ల కృషి

ఇలాంటి తాలూకాలో కమ్యూనిస్టులు 1 సంవత్సరంనుండి రైతుసంఘాన్నినిర్మించి ప్రజలలో అధికారులన్నా, జమీందారులన్నా, భయాన్ని మెల్లమెల్లగా పోగొడుతున్నారు. రైతుల ప్రతి చిన్నసమస్యను తీసుకొని పని చేస్తున్నారు. చిల్లరతగాదాలు మొదలు ఆహార కమిటీలనిర్మాణం, మొఖాసాదార్ల అక్రమాలు మొదలైన పెద్దసమస్యలవరకూ పరిష్కరించుకోడానికిమార్గం చూపుతున్నారు. తాలూకాయందలి 70 గ్రామాలలో కొత్త వెలుగును తీసుకువెళ్లి ప్రజలలో నూతనచైతన్యాన్ని కలిగిస్తున్నారు. ప్రతి మారుమూల గ్రామానికి నూతన సందేశాన్ని అందజేస్తున్నారు.

★ యు ద్ధ స మీ క్ష

జపాను జర్మనీల పని బట్టడానికి

మిత్రరాజ్యానాయకుల సమావేశాలు

— తుమ్మల వెంకటరామయ్య

జపాను పసిఫిక్‌రంగంలో హఠాత్తుగా దెబ్బతీసి 1941 డిసెంబరులో యుద్ధంలోకి దిగింది. రేపటికి రెండేళ్ళు పూర్తవుతాయి. ఈ రెండేళ్ళలో పరిస్థితులు చాలా మారాయి.

నేడు పసిఫిక్‌లో సైనిక పరిస్థితులు జపానుకు అను కూలంగాలేవు. అమెరికను సైన్యాలకే చొరవచిక్కింది.

ఒక్కొక్కటిగా కీలకస్థానాలన్నీ అమెరికావశం అవుతున్నాయి. అమెరికా నౌకా విమానబలం రోజురోజూ పెంపొందుతోంది.

ఆస్ట్రేలియాపై దాడిసల్పాలని, లేదా కనీసం అమెరికాతో ఆస్ట్రేలియాకురాకపోకలులేకండా నైనా చేయాలని, జపాను ప్రయత్నించింది. అందుకు న్యూగినీ- సోలమన్‌దీవులను ఆక్రమించింది. తిరిగి వీటిని వశపరచుకోడానికి గత 18 నెలలలోను తీవ్రంగా, విమాన యుద్ధాలు జరిగాయి. జపాను నౌకాదళానికి గట్టిదెబ్బలు తగిలాయి.

అమెరికా పునరాక్రమణ

అమెరికన్ సేనలు సోలమన్ దీవులను, న్యూగినీలోని కీలక స్థానాలను తిరిగి వశపరచుకొన్నాయి. ఆస్ట్రేలియాకు ప్రమాదం తప్పడమే గాదు, ఇపుడు ఆగ్నేయ పసిఫిక్‌లో జపాను నౌకా ముఖ్య కేంద్రమైన రాబాల్ మీదకే అమెరికన్ సైన్యాలుఉరుకుతున్నాయి. అమెరికాపై విమానదాడులకు వేదికగా పనికి వస్తుందని ఉత్తరాన జపాను అలూషియన్ దీవులను ఆక్రమించింది. కాని దానినుండి కూడా ఉద్వాసన చెప్పించింది అమెరికా. ఇపుడు మధ్య పసిఫిక్‌లో గిల్బర్టుదీవులలో అమెరికన్ సైన్యాలు ప్రవేశించాయి.

గిల్బర్టు దీవులలో విమానాశ్రయాలు నిర్మించుకొని, మార్షల్ దీవులమీద ట్రక్ దీవిమీద, చివరకు ఫిలిప్పైన్‌మీద దాడి సల్పడానికి అవకాశం లభించింది. అయితే ఇది చాలా కాలం పట్టవచ్చు. ఇదంతాజరిగేలోగా జపాను నౌకాదళంతో భీకరయుద్ధాలు చేయాల్సివుంటుంది. అయినప్పటికీ నౌకా సంఖ్యలో అమెరికాదే పైచేయి అవడంవల్ల, జపాను గట్టి దెబ్బలు తినక తప్పదు.

కాని ఇంతమాత్రాన, ఒక్క నౌకాయుద్ధాల వల్ల, ఒక్కొక్క దీవినే ఆక్రమించుకోవడం వల్ల, జపాను వెంటనే లొంగదు. ఇపుడు పసిఫిక్‌లో జరుగుచున్న యుద్ధాలకు తోడుగా, ఆక్రమిత చైనాలోని జపాను సైన్యాలమీద, ఇండియా- సిలోనులనుండి బర్మా మలయాలమీద, ఒకేసారిదెబ్బతీయాలి, అంటే మొదట చైనాకుఅత్యవసరమైన బర్మా రోడ్డును పునరాక్రమించుకోవాలి.

కాని ఇట్టి పనికి మిత్రరాజ్యాలు ఇంకా పూనుకోలేదు. బర్మా మలయాలపై దండయాత్రకుగాను, ఆగ్నేయ పసిఫిక్ యుద్ధరంగానికి లార్డులూయీ మౌంట్‌బాటిన్‌ను నియమించినా, దండయాత్ర ఇంకా ఆచరణలోకి రాలేదు. ఈ ఆలస్యాన్ని జపాను ఉపయోగించుకొని, నౌకా విమాన బలాన్ని పెంపొందించుకుంటూ వుంది. మరొక ప్రక్క చైనాలో కొత్తగా దాడులు ప్రారంభించింది. మధ్య చైనాలో, చంకిగ్‌నుఆక్రమించుకోవాలని ఉద్దేశ్యంతో ఈ దాడి ప్రారంభమయింది. చాంగ్‌ని ప్రదేశంలో యుద్ధం జరుగుతోంది. చాంగ్ డేని జపాను సైన్యాలాక్రమించాయి. కాని చైనా సైన్యాలు చాంగ్ డేనుండి జపానుసైన్యాలను తరిమివేస్తున్నాయి. ఇంకా వీధియుద్ధాలు సాగుతూనే వున్నాయి.

జపాను కొత్త ఎత్తులు

అన్నిటికన్నా జపానుకుగల అవకాశం, తన శత్రువుల రాజకీయ బలహీనత. అంటే, భారత ప్రతిష్టంభనను అంతమొందించకండా, బర్మా మొదలగు వాటి భావిస్వతంత్ర విషయమై ప్రకటించకుండా ఉంచటం. దీనిని అవకాశంగా దీసుకొని జపాను దుష్ప్రచారం సాగించుతోంది. ఆసియా ప్రజలను మోసగింప జూస్తోంది. దానినే మాస్కో పత్రిక "వార్ అండ్ వర్కింగ్‌క్లాస్" ఇలాచెప్పింది. "జపాను రాజకీయవేత్తలు, యుద్ధంలో విజయము ఖాయం అయ్యే పరిస్థితులు ఎలాగూ లేవని తలచి, తమ రాజకీయ ఆర్థిక మిలిటరీ పెత్తనాన్ని స్థిరపర్చుకోడానికి కొత్త ఎత్తులు వేస్తున్నారు."

ఆఎత్తు లేమిటి ? తమ ఫాసిస్టుసామ్రాజ్య వాంఛను కప్పిపుచ్చడానికి, "ప్రాచ్యఆసియా ప్రజలం అంతా ఒకటే" అంటున్నారు. ఆక్రమిత చైనాకు, బర్మాకు వాంగ్‌చింగ్‌వీ, డాక్టర్ బామాలలాంటి కీలుబొమ్మలను అధిపతులుగాజేసి అవి "స్వతంత్ర" రాజ్యాలంటూ ప్రకటిస్తున్నారు. మరొకప్రక్క బోసు తాత్కాలిక భారత ప్రభుత్వాన్నికూడా గుర్తించారు. ఇదంతా దేనికి ?

బ్రిటిషు అమెరికా సైన్యాలు సంసిద్ధపరచుచున్న తిరుగుదండయాత్రను భగ్నం చేసేందుకు, ఇండియాపై బడటానికే, ఇదంతా చేస్తోంది. ఇండియాలో ఎక్కువభాగం ఆక్రమించుకోవడం అసాధ్యమైన పనియైనా, మిత్రరాజ్యాల పునరాక్రమణను భగ్నంచేయాలని జపాను వాంఛ. జపానుదాడి తాత్కాలికమే అయినా, క్షామంతోను, రాజకీయ ప్రతిష్టంభనతోను కల్లోలమై ఉన్న మనదేశానికి ఇది చాలా ప్రమాదం. బోసు తెచ్చే జపాను స్వరాజ్యపు రుచి అప్పుడే తూర్పుబెంగాలుపైన, కలకత్తాపైన వేసిన బాంబులే తెలియజేస్తున్నాయి.

కైరో సమావేశం

ఇట్టి పరిస్థితులలో చర్చిల్ - రూజ్‌వెల్టు - జంగ్‌కై షేక్‌ల సమావేశం జరిగింది. వీరు కైరోలో 5 రోజులు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో చైనా, ఈక్రింది కోర్కెలు పెట్టినట్లు తోస్తుంది. 1. పసిఫిక్ - ఆగ్నేయ ఆసియా - చైనాలలో సంయుక్త వ్యూహంతో ఒకేసారి జపానుపై దెబ్బతీయడం 2. బర్మా రోడ్డు వశంకావడానికి ఇండియానుండి దెబ్బ తీయడం.

ఈ స మా వే శ ం లో ముందు యుద్ధ వ్యూహాన్ని గురించిన వివరాలు ప్రకటించబడకపోయినా, ఒకటి స్పష్టమయింది: ఒక దీవి తర్వాత మరొక దీవిపైబడే నత్తగుల్ల నడకమాత్రం ఇక ఉండదు. అట్టి వ్యూహాన్ని పూర్తిగా మిత్రరాజ్యాలు వదలివేశాయి.

చర్చిల్ - రూజ్‌వెల్టు - జంగ్‌కై షేక్‌ల సమావేశానంతరం వెలువడిన ప్రకటన ఇలా వుంది. "జపాను దురాక్రమణదారుని శిక్షించడానికి, దురాక్రమణను తొలగించడానికి మిత్రరాజ్యాలు పోరాడుతున్నాయి. మాకు స్వలాభాపేక్షగాని, మా ప్రదేశాలను విస్తీర్ణపరచుకొనే ఉద్దేశ్యంగాని లేదు. 1914 యుద్ధ ప్రారంభం నుండి జపాను ఆక్రమించుకొన్న దీవులన్నిటి నుండీ దానిని తొలగించుతాం. చైనానుండి కాజేసిన మంచూరియా ఫార్మోజా, పెస్కాడోర్సులను తిరిగి చైనా రిపబ్లిక్‌కు అప్పజెప్పుతాం." ఇంకా జపాను ఆక్రమించిన తదితర ప్రదేశాలనుండి వెళ్ళగొడతామని, కొరియాకు స్వాతంత్ర్యం ఇస్తామని ఇదే ప్రకటనలో తెలియజేశారు.

జపాను ఫాసిజంనుండి ఇలా వివిధ ప్రదేశాలకు విముక్తి కల్గించడానికి తీసుకున్న నిర్ణయం మంచిదే. చైనాకు ఎట్టి సామ్రాజ్య వాంఛలు లేవని ఇదివరకు జంగ్-కై-షేక్ ప్రకటించాడు. దీనినే లండన్‌లోని చైనా రాయబారి వెల్లింగ్టన్‌కూ తిరిగినొక్కిచెబుతున్నాడు. అమెరికాకూడ ఫిలిప్పైన్ దీవులకు స్వాతంత్ర్యాన్ని ప్రకటించింది. కాని బర్మా భవిష్యత్తును గురించి చెప్పడానికి అమెరీ నిరాకరించుతున్నాడు. ప్రాచ్యఆసియా ప్రజలలో అనుమానాలు పోగొట్టాలంటే, బ్రిటన్ హాంగ్‌కాంగ్‌ను చైనాకిచ్చివేయాలి, బర్మా మలయాల స్వాతంత్రం ప్రకటించాలి, భారత ప్రతిష్టంభన పరిష్కరించాలి. అపుడే జపానుపై తిరుగుదండయాత్ర సులభం కాగలదు.

బ్రి టి షు ప్రభుత్వంలోని అభివృద్ధి నిరోధకులు ఇందుకు సంసిద్ధపడటంలేదు. కాని చివరకు వారి ఆటలు ఓడిపోయి ప్రజలే గెలుస్తారనడానికి ఈ యుద్ధక్రమమే చెబుతోంది.

ప్రజా విజయాలు

ఇటలీలో ఆమ్‌గాట్ (మిత్రరాజ్య మిలటరీ ప్రభుత్వం) పోయి, ప్రజా ప్రభుత్వం ఏర్పడే దినాలు సమీపించాయి. ఇటలీలో 'మిత్రరాజ్య సమితి' సోవియటు ప్రతినిధి విషినిస్కీ ఆధిపత్యాన జరిగింది. ముమ్ముందు ఇది గావించే సూచనల ప్రకారం ఇటాలియను ప్రజా ప్రభుత్వం ఏర్పడుతుంది.

జ న ర ల్ స్మ ట్సు ఏ మి వా గి నా, ఫ్రెంచి సామ్రాజ్యం చచ్చిపోతుంది. కాని ఫ్రెంచి రిపబ్లిక్ చావదు. ఈనాడు, వివిధ ఫ్రెంచి దేశాలలోనున్న ఫాసిస్టు వ్యతిరేక ఉద్యమాలను ప్రజాస్వామ్య ఉద్యమాలను సమన్వయపరచడానికి, ప్రయత్నం జరుగుతోంది. ఫాసిజాన్ని ఎదిరించి పోరాడుతూ ఉన్న స్వతంత్ర ఫ్రాంసు ఉద్యమ నాయకులే దీనికి నాయకత్వం వహించుతున్నారు.

యుగోస్లావియాలో కూడ, ద్రోహి మిహిలోవిచ్ ఆటలు సాగని పరిస్థితు లేర్పడ్డాయి. యుగోస్లావియాలోని గెరిల్లాలు తాత్కాలిక ప్రభుత్వం ఏర్పరచుకొన్నారు. జర్మన్లకు సింహస్వప్నమై "టిటో" అనే మారు పేరుతో మొన్నటిదాకా దాగియున్న జోసిప్ బ్రోజ్ టిటో సర్వసైన్యాధిపతి అయ్యాడు. ద్రోహి మిహిలోవిచ్‌గాని, అతన్ని అంటిపెట్టికొని ఊగిసలాడే యుగోస్లావియా ప్రవాసప్రభుత్వం గాని, యుగోస్లావ్ దేశభక్తుల పురోగమనాన్ని అడ్డగించలేవు.

స్టాలిన్—చర్చిల్—రూజువెల్టుల స మా వే శ ం

మాస్లే విడుదలకు కారకులై, ఫాసిస్టులతో మంతనాలు ఆడదలచుకొన్న బ్రిటిషు అభివృద్ధి నిరోధకులకు టెహ్రాన్‌లో జరిగిన స్టాలిన్- చర్చిల్- రూజ్‌వెల్టు సమావేశం చెంపపెట్టు అవక తప్పదు. అలాంటి అభివృద్ధి నిరోధకులపై ఆశపెట్టుకొని మేకపోతు గాంభీర్యంతో విలువలేని ప్రగల్భాలు పలుకుచున్న హిట్లరుకుకూడా ఈ సమావేశం గొడ్డలిపెట్టే.

రష్యాలోని హిట్లరు సైన్యాల పరిస్థితి ఏమిటి ? రెడ్‌ఆర్మీ ధాటికి ఆగలేక వెనక్కిపోతున్నాయి. సోవియట్ సైన్యాలు మోజిగ్, ష్లోబిన్, రాగచెవ్‌లవైపుకు విజృంభించి సమీపించుతున్నాయి. కీవ్‌రంగంలో కొరోస్టిన్ జర్మన్లవశమయింది. జర్మన్లువిశేషనష్టంతో ఈ విజయాన్ని సాధించారు. కాని ఇది జర్మను బలాన్ని తెలియజేయదు. నిస్పృహతో కొట్టిన దెబ్బ ఇది. నీపరు మలుపులోని తమ సైన్యాలకు ప్రమాదం రాకుండటానికే, ఇంతగా ఇక్కడ కేంద్రీకరించి జర్మనీ ఈ విజయం సాధించింది. కాని కీవువైపు రష్యన్ శ్రేణులను భేదించలేకపోయింది.

నీపరు మలుపులోని జర్మను సైన్యాలకు సప్లయి మార్గంలో కీలకస్థానమైన జ్నమెంకాను రెడ్‌ఆర్మీ సమీపిస్తోంది. చెర్కాసీ, క్రెమన్‌చుగ్ ప్రదేశాలలో భయంకరయుద్ధాలు సాగుతున్నాయి. నీపరు మలుపులోని జర్మను సైన్యాలకు ప్రమాదం నానాటికీ హెచ్చుతోంది.

ఇట్టి పరిస్థితులలో చర్చిల్- రూజ్‌వెల్టు- స్టాలిన్‌ల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రెండవరంగంగూర్చి వివరంగా చర్చించబడి ఉంటుంది. బేషరతుగాజర్మనీ లొంగిపోవాలని కోరియుంటుంది. హిట్లరుకూ, హిట్లరుముఠాకు అంతిమఘడియ సమీపించిందనడానికి ఎట్టి సందేహమూలేదు.

6—12—43

★

రచనలు కావాలి.

ఆంధ్రరాష్ట్ర అభ్యుదయ రచయితల సంఘం తరఫున సంక్రాంతి నాటికి "అభ్యుదయ రచనల సంపుటి"ని ప్రచురిస్తున్నాము. రచయితలు విరివిగా తోడ్పడి సంచికను జయప్రదం చేయాలని మనవి. ఈనెలాఖరుకే రచనలన్నీ ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘం; మెయిన్‌రోడ్డు; గవర్నరుపేట, బెజవాడకు చేరాలి.

—చదలవాడ పిచ్చయ్య.

ఈ చర్య జాతీయాభివృద్ధికి ఘోరమైనఆటంకం

మద్యపాన నిషేధంపట్ల మద్రాసుప్రభుత్వ వైఖరి ఖండన

మదరాసురాష్ట్ర ట్రేడ్‌యూనియన్ కౌన్సిల్ మదరాసు కమ్యూనిస్టుపార్టీ కమిటీ, మదరాసు విద్యార్థిసంఘం, 23 మద్రాసు కార్మిక సంస్థలు, కలిసి 30-11-43 వ తేదీని రాబిన్‌సన్ పార్కులో బ్రహ్మాండమైన బహిరంగ సభను జరిపాయి. ఇసుక వేస్తే రాలకుండా పార్కు జనులతో క్రిక్కిరిసిపోయింది. వి. చక్కరైచెట్టిగారు సభ కధ్యక్షత వహించారు. శ్రీ పి. ఆర్. కె. శర్మగారు, రాజాజీ, అల్లా పిచ్చై, కిస్సెన్ మొదలైన పురప్రముఖులు మద్యపాన నిషేధంపట్ల మద్రాసు ప్రభుత్వం ప్రదర్శించిన వైఖరిని ఖండిస్తూ, ఉపన్యాసాలిచ్చారు. "జనవరి 1వ తేదీని ఎన్నివేల మందిరైతుస్త్రీలు గొల్లునఏడుస్తారు! వేలకొద్దీ కార్మికుల-కర్షకుల తల్లులు, భార్యలు సంవత్సరాదినాడు ప్రభుత్వాన్ని తిట్టిపోస్తారు," అని రాజాజీ ఉద్రేకంతో మాట్లాడాడు. ఈ చర్య జాతీయాభివృద్ధికి ఘోరమైన ఆటంకం కొబట్టి వెంటనే ప్రభుత్వం తమ ప్రకటనను ఉపసంహరించుకోవలసిందని కోరుతూ సభలో ఏకగ్రీవంగా తీర్మానించబడింది.

"మద్యపాన నిషేధాన్ని అపుచేయడం ప్రజల మానసిక, భౌతికాభివృద్ధులకు మహాపకారం చేస్తుంది. ప్రపంచమందలి అన్ని మతాలు మద్యపానాన్ని నిషేధిస్తున్నాయి. ఈ మతశాసనాన్ని తృణీకరించిమద్రాసుప్రభుత్వం వారు మద్యపానాన్ని చట్టసమ్మతమైన దానిగా చేశారు," అంటూ మదరాసు రాజధాని ముస్లింలీగ్ గౌరవకార్యదర్శులు ప్రకటించారు.

ఇలాగే, ప్రభుత్వ చర్యను ఖండిస్తూ యీ క్రింది సంస్థలు తీర్మానాలు చేశాయి: కృష్ణాజిల్లా రైతుసంఘ కార్యవర్గం; కృష్ణాజిల్లా యువజనసంఘ సాధారణసభ్యుల సమావేశం; నెల్లూరు తాలూకా రైతుసంఘం; గుడివాడ తాలూకా రైతుసంఘ సాధారణ సభ్యుల సమావేశం; గన్నవరం తాలూకా మహిళా సంఘం; రాజంపేట (కడపజిల్లా) బహిరంగసభ.

★ ఎం. యస్. యం. రైల్వే కార్మికుల మహాసభ

క్షామనివారణకొరకు, దేశరక్షణకొరకు రైళ్లను నైపుణ్యంగా నడపాలి

చిన్న రైల్వేపట్టణమైన గుంతకల్లు జీవితంలో నవంబరు ఆఖరువారం చరిత్రాత్మకమైనది. జపాన్ దుండగీడుల దురాక్రమణ ప్రమాదానికి సమీపంగా, తూర్పు సముద్రతీరంలో ఎం. యస్. యం. రైల్వేవుంది. ఈ రైల్వేకార్మికులు రైల్వేయూనియన్లలోచేరి, క్లిష్టసమయంలో రైళ్ళ రాకపోకలకు ఎట్టి అంతరాయంకలుగకుండా తమతమస్థానాలలో నిలబడి నడుపుతామని తమ దృఢనిశ్చయాన్ని వెల్లడించారు. అదే ప్రకారంగా గతసారి జపాన్ విమానదాడుల సమయంలో రైల్వే ట్రాన్‌స్పోర్టును చక్కగా నడిపారు. కరువు ప్రాంతాలకు ఆహారపదార్థాలను సరఫరాచేయడంలో సాయపడుతున్నారు.

అంతేగాక ఆంధ్రదేశంలో ముఖ్యపరిశ్రమ రైల్వేలే అని చెప్పాలి. ఎం. యస్. ఎం. రైల్వేలైనులో హెచ్చుభాగం ఆంధ్రప్రాంతంలోనే వుంది. దాదాపు 50 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. 12 శాఖలతో అలరారుతున్న ఎం. ఎస్. యం. రైల్వే కార్మిక సంఘాల్లో 17 వేల సభ్యులున్నారు. ఈ సంఘంయొక్క 17 వ వార్షిక మహాసభ నవంబరు 28, 29 తేదీలలో గుంతకల్లులో జరిగింది. 27 వ తేదీ సాయంకాలం, 28 ఉదయం గుంతకల్లుచేరే రైళ్ళలో మహాసభకు ప్రతినిధులు వచ్చారు. గుంతకల్లు రైల్వే స్టేషను రైల్వే కార్మికుల నినాదాలతో ప్రతిధ్వనించింది. మహాసభకు వివిధ శాఖలనుంచి 179 మంది ప్రతినిధులు, సెంట్రల్ కార్యనిర్వాహక సభ్యులు 36 గురు, ప్రేక్షకులు 100 మంది హాజరయ్యారు. వీరుగాక గుంతకల్లులోని రైల్వే కార్మికులు వందలకొలది యీ ఉత్సవాలలో పాల్గొన్నారు.

జెండా ప్రతిష్ఠాపన

28 తేదీ ఉదయం 400 మంది ఊరేగింపుతో మహాసభ ప్రారంభమయింది. దేశరక్షణకొరకు, క్షామనివారణకొరకు రైళ్ళను చక్కగా నడపాలనే నినాదం మారుమ్రోగింది. కార్మిక నాయకులను, జాతీయ నాయకులను విడుదలజేయాలని, యుద్ధఅలవెన్సును వృద్ధిచేయాలని, కాంగ్రెస్ - లీగ్ ఐకమత్యం కావాలనీ, జాతీయప్రభుత్వం స్థాపించాలని, నినాదాలివ్వబడ్డాయి. ఎం. యస్. యం. రైల్వేయూనియన్‌కు, అఖిలభారత రైల్వే కార్మిక సంఘానికి, ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్‌కు, జయజయ ధ్వానాలతో గుంతకల్లు ప్రతిధ్వనించింది. ఊరేగింపు అనంతరం నైజామ్ స్టేట్ రైల్వే కార్యదర్శి రామచంద్రరావుగారు ఎర్ర జెండాను ఎగురవేశారు. కార్యక్రమం ప్రకారం కామ్రేడ్ ముఖ్దుమ్ రాజాలనందున తాము వారిస్థానే కార్మిక జెండాను ప్రతిష్టించుతున్నామని ఉపన్యసించారు. కార్మిక బాలురు జెండాపాటను పాడారు.

మధ్యాహ్నం 2 గంటలు మొదలు 5 గంటలవరకు రైల్వే ఇన్‌స్టిట్యూట్ హాలులో వైజ్ఞానిక ప్రదర్శనాలు జరిగాయి. బాలసంఘ సభ్యులు, స్థానిక కార్మికులు ఫకీరు, కోయవేషాలు, అన్నాచెల్లెలు సంవాదం, గెరిల్లాపాట, వగైరా ప్రదర్శించారు. అన్నిటిలో నేడు ప్రజలందరిని ఎదుర్కొంటున్న హిందూ ముస్లిం ఐక్యత, దేశరక్షణ, నాయకుల విడుదల, క్షామనివారణ వగైరాసమస్యలను ప్రజాసామాన్యానికి విశదీకరించారు. ఈ ప్రదర్శనాలనంతరం అఖిలభారత ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కామ్రేడ్ డాంగే విజ్ఞాన ప్రదర్శనాలను గురించి ముచ్చటించారు. ప్రజలు సాధారణంగా ఫకీరులను, బిచ్చగాండ్రను చూస్తూనే ఉంటారు. కాని ప్రదర్శనాలలో చూచినవారికి, రోజూచూచేవారికి భేదముందన్నారు. పెట్టుబడిదారీ విధానం క్రింద భుక్తిగడువక, కృశించిపోయి, బిచ్చమెత్తుకుంటూ, క్రమంగా నశించిపోయే బిచ్చగాళ్ళను రోజూ చూస్తుంటాము. కాని, యీ ప్రదర్శనాలలో బిచ్చగాళ్ల నిరుద్యోగానికి, కరువుకు కారణం చూపుతున్నారు. వాటిని తొలగించడానికి, ప్రజలను సమీకరించడానికి కృషిచేస్తున్నారు. అందుచేతనే దీనిని ప్రజల విజ్ఞాన కళాప్రదర్శనాలంటున్నా మన్నారు. ఎర్రజెండాపాటను గురించి చెబుతూ 'ఒక మతానికిగాని, కులానికిగాని, చెందినదికాదు. ఎర్రజెండా కష్టజీవులది. అంతర్జాతీయ జెండా; అభ్యుదయానికి, నూతన నాగరికతకు చిహ్నం'మన్నారు. ఇలాంటి ప్రదర్శనాలను, ప్రజలు ప్రోత్సహించి పాల్గొనడంద్వారా నూతన ప్రజావిజ్ఞానాన్ని నిర్మించాలన్నారు.

మహాసభ

సాయంకాలం 5-30 గంటలకు మహాసభ ప్రారంభమయింది. అధ్యక్షులయిన శ్రీ గురుస్వామిగారు తొందరపనులవల్ల రాజాలకపోయినందున, ఉపాధ్యక్షులయిన కామ్రేడ్ వెంకటేశ్వరావు అధ్యక్షత వహించారు. ఆహ్వాన సంఘాధ్యక్షులైన కామ్రేడ్ అబ్దుల్లా ఈ సమావేశం దేశాన్ని-ప్రజలను ఎదుర్కొంటున్న కరువు దేశరక్షణ సమస్యల పరిష్కారానికి, మార్గం చూపుతుందని ఆశించుతున్నామన్నారు. తరువాత అధ్యక్షులు ఉపన్యసించారు. దేశంలో వ్యాపించివున్న కరువు కాటకాలను తొలగించడానికి, దేశాన్ని కాపాడటానికి, రైల్వే కార్మికులు ట్రాన్‌స్పోర్టును నైపుణ్యంతో నడపాలన్నారు. రైల్వే కార్మికుల ఇబ్బందులను తొలగించుకోడానికి నూటికి నూరుమంది సంఘంలోచేరి బలపరచాలనీ, ఐకమత్యంతో కృషిచేయాలనీ స్పష్టపరచారు.

తరువాత రాజగోపాలచారి, డాక్టర్ సుబ్బరాయన్, ఫ్రాంక్ ఆంతోనీగార్లు, యితర కార్మిక సంఘాలు పంపిన సందేశాలు చదువబడ్డాయి. సౌత్ఇండియా రైల్వే కార్మిక సంఘం పంపిన సందేశంలో తామెలా ట్రాన్‌స్పోర్టును వృద్ధిచేస్తున్నారో, యిదివరకు 40 వాగన్లు బాగుచేసే వర్కుషాపులో 100 వాగన్లు బాగుచేస్తున్నారో తెలుపుతూ సోదర కార్మికులకు అభివందనాలు పంపారు.

ఎం. యస్. యం. రైల్వే కార్మిక యూనియన్ జనరల్ సెక్రటరీ కామ్రేడ్ కె. యల్. నరసింహం, క్రిందటి ఏడాది యూనియన్ కార్యకలాపాన్ని గురించి రిపోర్టుచదివారు. గత సంవత్సరంలో యూనియన్ సభ్యత్వం 3 వేలు పెరిగి, మొత్తం 17 వేలు అయిందన్నారు. కార్మికుల యిబ్బందులను తీర్చడానికి అధికారులతో జరిపిన రాయబారాలను గురించి వివరించారు. బ్రాంచి ఆఫీసులకు స్థానికాధికారులతో సంప్రదించే హక్కును సంపాదించామన్నారు. అధికధరల అలవెన్సు కొరకు, కార్మికులకు ఆహారపదార్థాలు అందజేయడానికి, గ్రెయిన్‌షాప్స్ కొరకు, చేసిన కృషిని, పొందిన విజయాలను గురించి చెప్పారు. యూనియన్‌లో కార్మికులందరూ చేరి బలపరచాలనీ, సెంట్రల్‌ఆఫీసు తరపున పత్రికను నడుపాలనీ, అందుకొరకు 10 వేల రూపాయలనిధిని వసూలుచేయాలనీ, ప్రస్తుతం సంఘాలులేని ఇతర ప్రాంతాలకు యూనియన్ వ్యాపించాలనీ తెలుపుతూ రిపోర్టును ముగించారు.

కామ్రేడ్ డాంగే ఉపన్యాసం

అఖిలభారత ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్ అధ్యక్షులైన కామ్రేడ్ డాంగే తమ ఉపన్యాసాన్ని ప్రారంభించారు. "అఖిలభారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు మీకు అభివందనాలు అందజేస్తూవుంది. భారతదేశ కార్మికవర్గంలో మీరు ఒకభాగం. 5 లక్షల కార్మికుల సంఘటితశక్తితో ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్ మీకు అండగా వుంది. వారి కష్టాల నివృత్తికి మీరు, మీకు వారు, సహాయభూతులుగా వుండాలి. మిమ్మల్ని ప్రజాసౌకర్యాలకై పాటుబడమని అఖిలభారత ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్ కోరుతూంది. కార్మికులు తమ భుక్తికోసం, ప్రయోజనాలనిమిత్తం, ఉత్పత్తి చేస్తూ, తద్వారా ప్రజాక్షేమంకోసంకూడాపాటు బడుతున్నారు. 'ఇతరుల విషయం నాకెందుకులే; నా విషయం నేను చూచుకుంటా' ననే ఎలిగాకితత్వం ప్రజలకు, కార్మికులకు అందరికి అరిష్టదాయకం. సర్వనాశనానికి దారితీస్తుంది. పెట్టుబడిదారుల, సామ్రాజ్యవాదుల, తిండిదొంగల, స్వార్థం ఇలాంటిదే. కార్మికుల స్వప్రయోజనాలు (Self interests) అలాంటివికావు. కార్మికులు భుక్తి కొరకు పనిజేస్తూ, ప్రజలకు స్వేచ్ఛా, సౌకర్యాలు కలుగజేసే వస్తు సముదాయాన్ని తయారుచేస్తున్నారు. పెట్టుబడిదారుల ప్రయోజనాలు ప్రజల గొంతులు కోస్తున్నాయి. వ్యాపారస్థులు అధికలాభాలకోసం ఆహారపదార్థాలు దాస్తే, కరువువచ్చి ప్రజలు మలమల మాడిపోతున్నారు. ఉదాహరణకు గుడ్డల ధర విపరీతంగా పెరిగిపోయింది. కారణం, దేశంలో గుడ్డలేకనా? కాదు. ఈరోజున దొంగమార్కెటులోవున్నది బయటకులాగితే, మామూలుకంటె నూటికి 33 వంతులుఎక్కువ గుడ్డ దేశంలో వుంది. దానిని పంచితే ప్రతి వ్యక్తికి 21 గజాలు వస్తుంది. కాని, అధిక లాభాలకుస్వార్థచింతతోవ్యాపారస్థుడు గుడ్డను దాచి, దేశప్రజలకు ధరించడానికి గుడ్డ అందుబాటులో లేకుండా చేస్తున్నాడు. అదేవిధంగా ఈ రోజున లక్షలకొలది బెంగాలులో ప్రజలు ప్రాణాలు గోల్పోతున్నారంటే, అందుకు కారణం తిండిదొంగలే. వీరు తమ్మస్వార్థానికి దేశప్రజలను బలియిస్తున్నారు. కార్మికుల ప్రయోజనాలు అలాగాకుండా, ఒకఆదర్శంతో కూడినవై, ప్రజాక్షేమానికి దారితీస్తున్నాయి."

ఇంకా మాట్లాడుతూ, నేడు ప్రపంచమంతటా సామ్రాజ్యవాద మొనగాళ్ళయిన ఫాసిస్టు నరహంతకులనుండి, నిరంతర కష్టాలనుండి, బయటపడటానికి, ప్రపంచప్రజలు తమ శక్తికొలదీ పోరాడుతున్నారు. నేడు ప్రతిదేశప్రజల స్వాతంత్ర్యపోరాటం ప్రపంచప్రజల స్వాతంత్ర్య పోరాటంలో ఒకభాగం అన్నారు. కరువును వ్యాపింపజేసి, స్వాతంత్ర్యం కొరకు తిరుగుబాటు తేవచ్చుననుకోవడం ఆర్థికసూత్రాలనే అపార్థం చేసికోవడమవుతుంది. 3 నెలలక్రితం కంటె నేడు వారానికి వేలకొలది చనిపోతున్న బెంగాల్‌లో ప్రజల విప్లవచైతన్యం, స్వాతంత్ర్యకాంక్ష, పెరిగిందని ఎవరైన అనగలరా? అని ప్రశ్నించారు. ఫ్రెంచి విప్లవం రైతుల ఉత్పత్తిశక్తిని 3 రెట్లు హెచ్చుచేసింది. రష్యన్ విప్లవం మరెన్నోరెట్లు హెచ్చుచేసిందని తెలిపారు.

కరువు నివారణకు, దేశరక్షణకు, జాతీయైక్యత అవుసరాన్ని తెలియజేశారు. జాతీయైక్యతకు కార్మికులమధ్య ఐకమత్యం నిర్మించడం అవుసరమన్నారు. జమాల్‌పూర్‌లో రైల్వే ఫెడరేషన్ నుంచి 4 రైల్వేలను తొలగించి, కార్మికులలో చీలికలు తేజూస్తున్న ప్రభుత్వ ఏజెంట్ల చర్యను నిరసించారు. దేశాన్ని-ప్రజలను రక్షించాలంటే రైల్వే కార్మికులు ట్రాన్‌స్పోర్టును అభివృద్ధి చేయాలనీ, నూటికినూరుమంది యూనియన్‌లోచేరి తమ కనీసకోర్కెలను సాధించాలని తేటతెల్లం చేశారు.

రెండవనాడు

29 వ తేదీ మరల మహాసభ సమావేశమయింది. జాతీయ నాయకులును-కార్మిక నాయకులునుఅయిన గిరి, మాటేలను విడుదల చేయాలనీ, లీగ్-కాంగ్రెసు ప్రజానాయకులతోకూడిన జాతీయప్రభుత్వం స్థాపించాలనీ, తీర్మానించబడింది. మిలిటరీ యూనిట్లలో చేరిన కార్మికులు ఊరేగింపులలో పాల్గొనరాదనీ, రాజకీయాలు చర్చించరాదనీ నిషేధించుతూ పంపిన 45 నెం. ఆర్డరును ఉపసంహరించుకోవాలని తీర్మానించబడింది. ఎక్కువ గ్రెయిన్‌షాపులుపెట్టి అన్నిపదార్థాలు అందచేయాలని, యుద్ధఅలవెన్సు రూ. 30/- యివ్వాలని తీర్మానించారు. వివిధ డిపార్టుమెంటులకు చెందిన రైల్వేకార్మికుల ఇబ్బందులను తొలగించాలని కోరుతూ మెమొరాండం తయారుజేసి, అధికారులతో రాయబారాలు జరుపాలని సెంట్రల్ ఆఫీసును కోరుతూ తీర్మానించారు.

ట్రాన్‌స్పోర్టును అభివృద్ధి చేయాలనీ, బొగ్గుఖర్చును తగ్గించాలనీ, సైనికావసరాలను సప్లయిచేయడానికి, కరువు ప్రాంతాలకు ఆహారపదార్థాలను అందజేయటానికి తోడ్పడాలనీ, అందుకొరకు ప్రస్తుతం అమలులో వున్న పద్ధతులను అభివృద్ధి చేయాలనీ మార్పులుకొన్నిసూచించడానికికార్మికుల ప్రతినిధులు, యజమానుల ప్రతినిధులు, ప్రభుత్వ ప్రతినిధులు ఉన్న జాయింటు కమిటీలను ఏర్పాటుచేయాలనీ, తీర్మానించారు. మాజీ కార్యదర్శి అయిన శ్రీ వెంకటస్వామినాయుడు గారి మరణానికి చింతిల్లుతూ, వారిబంధువులకు సానుభూతి తెలయజేశారు.

మధ్యాహ్నం జరిగిన మహాసభలో నూతన కార్యనిర్వాహకవర్గం ఎన్నుకోబడింది. అధ్యక్షులుగా శ్రీ యస్. గురుస్వామిగారు ఎన్నుకోబడ్డారు. ఉపాధ్యక్షులుగా కామ్రేడ్ శ్రీనివాసులునాయుడు, మహమ్మద్ అబ్దుల్లాగార్లు ఎన్నుకోబడ్డారు. కామ్రేడ్ కె. యల్. నరసింహం ప్రధానకార్యదర్శిగాను, కామ్రేడ్స్ యస్. దేవసుందరం, యస్. నటరాజన్ సంయుక్త కార్యదర్శులుగను, యస్. బాలక్రిష్ణకోశాధిపతిగాను ఎన్నుకోబడ్డారు.

రాత్రి 10 గంటలకు బుర్రకథలు, "హిట్లర్ పరాభవం" అను వీధినాటకం ప్రదర్శింపబడ్డాయి. 800 మంది ప్రజలు హాజరయ్యారు. ఈ వైజ్ఞానిక ప్రదర్శనాలను కొనియాడుతూ దొనకొండబ్రాంచి కార్యదర్శి కామ్రేడ్ రామకోటయ్యగారు ఉపన్యసించారు. ఇలాంటి ప్రదర్శనాలద్వారా ప్రజలలో సులభంగా రాజకీయ చైతన్యం కలుగజేయవచ్చుననీ, కార్మిక సంఘాలు వీటిని అభివృద్ధిచేయాలనితెలిపారు.

ఈ రైల్వే మహాసభను గురించి వ్రాసేటప్పుడు గుంటకల్లు బ్రాంచి ఆర్గనైజరు కామ్రేడ్ నారాయణస్వామి, ఆహ్వానసంఘ కార్యదర్శి కామ్రేడ్ స్టాన్లీలను గురించి వ్రాయకపోతే వ్యాసం పూర్తికాదు. వీరు మహాసభకు ఏర్పాట్లు చేయడంలోనే ఎల్లపుడు నిమగ్నులయి వుండేవారు. వాలంటీరులుగా వున్న కార్మికసంఘ బాలురు సైనికులవలే పనిజేశారు. మహాసభలో ఆంగ్లో ఇండియన్ సోదరులైన కామ్రేడ్స్ కాన్వే, స్టాన్లీ తదితరులు పాల్గొనడం మరొక విశేషం. అనగా యం. యస్. యం. యూనియన్ కార్మికులందరికి-హిందువులకు, ముస్లింలకు, ఆంగ్లో ఇండియన్‌లకు, ఆంధ్రులకు, తమిళులకు, కన్నడులకు-అన్నిజాతుల కార్మికులకు ప్రాతినిధ్యంవహించుతుందనడానికి ఇదొకచిహ్నం. మహాసభలోని ఉపన్యాసాలను, చర్చలను ఇంగ్లీషు, తెలుగు, అరవం, కన్నడం, ఉర్దూ భాషలలోకి అనువాదం చేయబడవలసి వచ్చింది. ఇది కష్టసాధ్యమయినా యూనియన్ అన్నిమతాల, జాతుల, రైల్వే కార్మికుల ప్రతినిధి అని చాటుతోంది.

— మా విలేఖరి.

Printed and Published by Katragadda Rajagopala Rao at Prajasakti Press, Governorpet - Bezwada.

END OF ISSUE